# మాదిరెడ్డి సులోచన

# భిన్న ధృవాలు



**BHINNA DHRUVAALU** (Novel)
Madireddi Sulochana

© M. Ramakrishna Reddy

*Published by :*
Navodaya Publishers
Karl Marx Road
Vijayawada - 520 002
Phone : (0866) 2573500
email : vjw_booklink@yahoo.co.in

March 2008

*Laser Type Setting :*
**Sri Sri Printers**
Vijayawada - 520 002
Ph. : 9490634849

*Printed at :*
**Sri Chaitanya Offset Printers**
Vijayawada - 520 002

*Price :*
Paperback : Rs. 55/-
Hord Bound : Rs. 75/-

ఈ పుస్తకం పై వచ్చే పారితోషికం
**కరుణశ్రీ సేవాసమితి**
(హైదరాబాద్) వారికి చేరుతుంది.

## మా మనవి

**తిరిగి** యిన్నేళ్ళకు మాదిరెడ్డి సులోచన నవలలు మీ ముందుకు వచ్చాయి. దాదాపు నలభై యేళ్ళ క్రితం, అచ్చమైన తెలంగాణా వాతావరణం, పొందికైన మానవ సంబంధాలూ కలగలిపి చక్కని యితివృత్తాలు ఆమె సాహిత్యంలో కనిపిస్తాయి. డెబ్బై పైగా నవలలు ఆమె రచించారు. వాసిలోనూ, రాసిలోనూ కూడా సులోచన రచనలు ఎన్నతగినవే. ఆమె ప్రమాదవశాత్తూ అకాలమరణం పాలు కాకుండా వుంటే, మరెన్ని మంచి నవలలు రాసి వుండేవారోననేది ఊహకు మాత్రమే మిగిల్చి వెళ్ళిపోయారు.

ఇప్పుడు అంటే నూతన సహస్రాబ్ది తొలిదశకంలో యీ నవలల్ని చదువుతున్నపుడు కొన్ని కొన్ని సందర్భాలలో పాఠకులకు అసహజంగా వున్న భావన కలిగే అవకాశం వుంది. ఎందుకంటే గడచిన నలభై సంవత్సరాలలో ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఆనాటి రూపాయికి, నేటి రూపాయికి పొంతన లేదు. కొన్ని వూళ్ళపేర్లు, కొన్ని మాటల అర్థాలు సైతం మారిపోయాయి. వేషధారణ మారింది. దూరాలు తగ్గిపోయాయి. భూగోళం గుప్పెట్లో వొదిగిపోయింది. ఆనాడు వంద రూపాయలంటే చాలా పెద్ద మొత్తం. నేడు అది చిల్లరడబ్బు. కనుక ఇలాంటివి మాదిరెడ్డి నవలలలో తారసపడినప్పుడు విజ్ఞులైన మా పాఠకులు కాలంతో అన్వయించుకుని అర్థం చేసుకోగలరని ఆశిస్తున్నాము. ఆచార వ్యవహారాలలో, మాటతీరులో వున్నట్టుండి ఎన్నో మార్పులు వచ్చాయి. గత పదిహేను యిరవై సంవత్సరాలలో యీ మార్పు అత్యంత వేగంగా జరిగింది.

ఎన్ని మార్పులు వచ్చినా మానవనైజాలు, ప్రవృత్తులు ఎన్నటికీ మారవు. ప్రేమ, ద్వేషం, స్వార్థం లాంటి ముడిదినుసుకు యెన్ని తరాలు గడిచినా చలనం వుండదు. అందుకే మాదిరెడ్డి సులోచన కాల్పనిక సాహిత్యంలో మౌలిక అంశాలు నేటికీ నూతనంగానే వుంటాయి. మా సంస్థ 50 సంవత్సరాలలోకి అడుగుపెట్టిన తరుణంలో వుత్తమ విలువలను ప్రోది చేసిన మాదిరెడ్డి నవలలను పునర్ముద్రించడం మాకెంతో ఆనందంగా వుంది. వీటిని తెలుగు పాఠకులు సొంతం చేసుకుని, చదివి ఆనందిస్తారని మా ఆకాంక్ష.

విజయవాడ
1.10.2007

నవోదయ పబ్లిషర్స్

# భిన్నధృవాలు

హుస్సేన్ సాగర్ ఒడ్డున చూపరులను ఇట్టే ఆకర్షించే మేడ చాలా అధునాతనంగా కట్టబడి ఉంది. బయటి నుండే ఇంటి సౌందర్యం తిలకించాలన్నట్టు కట్టిన చిన్న అందమైన ప్రహరీ, చక్కటి ఇనుపకమ్మీల గేటు, ఒక గేటు రెక్కపై 'ప్రశాంతి' అని రెండవ దానిపై 'నిలయము' అని చక్కని అక్షరాలపై సిల్వర్ పెయింటుంది. రంయిమని దూసుకువచ్చిన ఇంపాలా కారు గేటు మూసి ఉండటంతో ఆగిపోయింది. డ్రైవింగ్ చేస్తున్న యువకుడు గట్టిగా హార్న్ వత్తాడు. చెట్లకు నీళ్ళు పెడుతున్న మాలి పైపు వదిలి గేటు తీశాడు. తోటలో అడుగుపెడుతున్న అతనికి స్వర్గద్వారంలో ఉన్నట్లు అన్పించసాగింది. 'అదృష్టం కలిసి వస్తే ఇలాంటిదే ఇల్లు కట్టుకోవాలి.' అనుకున్నాడు కారు పార్కు చేస్తూ.

"హల్లో విద్యా!" హడావుడిగా ఇంట్లోంచి ఓ యువకుడు వచ్చాడు.

"నమస్తే వేణు." ఇద్దరూ చేతులు కలుపుకున్నారు. విద్యాసాగర్, వేణు ఇద్దరూ స్టేట్స్‌లో కలుసుకున్నారు. వేణు సంవత్సరం క్రితమే స్వదేశానికి తిరిగి వచ్చి వివాహం చేసుకుని స్థిరపడ్డాడు. విద్యాసాగర్ నెలక్రితం తిరిగి వచ్చాడు. వెంటనే ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం దొరికింది. వెయ్యి రూపాయల జీతం.

"నేను చెప్పిన విషయం గుర్తుందిగా?" వేణు అడిగాడు.

"గుర్తుంది." చిరునవ్వుతో జవాబు చెబుతుంటే, అతని కళ్ళల్లో ఒక్కసారి ప్రశాంతి రూపం తళుక్కుమని మాయం అయింది. ఇద్దరూ ముందుకు సాగేరు. ఇంట్లోకి వెళ్ళగానే రఘుపతిగారు యెదురు వచ్చారు.

"నమస్తే..." విద్యాసాగర్ చేతులు జోడించాడు.

"నమస్తే... నమస్తే... రా బాబూ." ఆప్యాయంగా చెయ్యి నొక్కి వదిలాడు. అందరూ కూర్చున్నారు. ముగ్గురికీ చల్లని పానీయాలు తీసుకుని వేణు భార్య సునంద వచ్చింది.

"ప్రశాంతి, ప్రణతి ఏరి?"

"మేడమీద పేకాడుతున్నారు. మీరు అక్కడే కూర్చుందురుగాని పదండి. చక్కగా హుస్సేన్‌సాగర్ అలలను చూడవచ్చు."

"వెళ్ళండి వేణూ! నేను వెళ్ళి మీ అమ్మను తీసుకు వస్తాను." రఘుపతి లేచాడు.

"అమ్మగారు ఇంట్లో లేరా?"

"షాపుర్‌వాడికి వెళ్ళింది. తెలిసిన వారింట్లో సత్యనారాయణవ్రతం. పిలిచారు. ఆవిడ నమ్మకాలు ఆవిడకున్నాయి."

షర్బత్ త్రాగి పైకి వెళ్ళారు. వరండాలోకి వెళ్ళబోతూ ఆగాడు విద్యాసాగర్. పేక పట్టుకున్న ప్రశాంతి అతని కళ్ళకు అప్సరసలా కన్పించింది. ఆలివ్ గ్రీన్ షిఫాన్ చీర, స్లీవ్‌లెస్ జాకెట్టు, ఒత్తుగా కత్తిరించిన జుట్టూ, చెవులకు వ్రేల్లాడుతున్న లోలాకులు. ఆకుపచ్చ చుక్కబొట్టుతో అందమంతా తన సొమ్మే అన్నట్టుంది. పసినిమ్మపండులావున్న శరీరచ్ఛాయతో ఆకుల మధ్యనుండి తొంగి చూసే సంపంగిలా ఉంది. విధాతకెంత పక్షపాతం! పచ్చగా, అన్నింటా అక్కకు తీసిపోనట్లున్న ప్రణతి అక్కలా నాజూకుగా లేదు. మొగవాడి మొరటుతనం ఉంది. చూడగానే రఘుపతి కూతురని ఇట్టే తెలిసిపోతుంది.

"అలా నిలబడి పోయావేం? రా." వేణు పిలుపుకు ఉలిక్కిపడి ముందుకు వెళ్ళాడు. ప్రశాంతి, ప్రణతి ఇద్దరూ ఇటు తిరిగి చూశారు. పేక క్రిందపడేసి లేచి నమస్కరించారు.

"నమస్తే..." అని వారి దగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"అన్నయ్యా! మేం సినిమాకి వెళ్దాం అనుకున్నాము." ప్రశాంతి లేచింది. విద్యాసాగర్ ముఖం చిన్నబోవటం వేణు గమనించాడు. అతనికి చెల్లెలిమీద విపరీతమైన కోపం వచ్చింది. అయినా అప్పుడు బయటపడే సమయం కాదని ముఖం మీదికి నవ్వు తెచ్చుకున్నాడు.



"ముందే చెప్పకూడదూ? నాన్నగారు కారు తీసుకు వెళ్ళారు. సెకెండ్ షోకి అందరం వెడదాం."

"విద్యాసాగర్ గారి కార్లో వెడితేనేం?"ప్రశాంతి అడిగింది.

అతని ముఖం సంతోషంగా వెలిగిపోవటం ఆమె గమనించింది.

"ఈ రోజు వెళ్ళకపోతేనేం శాంతీ."

"నేను వెళ్ళాలి అనుకున్నరోజు వెళ్ళి తీరాల్సిందేనన్న సంగతి నీకు తెలుసన్నయ్యా." అంది నిర్లక్ష్యంగా.

"అదీ కాక ఇప్పుడు ముంచుకుపోయే పనులేం ఉన్నాయి?" తదేకంగా చెల్లెలు ముఖంలోకి చూస్తున్న వేణుకు తళుక్కుమని బుర్రలో ఓ ఆలోచన వచ్చింది. విసుగుతో ముడుచుకుపోయిన అతని కనుబొమ్మలు విడివడ్డాయి. మరేం తర్కం చెయ్యలేదు.

"ఇప్పుడు అయిదయింది. ఫలహారం తీసుకుని వెళ్ళండి" అన్నాడు. మాటల్లోనే సునంద ఫలహారం ట్రే పట్టించుకు వచ్చింది. అన్నా, వదిన ఆరాటం, ఆర్భాటం చూడగానే విద్యాసాగర్ రాకలోని అంతరార్థం ఇట్టే పసిగట్టింది ప్రశాంతి. చిన్నగా నవ్వుకుంది.

"సునీ! తయారవు సినిమాకు వెడదాం."

"అలాగే." సునంద వెళ్ళింది. ప్రశాంతికో కొంటె ఆలోచన వచ్చింది. ప్లేటులోంచి గారె తీసింది. మునిపంటితో కొరికింది.

"అబ్బా!" అంటూ దూరంగా గిరాటేసింది.

"ఏమిటి శాంతీ?"

"ఎంత కారమో..." అది.

"నిజమా ?" వేణు ఒక వడతీసి నమిలాడు. "నీ వడలో మిరపకాయ ముక్క ఉండాలి శాంతీ! అసలు కారం లేదు" అన్నాడు.

"అవును అక్కా, చప్పగా ఉన్నాయి" అన్నది ప్రణతి.

"ఏమండీ సాగర్ గారు మీరు చెప్పండి." అడిగింది ప్రశాంతి. ఆమె మాటలలో మృదుత్వము, అభ్యర్థన అతనిని పిచ్చివాడిని చేసింది. ఆమెనలాగే ఆరాధనా పూర్వకంగా చూచాడు.

"నిజం వేణూ! నాకూ కారం అన్పించాయి."

ఫలహారాలు పూర్తి అయ్యాయి. అందరూ క్రిందికి వచ్చారు. వేణు గదిలోకి వెళ్ళాడు. పది నిముషాలయినా బయటికి రాలేదు.

"అన్నయ్యా! మీ రహస్యాలకు ఇదేనా సమయం?" అంది అసహనంగా ప్రశాంతి. ఎందుకో విద్యాసాగర్ సమక్షంలో ఒక క్షణం ఉండాలని లేదు.

"పదండి... వస్తున్నా." ముగ్గురూ కార్లో కూర్చుని వేణు దంపతుల కోసం ఎదురు చూడసాగేరు.

"ప్రణూ!"

వేణు కేక విని విసుగ్గా కారుదిగి వెళ్ళింది ప్రణతి. మరో అయిదు నిమిషాలకు బాణంలా దూసుకువచ్చింది.

"సారీ విద్యాసాగర్ గారూ! నా ప్రాణస్నేహితురాలు వస్తుంది. నేను సినిమాకు రాను." అని వెళ్ళిపోయింది. వేణు ఆదుర్దాగా బయటికి వచ్చాడు.

"ప్రశాంతీ! మా బావగారు వస్తున్నారని ఫోను వచ్చింది. నీకంతగా చూడాలని వుంటే సాగర్‌తో వెళ్ళి రా."

ఆమె వచ్చే కోపాన్ని అణచుకుంది. 'కావాలని అతనితో ఒంటరిగా పంపుతున్నారు కానియ్యి' అనుకుంది.

"ఏమండీ, పోదామంటారా?"

అంతకంటే అతడు చెప్పకుండా తీసుకెడితే సంతోషించేది.

"ఊఁ." అన్నది పొడిగా.

"ముందు సీట్లోకి రావటానికి అభ్యంతరమా?"

"నేను వెనుక కూర్చుంటే మీకేమయినా అభ్యంతరమా?"

"అబ్బే.... లేదు." కంగారుగా జేబురుమాలుతో నుదుట పట్టిన చెమట ఒత్తుకున్నాడు. నెమ్మదిగా కారు కదిలిపోయింది.

"ఏ సినిమాకు వెడదాం."

"మీ ఇష్టం."

"బయలుదేరింది మీ ఇష్టంతో..." అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"నాకు ఏ థియేటర్‌లో ఏ పిక్చరుందో తెలియదు."



"నాకంతకన్నా తెలియదు. అమెరికాలో..." అతనేదో చెప్పబోయాడు.

"మనం ఇండియాలో ఉన్నాం. అమెరికా వరకు ఎందుకు లెండి."

"ఓ ఐ సీ..." అతను అదోలా నవ్వి, 'నాకు సినిమా చూసేకంటే మీతో ఒంటరిగా మాట్లాడాలని ఉంది. కమలా నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు వెడదామా?"

"ఎవల్యూషన్ థియరీ అర్థం చెప్తారేమిటి ఖర్మ." అంది.

అతను నవ్వాడు.

ఇద్దరూ కారులో పార్కంతా తిరిగి కారొకచోట ఆపి గార్డెన్‌లో కూర్చున్నారు.

"మీరు... మీరు..."

"ఏమిటండి నేను...?"

అతను జవాబు చెప్పడానికి చాలా తికమక పడుతున్నాడు. ప్రశాంతికి పెద్దగా నవ్వాలనిపించింది, కాని సభ్యత కాదని ఊరుకుంది.

"నాపై.... మీ అభిప్రాయం ఏమిటి?"

"ఎవరండీ ఆ తలకు మాసినవాడు. నా రికమండేషన్‌పై ప్రమోషన్ ఇస్తానన్నాడేమిటి ఖర్మ"

అతను పెద్ద జోక్‌లా గలగల నవ్వాడు. అతను నవ్వుతున్నప్పుడు ముఖం వికారంగా తయారవుతుందన్న సంగతి మొదటిసారిగా గమనించింది ప్రశాంతి.

"అది కాదండీ! మీ అన్నయ్య మీ విషయంలో నా అభిప్రాయం అడిగారు. మీరు చాలా నచ్చారు నాకు."

"థాంక్స్." అన్నది గడ్డి పీకుతూ.

"నేను మీ వాళ్ళందరికీ నచ్చాను. అయితే ఇది పాత పద్ధతి కాదుకదా, ఫారిన్ వెళ్ళొచ్చిన మాలాంటి వారమైనా కాస్త ఫార్‌వర్డ్‌గా ప్రవర్తించాలి కదా! అందుకే మీ అభిప్రాయం మీ నోటి మీదుగా వినాలని, మీ అభిరుచులు గ్రహించాలని..." అతను ఆగాడు. ఆమె తల ఎత్తింది. అతని చూపులు కాంక్షతో వికారంగా కన్పించాయి.

"అభిరుచులా?"

"అవును. ఒకరివి ఒకరికి తెలిస్తే మంచిది కదా! మీ కెవరి పుస్తకాలంటే చాలా ఇష్టం?"

"టెంపోరావ్, భయంకర్..." అతని ముఖంమీద క్షణం ఆశ్చర్యం కదలాడింది. దాన్ని కప్పి పుచ్చుతూ నవ్వాడు.

"నాకూ అవే ఇష్టం లెండి" అన్నాడు.

"నీకు ఎలాంటి సినిమాలంటే ఇష్టం?"

"అగ్గిమీద గుగ్గిలం, చిచ్చర పిడుగు, కదలడు-మెదలడు..."

"ఇవి సినిమా పేర్లా?"

"ఓహో! మీకు తెలియదా?"

"ఎవరికి గుర్తుంటాయి లెద్దురూ... మీరేమయినా నన్ను అడగాలా?" అన్నాడు. నా ప్రశ్నలు అయిపోయాయి అన్నట్టు.

"మీకు కట్నం ఎంత కావాలి?" ప్రశాంతి మాటలకు ఉలికిపడ్డాడు. వేణు చేసిన హెచ్చరిక గుర్తుకువచ్చింది.

"మీరే నా కట్నం..."

"థాంక్స్" అతనికి సంతోషంగా ఉంది. విజయగర్వంతో ఛాతీ వెడల్పు అయింది.

"మీ యింట్లో నామాట కెవరయినా ఎదురు చెప్పే వాళ్ళున్నారా?"

"లేరు. మీరు స్వతంత్రులు."

"మీవారు నాపై అధికారం చెలాయిస్తే?"

"చెలాయించరు. ఎవరయినా ఆ బుద్ధితక్కువ పని చేస్తే వెంటనే దారి పట్టాల్సిందే."

"రియల్లీ?" ఆమె అడిగేతీరు కొంచెం గమనించినా విద్యాసాగర్‌కు ఆమె ఆంతర్యం తెలిసిపోయేది. అతను అందమైన ఆమెను చూస్తున్నాడు. అంగీకారం తెలిపిన మరుక్షణమే తన చేతులలో వుంటుంది అనుకుంటున్నాడు.

"నమ్మకంగా లేదా?"



"మీ సహృదయానికి నా జోహార్లు. ఇక వెడదామా!" లేచింది.

అతను చెయ్యిపట్టుకుని కూర్చోబెట్టాడు. "తొందరేం! ఏదయినా హోటల్లో సప్పర్ తీసుకుని వెడదాం."

"పదండి మరి" అన్నది మనోహరంగా నవ్వుతూ. ఇద్దరూ లేచారు.

ఈ ప్రశాంతిని గూర్చేనా తను విన్నమాటలన్నీ? పురుషద్వేషి, నిప్పురవ్వ, కొరకరానికొయ్య... ఎన్ని మాటలు చెప్పారు అందరూ. నిమిషంలో నేను ఫూల్‌ను చేయలేదూ? ఆడవారిదేముంది కార్లూ, హోదాలూ చూస్తే మైమరిచిపోతారు. అనుకుని సగర్వంగా ఇంపాలా కారువంక చూచుకున్నాడు.

అందమైన ఆడపిల్లను చూడగానే అంత మైమరుపా? అడిగిన వాటికల్లా గంగిరెద్దులా తలూపటమే వ్యక్తిత్వమా?

"ఏ హోటల్ కెళ్దాం అంటారు?"

"ఏదయినా వెజిటేరియన్ హోటల్‌కి."

అతని ముఖంలో రంగులు అరసెకన్ మారి మళ్ళీ యధాస్థితికి వచ్చాయి. అది చూసి ప్రశాంతి నవ్వుకుంది. ఎనిమిది గంటలకు ఇల్లు చేరుకున్నారు.

"నా ప్రశ్నకు జవాబు చెప్పనే లేదు."

"అన్నయ్య చెబుతారు." అన్నది కారు దిగుతూ.

"గుడ్‌నైట్!"

"గుడ్‌నైట్... ఛీరియో..." సుతారంగా చెయ్యూపింది. కారు వెళ్ళిపోయింది.

"శాంతీ! అతన్ని ఇంట్లోకి రమ్మనకూడదా?" వేణు బయటికి వచ్చాడు.

"నీవు బావమరిదితో మాట్లాడుతుంటే ఆయనకు బోరు." అన్నది.

"మా బావగారు రాలేదు..."

"వస్తానని చెప్పిందెప్పుడటా!" నవ్వుతూ పైకి వెళ్ళిపోయింది. బట్టలు మార్చుకుంటుండగా ప్రణతి వచ్చింది.

"నీ ఫ్రెండ్ ఏమందే ప్రణూ?"

"ఫ్రెండా... ఓ..... రాలేదు. చూడవే ఆ ఫూల్..."

"నీ అంత బిగ్‌ఫూల్ ఇంకెవరుంటారే. అన్నయ్య చెప్పమన్న మాటలు నువ్వు చెప్పావు అవునా"

"క్షమించు శాంతీ..." ప్రణతి కళ్ళు దించుకుంది. ప్రశాంతి బట్టలు మార్చుకుని వచ్చింది.

"నచ్చాడా విద్యాసాగర్?"

"నీకు నచ్చాడా మొదట చెప్పు?"

"యెవరికయినా నచ్చుతారు. చక్కని మనిషి, ఫారిన్ వెళ్ళివచ్చాడు. ఇంపాలా కారు..." ప్రణతి మాటలకు పక్కుమని నవ్వింది. "ఎందుకు? అబద్ధం చెప్పానా? ఏం తక్కువో చెప్పు."

"చెప్పినా నీ కర్థం కాదు ప్రణూ..." అన్నది. ఆమె మానసం ఎటో వెళ్ళిపోయింది తన ఊహాసుందరుడిని వెతుక్కుంటూ.

## 2

రఘుపతి ముగ్గురు కొడుకుల తరువాత ఇక పిల్లలు పుట్టరు అనుకున్నాక, కాంతమ్మ కోర్కె గ్రహించినట్టే, వేణు తరువాత పదేళ్ళకు ప్రశాంతి పుట్టింది. ఆ తరువాత ప్రణతి, ఆ ఇంట్లో అందరూ ఒక ఎత్తు తల్లిదండ్రులకు ప్రశాంతి ఒక ఎత్తు. దానికి తోడు ఆమె పుట్టిన దగ్గరనుండి అంతా కల్సి వచ్చిందేగాని నష్టం రాలేదు. అదో ప్రత్యేకాభిమానము. హరిశ్చంద్ర, రామచంద్ర, వేణుగోపాల్ ముగ్గురూ ఉన్నత విద్య అభ్యసించారు. హరిశ్చంద్ర తన భార్యాబిడ్డలతో బొంబాయిలో ఉంటున్నాడు. రామచంద్ర కలకత్తాలో జియాలజిస్టుగా వున్నాడు. అతని కుటుంబం అక్కడే. ఆఖరి వాడు వేణు రెండు సంవత్సరాలు స్టేట్స్‌లో వుండి వచ్చాడు. వివాహం చేసుకుని తల్లిదండ్రుల దగ్గరే వున్నాడు. అతను హెచ్.ఎమ్.టిలో పనిచేస్తున్నాడు. పెద్దకుమారులకు ఇంటి విషయాలు అంతగా పట్టవు. పండుగలకు, శుభకార్యాలకు వస్తారు. చెల్లెండ్లున్నారని బహుమతులు తెస్తారు. నాల్గురోజులుండి వెడతారు. చేతికందిన కొడుకులున్నా తనకు ప్రయోజనంలేదని తల్లి పడే బాధను అర్థం



చేసుకుని, మంచి అవకాశం వచ్చినా వదులుకుని ఇంట్లోనే వున్నాడు వేణు. అతని భార్య కూడా అతనికి తగినదే. పెద్దకుటుంబమునుండి వచ్చిన పిల్ల. మంచి, చెడు అర్థం చేసుకుంటుంది. బి.ఏ. పాసయినా గర్వం, అతిశయం లేవు.

ప్రశాంతికి పద్దెనిమిదో ఏడు వచ్చినప్పటినుండి సంబంధాలు వెతుకుతున్నారు. ఒక్కటీ నచ్చదు. యూనివర్సిటీలో కూడా ఆమె అంటే జడుస్తారు. మొగపిల్లలంటే చీదరిస్తుందని ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు ఇరవై ఒకటో సంవత్సరం. సంబంధం కుదిరేవరకంటూ ఎం. ఏ.లో చేరింది. ఈ ఏడుతో అయిపోతుంది.

విద్యాసాగర్‌ను చూచిన రఘుపతి తన కూతురికి అతను తప్పక నచ్చుతాడనే ఆశ వుంది. నమ్మకంగా వున్నాడు. ప్రణతి చెప్పిన వార్త విని అతనికి మతిపోయింది.

"విన్నావా?" భార్యను కేకవేశాడు.

"ఏమిటి?"

"శాంతికీ సంబంధం కూడా నచ్చలేదట."

"తమాషాకందేమో."

"చిన్నతల్లి మనతో తమాషా చేస్తుందా?"

ఆవిడ చేస్తున్నపని వదిలివచ్చింది. భర్త ముఖం చూస్తే కూతురిపై విపరీతమైన కోపం వచ్చినట్లుంది.

"నాకో అనుమానం."

"ఏమిటండీ?"

"శాంతి మనసులో ఎవరన్నా ఉన్నారేమో!"

"యూనివర్సిటీ కబుర్లు వినలేదా? ఇది ఎవరితో నవ్వంగా మాట్లాడిందని ప్రేమిస్తుంది!"

"ఏమో కనుక్కుంటే మంచిది."

"సునందా!"

"ఏం మామయ్యా?"

"మీరిద్దరూ స్నేహంగా ఉంటారు గదా దాని మనసులో మాట అడుగమ్మా."

"ఇదివరకే మీ అబ్బాయి అడగమంటే అడిగాను. అలాంటిదేమీ లేదు" అన్నది.

"మరేం చేద్దాం."

"తెలివి రాకముందే చేస్తే పీడా పోయేది." కాంతమ్మ విసుక్కుంది.

వేణు ఈ సంగతి విని మండిపడ్డాడు. "మీరు గారాబం నేర్పి పాడు చేశారు. ఇది ఎనిమిదో సంబంధం అని దానికి తెలుసా? బయట ఇప్పటికే ఇతరులు అనే మాటలు వినలేక చస్తున్నాను." అన్నాడు.

"అన్నయ్యా! బయటివారి మాటలు వినమని మిమ్మల్ని ఎవరూ బలవంతం చెయ్యలేదు. నా వివాహం పూర్తిగా నా ఇష్టం." తలపిన్నులు సరిచేసుకుంటూ మేడ దిగింది ప్రశాంతి.

"నీ ఇష్టం కాదని ఎవరన్నారు. ఇష్టమైన వాడిని చూపించు. మేం కన్యాదానం చేసి తరిస్తాం."

"నీ వెటకారం అనవసరం. నాకిష్టమైన వ్యక్తి తటస్థ పడ్డరోజు నీ కన్యాదానం అక్కరలేకుండా వెళ్ళిపోతాను."

"సాగర్‌కు ఏం తక్కువో చెప్పు?"

"నాకు కావల్సినగుణాలు ఏవీ అతనిలో లేవు" అన్నది.

"ఏమిటమ్మా దూకుడు? నీ మనసులోని మాట సరిగ్గా చెప్పరాదూ?" రఘుపతి మృదువుగా మందలించబోయాడు.

"నా మనసులోని మాట చెబితే వినిపించుకోరేం ? ఆ విద్యాసాగర్ నీడ కూడా భరించలేను." అన్నది.

"చాల్లే తెలివి. అతనెందు కిష్టం కాలేదో చెప్పు."

"నా ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పన్నయ్యా! నీ కాబోయే భార్య మమ్మల్ని ఇంట్లోంచి తరిమెయ్యమంటుంది అనుకో! వెర్రినాగన్నలా తరిమేస్తావా?"



"ఎందుకు తరిమేస్తాను. నా వారు నాకుంటారు. నీ స్థానం నీకుంటుంది. ఆ స్థానం కావాలనుకుంటే రా. లేదా ఓ నమస్కారం అంటాను." లెక్కరిచ్చినట్టు చెప్పాడు.

"మరి నీ స్నేహితుడు... పుణ్యపురుషుడు. నా అంగీకారం లేకపోతే తనవారిని నా దరిదాపులకు రానివ్వడట."

ప్రశాంతి మాటలకందరూ నవ్వారు. వేణుకూడా వచ్చే నవ్వును బిగబట్టాడు.

"శాంతీ ! నువ్వంటే అతనికి చాలా ఇష్టం. నువ్వు క్రాస్ ఎక్జామ్ చేస్తున్నావని వాడికేం తెలుసు. వెధవ, నిన్ను ప్రసన్నురాలిని చేయాలని అని ఉంటాడు."

"అదొక్కటే కాదు. నేను అన్నదానికల్లా గంగిరెద్దులా తలూపటమేనా!" అన్నది.

"నీ వాడి చూపులకు, వేడి మాటలకు భయపడి ఉంటాడులే."

"అన్నయ్యా! కావాలంటే నీ స్నేహితుడిని అడుగు. మీరంతా అలా అంటారనే చాల జాగ్రత్తగా మాట్లాడాను." అంది విసుగ్గా.

"సాగర్‌ను వద్దంటున్నావా?"

"నాకు పదే పదే చెప్పే అలవాటు లేదని నీకు తెలుసు." అన్నది విసుగ్గా.

"తిక్కరేగితే నేనెంత మొండివాడినో నీకు తెలుసు."

అతని విషయం అందరికీ తెలుసు. ఇల్లు కడుతుండగా ఓ రోజు ఓ గమ్మత్తు జరిగింది. పనుల తొందరలోపడి బాయిలర్‌లోకి బొగ్గులు తేవటం మరచిపోయాడు. అప్పటికింకా గీజర్ రాలేదు. ఉదయమే లేచిన రఘుపతికి భార్య సణుగుడు విని విసుగనిపించింది. బాత్‌రూమ్ తలుపులకని తెచ్చిన కలప పడివుంది. దాంట్లోంచి సన్నని పేళ్ళుతీసి బాయిలర్‌లో వేస్తున్నాడు. విషయం తెలియని వేణు బయటికి వచ్చి తండ్రిని అడిగాడు.

"పేళ్ళెందుకు నాన్నా?"

"గంధంతీసి ఒంటికి రాసుకుంటాను" విసుగ్గా అని బయటకు వెళ్ళాడు రఘుపతి. మరో గంటకు వచ్చి చూస్తే, కర్రంతా గంధం చెక్కలంత ముక్కలకింద నరకబడి వుంది.

"ఏమిట్రా ఇది?" మండిపడుతూ అడిగాడు.

"గంధం తీయటానికి అనువుగా వుంటుందని." తాపీగా, నిదానంగా జవాబు ఇచ్చాడు. అందరికీ వేణు మొండివాడని తెలుసు. గతం గుర్తుకువచ్చి రఘుపతి కంగారు పడ్డాడు.

"ఏం చేస్తావు?"

"కాళ్ళూ, చేతులూ కట్టి పెళ్ళి చేస్తాను."

"ఆదర్శపురుషుడని పేపర్లో పేరు వేస్తారులే." అంది వెటకారంగా.

"పెద్దతల్లీ ఏమిటీ వాదన?" కాంతమ్మ అడిగింది.

"మీరంతా మామయ్య కూతుర్ని చేసుకోమంటే ఈ పెద్దమనిషి ఎందుకు వద్దన్నట్టు? మనలోమాట, అరుంధతికేం తక్కువయిందట."

"శాంతీ! అరుంధతి... ఆడదంటామా? దానికి ఆడదానికుండే లక్షణాలున్నాయా? దాన్ని భరించటం..."

"అలాగే అన్నయ్యా! నీ స్నేహితుడిలో నేనూహించిన పురుష లక్షణాలు లేవు. నేను ఒక్కక్షణం భరించలేను." నిర్భయంగా చెప్పింది.

"నోరు ముయ్యి."

"చూచారా నాన్నగారూ? తనే మనిషి, తనకే మనసుందను కుంటాడు అన్నయ్య. తనకెలాంటి భార్య కావాలో చెప్పలేదా? నేను బ్రతకడం ఇష్టం లేదు..." ప్రశాంతి కనుకొలకులలో నీరుచూచి కరిగిపోయాడు రఘుపతి. కూతుర్ని దగ్గరగా తీసుకుని కళ్ళు ఒత్తాడు.

"శాంతీ! నీ కిష్టం లేనిది ఏదీ జరగదమ్మా! పోనియ్యరా వేణూ! అతనికి వేరే దొరక్కపోరు."

"దొరక్కకాదు. అవతల అరవై వేల కట్నం వస్తుంటే నా కోసం వద్దన్నాడు."

"నీ స్నేహితుడి విశాల హృదయానికి ధన్యవాదాలు. ఈరోజే వెళ్ళి వేలం వేయి. ఇంపాలా కారుందిగా, లక్షదాకా రావచ్చు."



"షటప్ ఐ సే."

"ఇందాక తెలుగులో అదే మాటన్నారు. నా కర్థం అయింది."

వేణు ఇక వినలేనట్లుగా గబాగబా మేడపైకి వెళ్ళిపోయాడు. అతనికి అందరినీ పట్టుకుని తన్నేయాలన్నంత కోపంగా వుంది. మంచానికి అడ్డగా పడిపోయి ఆలోచించ సాగాడు. సునంద వచ్చి అతని బూట్లు, టై అన్నీ ఊడదీసినా తెలియనే లేదు.

"ఇదిగో వేడి కాఫీ త్రాగితే తల దిమ్ముపోతుంది." సునంద మాటతో అతను లేచి బూట్లు విప్పుకోబోయాడు. ఆమె నవ్వింది.

"సునీ!" అతని కంఠంలో తీరుకు సునంద పారిపోబోయింది.

"ఏయ్" ఆమె పమిట దొరికింది. వచ్చి అతని వడిలో పడింది.

"సునీ... ఒక్కమాట చెప్పు. నువ్విలాగే..."

"ఆగిపోయారేం? అడగండి."

"ఊహుఁ.... నాకు తెలుసు. నువ్వు అడిగి వుండవు."

"ప్రతి ఆడపిల్లకూ వివాహం ఒక అందమైన కల. దానిలోకి వారాహ్వానించే రాకుమారుడిని రంగురంగులలో చిత్రించుకుంటారు. కొందరికి ఆ కల నిజం అవుతుంది. మరి కొందరికి అబద్ధమై, జీవితాంతం అశాంతితో గడుపుతారు. ఈ పురుషుడు భర్త అనుకోగానే మదిలో తీయని భావాలు..."

"ఏమిటో ఈ మైమరుపు" అతను కోపం అంతా మరిచిపోయాడు.

"నా అభిప్రాయం అడగబోయి ఆపారు. అందుకే చెబుతున్నాను." అన్నది అతనివంక చూస్తూ.

"మరి నీవు కోరుకున్న..."

"ఛ పోండి సిగ్గులేదూ" అతని దగ్గరనుండి పారిపోయింది. ఇందాక చెల్లెలితో కఠినంగా మాట్లాడినందుకు సిగ్గుపడ్డాడు వేణు. లేచి ప్రశాంతి గదిలోకి వచ్చాడు. కిటికీలోంచి హుస్సేన్‌సాగర్ అలలు చూస్తూ నిల్చుంది ప్రశాంతి.

"శాంతీ!"

అతని వైపు తిరిగింది. కాని ఆ చూపులో ఏం కావాలన్నట్టు అన్పించింది.

"నన్ను క్షమించు చెల్లాయ్."

"ఆఁ..." అంది నమ్మలేనట్టు.

"తొందరపడ్డానులే" అన్నాడు. ఆ తరువాత ఇద్దరూ నవ్వుకున్నారు.

వేణుకు అదోలావుంది స్నేహితుడికి ఫోను చెయ్యాలంటే. అతను ఆఫీసు కాగితాలు చూసుకుని వచ్చేసరికి పది అయింది. సునంద అటుతిరిగి పడుకుంది.

"ఆలస్యం చేశానా సునీ?"

"ఊఁ..." అంది మత్తుగా. అతను ముందుకు ఒంగాడు. ఇంతలో తలుపు చప్పుడయింది. అతను నిటారుగా నిల్చున్నాడు. నైటీలోవున్న సునంద దుప్పటి పైకి లాక్కుంది.

"అన్నయ్యా!"

"శాంతిలా వుందే..." వేణు వెళ్ళి తలుపు తీశాడు. ప్రశాంతే.

"అయిదు నిమిషాలు నీతో మాట్లాడాలి. బయటికి వస్తావా!"

"ఫరవాలేదు నువ్వు లోపలికి రా" అతని వెనకాలే వచ్చింది. తను రాసుకునే టేబుల్ మీద కూర్చున్నాడు. స్థలం లేక వదిన ప్రక్కలో కూర్చుంది.

"జాగ్రత్తమ్మోయ్! మీ ఆయన అనుకునేవు."

"చూచారా మీ చెల్లి జాణతనం?" సునంద భర్తతో ఫిర్యాదు చేసింది.

"అనుకున్నా ఫరవాలేదు. ఆడబిడ్డ అర్ధమొగుడన్న సామెతుందిగా." అన్నాడు నవ్వుతూ. "ఏమిటో చెప్పాలన్నావ్."

"మీ స్నేహితుడు అదే హుసేన్‌సాగర్.... పొరపాటు విద్యాసాగర్ గారి కారు ప్రణతికి నచ్చిందట."

"నచ్చితే అతను అమ్మేద్దూ?"

"అతను అమ్మకపోతే అదే పోతానంటుంది."

"ఏమిటి శాంతీ?"

"నిజం అన్నయ్యా! మీ సాగర్ దానికి నచ్చాడట... కాదు. అతనికంటే అతని కారు, హోదా నచ్చిందంటే సరి."

"ఊరుకో ప్రశాంతీ! ఏమిటా మాటలు?" సునంద నిటారుగా కూర్చుంది.



"అది చెప్పమన్నమాట చెప్పాను." ఆవలిస్తూ లేచింది.

"అతను అంగీకరిచాలి కదా?"

"అడిగి చూడు." వచ్చి పడుకుంది ప్రశాంతి.

తెల్లవారి ఇంట్లో ఏదో కలకలం వినిపిస్తే, కాలకృత్యాలు ముగించుకు వచ్చింది. కాంతమ్మకు వరుసకు తమ్ముడయిన సారధి వచ్చాడు శక్కర్‌నగర్ నుండి. అతనక్కడ ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ముప్ఫై సంవత్సరాలు ఉంటాయి. చక్కని విగ్రహము, 'ఫారిన్ వెళ్ళలేదు కాని రాజా లాంటివాడు' అనుకుంది కాంతమ్మ.

"నమస్తే మామయ్యా!"

"యెవరూ?" అతనిటు తిరిగాడు. "హల్లో! నాల్గు సంవత్సరాలలో యెంత ఎదిగావు! కోడలుగారూ అదేం పిచ్చి! చక్కటి ఉంగరాలజుట్టు కత్తికి బలి ఇచ్చావ్."

"యెవడు పడతాడుబాబూ యాతన ! తలంటూ...."

"మరి ఈ ఆరుగజాల చీరమాత్రం యెందుకు మానెయ్యి."

"వేస్తే తప్పేం వుంది?" అతని ప్రక్క కుర్చీలో కూర్చుంది. "మీరు ప్యాంట్లు, టైలు వెయ్యటంలే? అవి మనదేశపు దుస్తులేమిటి?"

"అప్పుడే వాదనలు మొదలయ్యాయా?" నవ్వుతూ రఘుపతి వచ్చాడు.

"బావగారూ! మనదేశ సంస్కృతి పిల్లలకు తెలియక పోయినా తెలియచేయాల్సిన బాధ్యత మీపైనుంది."

"పోనీయ్యావోయ్! సరదా..."

"రండి... రండి. ఫలహారం చల్లారిపోతోంది." కాంతమ్మ కేక వెయ్యటంతో సంభాషణ ఆపి వెళ్ళిపోయారు. సారధి ఉన్న నాల్గు రోజులు సరదాగా గడిచింది. అతను ప్రశాంతికి నచ్చాడు. అతనిలోని గర్వం నచ్చలేదు. అతనెళ్ళిపోయిన రోజు సాయంత్రము ప్రణతితో ఆ మాటే అంది.

"ఈ సాగర్ కంటే మామయ్యే నయం ప్రణూ! ఇంకా సాగర్‌ని అడగలేదు కదా? సారధిని చేసుకోరాదూ." అన్నది. ప్రణతి అక్కను సూటిగా

చూచింది. ఆ తరువాత తలాడించి వెళ్ళిపోయింది. తల్లితో గుసగుసగా ఏమో చెప్పింది.

"నిజమా! ఇన్నాళ్ళకు దాని మనసుకు ఒకరు నచ్చినందుకు సంతోషం. సమయం కనిపెట్టి అడుగుతాను." ఆమె సంబరం ఇంతా, అంతా కాదు.

సాగర్ ప్రణతిని చేసుకోనని అంటే వేణుకు తృప్తిగా ఉండేదేమో, అతను అంగీకారం తెలుపుతుంటే మతిపోయిన వాడిలా చూశాడు.

"ఇంకా రెండు నెలలు ఆగి శ్రావణంలో ముహూర్తాలు పెట్టుకుందాం. మా అక్కకు ఆపరేషన్ అవుతుంది."

"అలాగే" అన్నాడు వేణు. ఈ మనిషే భార్యకోసం అన్నీ వదులు కుంటానని కోతలు కోశాడు అనుకున్నాడు.

"మీ చిన్న చెల్లికి కూడా 'కట్నాలు అడగవద్దు. లాంచనాలు వద్దు' అనే పట్టింపు ఏదయినా ఉందా?"

వేణు స్నేహితుడిని పరీక్షగా చూశాడు. అతని కళ్ళలో ఎన్నో విషయాలు చదవగలిగాడు.

"లేదు. దాని పేర ఉన్న యాభైవేలు దానివే." అన్నాడు. ప్రశాంతి ఇతన్ని నిరాకరించటంలో తప్పేం లేదు అనుకున్నాడు వేణు.

## 3

"అత్తయ్యా! వారు లేరు. నేను ఒక్కదాన్ని వెడితే అక్కయ్య ఏమనుకుంటుంది? ప్రశాంతిని తీసుకు వెడతాను. ప్రణు అతనితో సినిమాకు వెడుతుందట." సునంద అత్తగారిని అడిగింది. సునంద అక్క భర్త కాచిగూడాలో పేరు మోసిన డాక్టరు. అతని కొడుకు పుట్టినరోజని పిలిచి వెళ్ళారు. వేణుకు వేరేపని ఉండి రాత్రికి వస్తానని వెళ్ళిపోయాడు.

"అది వస్తానంటే నాకేం అభ్యంతరమే." అన్నది.

"మీరొకసారి చెబితే..." ఆగిపోయింది.



"దానికేం భాగ్యం!" నవ్వుతూ మెట్లదగ్గర కెళ్ళింది. "పెద్దతల్లీ" అని కేక వేసింది. ఇక కాలేజీలు తెరుస్తారని పుస్తకాలు తీసిన ప్రశాంతి క్రిందికి వచ్చింది.

"ఏమ్మా?"

"సునంద ఒక్కర్తీ వెడితే వాళ్ళ వాళ్ళు ఏమనుకుంటారు? తోడుగా వెళ్ళరాదూ?"

"అక్కడ వాళ్ళంతా వింత మృగాలను చూచినట్టు చూస్తారమ్మా, నా కిష్టం లేదు."

"శాంతీ! అలాంటి వారెవరూ రారు. డాక్టర్లు కొందరు, మా చుట్టాలు మాత్రం వస్తారు." హామీ ఇచ్చింది సునంద.

"అది అంతగా అంటుంటే వెళ్ళరాదుటే" ఇక లాభం లేదని తయారయి వచ్చింది. ప్రశాంతిని చూచిన సునందే రెండు నిమిషాలు కళ్ళు తిప్పుకోలేకపోయింది. 'పసిడిబొమ్మలా ఉన్న ఈ పిల్ల నా కూతురా...' అని సంబరపడి పోయింది కాంతమ్మ.

"చాలా రాత్రయితే అబ్బాయి వస్తాడు. పంపుతాను. ఒంటరిగా రాకండి."

"మా బావగారు వదిలేస్తారులే అత్తయ్యా." అన్నది సునంద. మాలి తెచ్చిన టాక్సీలో ఇద్దరూ కాచిగూడా వెళ్ళారు.

కారులోంచి దిగుతున్న ప్రశాంతిని ఆడ, మొగ కళ్ళప్పగించి చూస్తుండిపోయారు.

"చూడు వదినా! అందరూ ఎలా చూస్తున్నారో! అందుకే నేను రాను అన్నాను."

"అది వారి తప్పుకాదు ప్రశాంతీ! తప్పంతా నీ అందంలో ఉంది."

"పోదూ..." అన్నది. అందరినీ అలా ఆకట్టుకున్నందుకు తనకు గర్వంగా ఉంది. సునంద అక్క సుమిత్ర యెదురు వచ్చింది.

"హల్లో ప్రశాంతీ! మా ఇల్లు పావనం అయింది." అన్నది. "చెల్లీ! మీ ఆయనేడే?"

"ఆయనకు మౌలాలీలో పని ఉందక్కా! త్వరగా వస్తే తప్పక వస్తారు." అన్నది సంత్సరం బాబును అందుకుని ముద్దు పెట్టుకుంటూ.

అందరూ ఇంటికి ఎడమవైపు నున్న ఖాళీ స్థలంలో చేసిన అరేంజ్ మెంట్లను పర్యవేక్షించారు. సాయంత్రం చక్కగా గార్డెన్‌లో కుర్చీలు అమర్చి, మధ్యగా పెద్ద టేబుల్ వేశారు. దానిపై రకరకాల ఫలహారాలు అమర్చి, మధ్యగా కేక్ పెట్టారు. టేబుల్ క్రింద చల్లని పానీయాలుంచారు. యెవరికి వారు తీసుకుని కుర్చీలలో కూర్చోవటం.

"ఈ ఏర్పాట్లు బావున్నాయక్కా! బావ ఎక్కడా! అభినందనలు చెబుదాం." అన్నది.

"ఇంకా నయం! మీ బావకు అంత తీరికా, ఓపికా తల్లీ! మన్మోహన్ వచ్చి చేశాడు."

"మను అన్నయ్యా! ఈ ఊరెప్పుడొచ్చాడు?"

"నీకింకా తెలియదా? ఉస్మానియా యూనివర్సిటీలో రీడర్‌గా వేశారు. వరంగల్ కాలేజి వదిలిపోయింది."

"నిజమా? అయితే పిన్ని చాలా సంతోషించి ఉండాలి."

"కాదా! అరుణకు సంబంధంకూడా కుదిరింది."

"మన్మోహన్ అన్నయ్య ఇష్ట ప్రకారమేనా?"

"మరి? వాడు అనుకున్నది సాధించి తీరుతాడు. కట్నం, లాంఛనము ఏమీ లేదట. వివాహం కాగానే భార్యా, భర్త లండన్ వెడతారట." సుమిత్ర చెప్పేది ఎవరి విషయమో అర్థం కాలేదు. తలా తోకా లేని సంభాషణ విసుగ్గా కూడా ఉంది.

"నువ్వెళ్ళి ప్రశాంతికి షర్బత్ ఇవ్వు, నేను వస్తాను." సుమిత్ర లోపలికి వెళ్ళింది.

"విసుగ్గా ఉందా?" సునంద వచ్చింది.

"అయ్యాయా మీ ముచ్చట్లు?"

"సారీ శాంతీ! చాలా రోజుల తరువాత మా పిన్ని కుటుంబ సంగతులు వింటుంటే..."



"యెవరా పిన్ని? నీ పెళ్ళిలో చూడలేదు."

"ఆవిడ యెక్కడికీ రాదు. మా బాబాయిగారు ప్రొఫెసర్‌గా ఉండేవారు. ఇద్దరు పిల్లలు అరుణ, మన్మోహన్. ఆయన కారు యాక్సిడెంటులో పోయారు. ఆ షాక్ నుండి ఇంకా ఆవిడ తేరుకోనేలేదు. మన్మోహన్ ఆ ఇంటికి దీపం. పిన్ని బలవంతం చేయదు. తన ఆశయాలకు తగిన వరుడే కావాలని చెల్లెలి పెళ్ళి వాయిదా వేస్తూ వచ్చాడు. ఇప్పటికి కుదిరింది. నా పెళ్ళికి అతను ఇక్కడ లేడు. ఢిల్లీలో ఏదో కాన్ఫరెన్స్ ఉందని వెళ్ళాడు."

"అలాగా! పెళ్ళి అయిన పదిరోజులకి నేనో గ్రీటింగ్ కార్డు తెచ్చి ఇస్తే, మోహన్ అన్నయ్యది అంటూ..."

"కరెక్ట్! వాడంటే మా ఇంట్లో అందరికీ యెంత ఇష్టమో..."

ప్రశాంతికి అసూయగా ఉంది. ఆమెకో గుడ్డి నమ్మకం ఉంది. తన ఇంట్లో తనకున్న ప్రత్యేకస్థానం మరెవరికీ లేదు, ఉండకూడదు అనుకుం టుంది.

"హల్లో మరదలా..." అంటూ వచ్చిన సుమిత్ర భర్త ప్రశాంతిని చూచి తటపటాయించాడు.

"మరిచిపోయావా, మా ఆడపడుచు..."

"నీ పెళ్ళికి నేను వచ్చింది రెండు గంటలేగా... జ్ఞాపకం లేదు. మా మరదలు పెత్తనం యెలా ఉంది?" గలగల నవ్వుతూ సునంద భుజం చరిచాడు.

"ఇంకా నీ మోటు సరసం మానలేదు. అక్కయ్య యెలా భరిస్తుందో!" అన్నది సునంద.

"ఈ రోజు ఉండి చూడు."

"సిగ్గులేకపోతే సరి." సునంద వెక్కిరించింది. ప్రశాంతికి యెబ్బెట్టుగా తోచింది. ఆ క్షణంలో తన పవిత్రతకు యెంతో గర్వించింది కూడాను.

"ఏమ్మా చెల్లాయి అలా నిలుచుండిపోయావేం."

"మీ మాటలు వింటున్నాను."

"నువ్వూ యెక్కడో కలుపుకుని మాట్లాడాలమ్మా" అని భార్యవైపు తిరిగాడు. "సుమిత్రా! మోహన్ గాడు ఆలస్యంగా వస్తానన్నాడు."

"వాడు చేసిన పనంతా పోయింది. గాడు, గీడు అంటారేం?"

"అనకపోతే? స్నేహితుడు అర్జెంటుగా ఊరెళ్ళాలట, బస్సులేదట. ఈ మహానుభావుడు తన స్కూటర్ మీద దింపేస్తాడట."

"అలాంటి రోగాలు వాడికున్నవే. మీరు తిట్టినంత మాత్రాన పోవులెండి."

వచ్చిన ప్రతివాళ్ళు మన్మోహన్ గురించి అడుగుతుంటే, ఆ మహా పురుషుడెవరో చూడాలన్న కుతూహలం పెరిగింది ప్రశాంతికి. చూస్తుండగానే షామియానా అతిథులతో నిండిపోయింది. అందరూ వచ్చారు. అయినా కేక్ కట్ చెయ్యరేమిటి? ఆరుగంటలకన్న పార్టీ, ఆరుంబావయినా మొదలు పెట్టలేదు. ప్రశాంతికి వెళ్ళిపోదాం అన్పించింది. ఆమె ఉద్దేశం గమనించినట్టే సునంద అక్క దగ్గరకు ఆత్రంగా వెళ్ళింది.

"అందరూ వచ్చారు కదక్కా! ఆలస్యం దేనికి?"

"మనూ రాలేదు కదే." అన్నది. ఆ మాటలకు దగ్గరగా ఉన్న ఒకరు మండిపడుతున్నారని తెలియదు సుమిత్రకు. మరో అయిదు నిమిషాలు గడిచేసరికి హాల్లో కలకలం బయలు దేరింది. అందరూ చూచే వైపు చూచింది. తెల్లని మల్లెపూవువంటి పంచెతో లాల్చీ వేసుకుని వస్తున్నాడో యువకుడు. అతని వెనకాలే తల వంచుకుని చేతిలో గిఫ్ట్ ప్యాకెట్టు పట్టుకుని వస్తుందో యువతి. సాధారణంగా ఉన్నా ఆ యువతిలో, అందచందాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి.

'ఎవరో ఈ పిల్ల నాయకుడు!' అనుకుంది ప్రశాంతి.

"ఏమిట్రా ఇంతాలస్యం." సుమిత్ర ముఖం వెలిగిపోతోంది.

"ఏడీ మహానుభావుడు మా బావ. 'ఆలస్యం అవుతుంది. నాకోసం చూడనవసరం లేదు.' అని ఫోన్ చేశానుగా. అయినా నీకు బుద్ధిలేదు సుమిత్రా! ఇంతమందినిలా యెదురు చూడ బెట్టడం తెలివి తక్కువ."

"ఏమిటోరా, నువ్వు రాకపోతే తోచలేదు" సుమిత్రా, అతనూ ఒక ఈడువారే. ప్రశాంతి నవ్వుకుంది. ఈ ధోవతి పండితుని కొరకేనా అందరినీ ఇంతసేపు ఆపింది. ఇంతలో సునంద ముందుకు వచ్చింది.



"నువ్వా నందా! అప్పుడే ఎంత మారిపోయావ్? ఏడీ నీ ప్రాణేశ్వరుడు?" సునంద చేతిని అపురూపంగా పట్టుకున్నాడు.

"అన్నయ్యా! నీమీద నాకు చాలా కోపంగా వుందిరా!"

"నీ పెళ్ళికి రాలేదనేనా? ఇక హైద్రాబాద్ వచ్చానుగా రోజూ వస్తాను. మీ ఆయన దర్వానుతో గెంటించే వరకూ. సరేనా? అన్నట్టు ఏడి మీ ఆయన."

"ఆయనకు పని వుందిలే. ఇదిగో మా అర్ధమొగుడుగారు ప్రశాంతి. మా పిన్నికొడుకు మన్మోహన్." పరిచయం చేసింది. "ఇదిగో ఇటు అరుణా." వెంట వచ్చిన యువతిని పిలిచి పరిచయం చేసింది. ఒక్క క్షణం అతని చూపులు ప్రశాంతిమీద నిలిచాయి. ఏదో కంపరం పుట్టినట్టు చూపులు తిప్పుకుంటూ చేతులు జోడించాడు. వెంటనే పని ఉన్నట్టు అక్కడ నుండి వెళ్ళి సుమిత్ర కొడుకును యెత్తుకున్నాడు.

"రా, నానీ కేక్ కోద్దువు." అన్నాడు. ప్రశాంతికి కోపం, దుఃఖం వచ్చాయి. ఏనాడూ ఏ పురుషుడూ తన వంక అలా చూడలేదు. అవును మరి తమిద్దరికీ దేంట్లో పోలిక! అతను బీదవాడు! తను లక్ష్మీపుత్రిక. అతను బాధ్యతగల భారత యువకుడు. తను! తన బాధ్యతలు తన వారికిచ్చి నిశ్చింతగా ఉండే అదృష్టవంతురాలు. నాగరికత అంచులు చూచిన అతివ తను. అనాగరికంగా, అందరిలో ప్రత్యేకత కల్పించుకు తిరగాలని ఆరాటపడే మనిషి అతను. అతని చూపులతో తనకేం. మనసుకు నచ్చ చెప్పుకుంది. అక్కడే నిలబడిన అతని చెల్లివంక చూచింది. ఆంధ్రుల ఆడపడచు అనటానికి వెనుతీయనట్టుగా ఉంది. తేనెరంగు అంచుతో ఉన్న తెల్లగద్వాల చీర, అదే జాకెట్టు వేసుకుంది. ఒంటి జెడలోంచి మల్లెలు సువాసనలు వెదజల్లుతున్నాయి. ఒంటి ముత్యపు దిద్దులూ ముత్యాలహారం. చేతులనిండుగా గాజులున్నాయి.

"రా శాంతీ...." సుమిత్ర వచ్చి లాక్కుపోయింది.

"చక్కగా నానిగాడికి స్నానం చేయించి, కొత్తబట్టలు వేసి వాడి ఈడు పిల్లలను పిలిస్తే పార్టీ కాదా బావగారూ?"

మరోసారి తిరిగి చూచింది. మన్మోహన్ అనబడే ఆ పురుష పుంగవుడు సుమిత్ర భర్తతో అంటున్నాడు.

"ఆ మాట మీ సుమిత్రకు చెప్పు."

"కొన్ని విషయాలలో పురుషుడి నిర్ణయము అత్యవసరం బావా."

అతన్ని కోపంగా చూడబోయింది ప్రశాంతి. కాని, మొగసిరి ఉట్టిపడే ఆ ఆకారం, గంభీరంగా సంగీతంలా విన్పించే గొంతుకు ముగ్ధురాలయి పోయింది. తన కోపం మరిచి అతన్నే చూస్తూ ఉండిపోయింది. చప్పట్లు, పాటలు అయ్యాక పార్టీ మొదలయింది. అందరూ ఫలహారాల మీద దండయాత్ర సాగించారు. ఇలాంటి విషయాలలో పాశ్చాత్యుల ననుకరించే బదులు వారిలోని మంచిగుణాలు నేర్చుకోరెందుకో! అని ఆలోచిస్తూ బల్లకొకవైపు మన్మోహన్ నిల్చున్నాడు.

'ఈ మనిషికింత పొగరేమిటి? అందరినీ వెర్రెత్తించే అందం నాది. ఒక్కసారి చూడడేం? శుకుడా, ఋష్యశృంగుడా!' అనుకుంటూ ప్రశాంతి మరోవైపు నిలబడింది.

"ఏమర్రా, మిమ్మల్ని అధునాతన సనాతన కట్టూ, బొట్టుకు ప్రతినిధులుగా ఎవరు నిలబెట్టారు?" పక, పకా నవ్వుతూ వచ్చింది సుమిత్ర. అతను ఉలికిపడి ప్రశాంతి వంక చూచి దూరంగా ఉన్న స్నేహితుల దగ్గరకు వెళ్ళిపోయాడు. ప్రశాంతి సునంద మరికొందరు యువతులున్న చోటికి వెళ్ళింది. ఒట్టి చేతులతో వచ్చిన ఆడబడుచును చూచి సునంద లేచి ప్లేటులో అన్నీ పెట్టసాగింది.

"మీ ఆడబడుచుకు ఇక్కడ సేవలు యెందుకే?" యెవరో సునందను వెక్కిరించటం ప్రశాంతి చెవులలో పడింది. ఇలాంటి పార్టీలంటే అందుకే రాబుద్ధి కాదు అనుకుంది. సునంద మాత్రం ఎంతసేపు కనిపెట్టి వుంటుంది? పుట్టింటి బంధువులతో మైమరచి మాట్లాడుతోంది. ప్రశాంతి ఒంటరిగా మిగిలిపోయింది.

"గోల్డ్‌స్పాటా, కోకాకోలా?" ఓ చిలిపి యువకుడు వచ్చి అడిగాడు.

"నో థాంక్స్."

"పోనీ ఒంటరిగా ఉన్నారు, కంపెనీ ఇవ్వనా?"

"థాంక్స్! నాకు ఒంటరిగా కూర్చోవటమే ఇష్టం."



"ఐ సీ..." అతను బలవంతంగా ఆమె చేతికి గోల్డ్ స్పాట్ సీసా ఇచ్చాడు. ప్రక్కనే కుర్చీలో కూర్చున్నాడు. దూరంగా స్నేహితులమధ్య జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది.

"ఎవర్రా ఆ బంగారు బొమ్మా!"

"డాక్టరుగారి మరదలు ఆడబిడ్డట."

"ఏమి అందంరా?"

"మెల్లగా నాయనా, ఆవిడకు యూనివర్సిటి మొత్తం జడుస్తుందట."

"వివాహం కాలేదా?"

"మహా, మహావాళ్ళనే తిరస్కరించిందట. ఫారిన్ రిటర్న్ కూడా ఆమెకంటికి ఆనలేదట. పురుగుల్ని విదిల్చినట్టే విదుల్చుతుందట."

"అంత గర్వం ఎందుకో? అంత అందగత్తె ఏం కాదు."

"ఏడ్చారు. అందనిపళ్ళు పులుపు అన్నట్టు ఇంతమంది స్త్రీలున్నారు. ఆమె అందం ఎవరికుంది?"

"అందమంతా అడవికాచిన వెన్నెలవుతుంది కదరా!"

"ఇల్లు కాచిన వెన్నెల కావాలా."

"ఆశ వుండగానే సరా? ఆమెను చేపట్టే పురుషుడు అదృష్టవంతుడురా."

"ఆ అదృష్టం మనకెందుకు కలగకూడదుట?" ఈ సంభాషణ ఇక వినలేక మన్మోహన్ లేచి మరోవైపు వెళ్ళాడు.

"నీపు తీపరంగా వుందా?"

"మొదట కన్పించేది చెంపరా."

"ఏదయినా సరే, ఆమె స్పర్శ అయినా లభిస్తుందిగా."

"ట్రై యువర్ లక్!"

"చూడు. ఈ ఆడవాళ్ళు తమ అందం పొగిడితే చాలు." అనుకుంటూ వచ్చిన యువకుడే ప్రశాంతి ప్రక్కన కూర్చున్నాడు.

"ఏమండీ?"

"ఏమిటి?"

"మీరు ఇక్కడ చుక్కలలో చంద్రుడిలా ఉన్నారు."

"ప్చ్, చాలా పాత ఉపమానం."

"నిజమండీ! మీ పేరేమిటి?"

"ఎందుకో!"

"ఇంత అందమైన వారిపేరు ఇంకెంత అందంగా ఉంటుందోనని." ప్రశాంతి చిరాకుగా చూడబోయి నవ్వింది.

"మీ పేరండీ?" అన్నది. అతను పొంగిపోయాడు. చేత్తో క్రాపు సర్దుకున్నాడు. గర్వంగా భుజాలు ఎగరేశాడు.

"గుణవంత్ రావండి."

పక్కున నవ్వింది. అతని ముఖం చిన్నబోయింది. ఎందుకన్నట్లు చూచాడు.

"పేరుకు, గుణానికి సంబంధం లేదుకదా! నా విషయం లోను అంతే." అతని ముఖం చిన్నబోయింది. కొందరు యువతులు తమకేదో పని ఉన్నట్టు మన్మోహన్‌ను రాసుకు తిరగటము గమనిస్తూ, మెల్లమెల్లగా సమోసా కొరుకుతోంది. ఆమె దృష్టి యెక్కడుందో చూచాడు గుణవంత్ రావ్. ఆమెను, అతన్ని బద్ధశత్రువులుగా చేయటం రెండు నిమిషాలలో పని. సీతాకోకచిలుకల్లా అలంకరించుకునే అమ్మాయిలంటే మన్మోహన్‌కు ఏ మాత్రం సదభిప్రాయంలేదని అతనికి తెలుసు. కుర్చీ క్రిందుగా కాళ్ళు పోనిచ్చి ఆమె కాలు త్రొక్కాడు.

"అబ్బా!" అని చురుక్కున చూచింది.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

"షటప్" అతని చెంప ఛెళ్ళుమంది. ప్రశాంతి కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. అతడు ఆశించినట్టుగానే మన్మోహన్ పరిగెత్తుకు వచ్చాడు. "ఏం? ఏం జరిగింది?"

"ఆవిడ..." అంటూ చెంప పట్టుకున్నాడు.

"ఆవిడ నీ చెంపను సత్కరించింది. ఎందుకు?"

"ఒంటిగా కూర్చుంది. ఎవరూ సర్వ్ చేయటం లేదని 'కోకాకోలా కావాలా' అన్నాను అంతే..."



అతడు చెప్పే అబద్ధాలను కళ్ళు పెద్దవిచేసి వింటుంది ప్రశాంతి. మొగాడా, చీడపురుగా! అబద్ధాలు కూడాను. వెళ్ళి మరో చెంపపై ఈడ్చి కొట్టింది.

"నిజం చెప్పి ఏడువు."

ఆమె మాట పూర్తికాకముందే ఆమె చెయ్యి బలంగా పట్టుకున్నాడు మన్మోహన్. అప్పటికే అందరూ చోట్లు వదిలి వచ్చి కుతూహలంగా చూస్తున్నారు.

"మీరు స్త్రీయేనా?"

"తమకు ఛత్వారముందేమిటి ఖర్మ." నిర్లక్ష్యంగా వుంది సమాధానం.

"ఛత్వారం నాకు కాదు, మీకు. ధనంతో కళ్ళు మూసుకుపోయాయి. అందకత్తెనన్న అహంకారంతో కళ్ళు మూసుకుపోయాయి." అతను మండిపడ్డట్టే అన్నాడు.

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్స్" అన్నది నిర్లక్ష్యంగా.

"అతన్ని కొట్టటానికి ఎన్ని గుండెలు."

"అలాంటి పిరికివాడిని... నిజం చెప్పలేని దద్దమ్మను కొట్టటానికి ఎన్నో గుండెలు కావాలా?" అతనేదో అనబోయాడు.

"మనూ?" సుమిత్ర అతని చేయి పట్టుకుంది.

"చాల్లే తెలివి. కాస్త మర్యాదగల మనుష్యుల్ని పిలుచుకోరూ. చూడండి దేవిగారూ! అతన్ని కొట్టే అధికారం మీకు లేదు."

"కనపడిన ఆడపిల్ల వెంటల్లాపడి అల్లరిపెట్టే అధికారం మీ గుణవంతుడికి లేదని చెబుతున్నాను."

"ఇక్కడ ఇంతమంది వుండగా మీ వెంట ఎందుకు పడ్డాడు అంటారు?" తీక్షణంగా అడిగాడు.

"అతన్నే అడగరాదూ."

"అడగాల్సిన అవసరం లేదు. నేను చెబుతున్నాను వినండి. మీ వేషభాషలలో అధునాతనంగాని భావాలలో కాదు. మీ కత్తిరించిన జుట్టూ, పెదవులకు పూసిన రంగూ, అతడిని రెచ్చగొట్టాయి. వేషం వేసినట్టు అలవాట్లు చేసుకోవాలి మేడమ్."

"అన్నయ్యా!" సునంద ఆదుర్దాగా వచ్చింది. "ఏమంటున్నావ్?"

"అంత కంగారు యెందుకు చెల్లాయి! అపురూపంగా చూడబడే స్త్రీ ఇలా అంగాలు ప్రదర్శిస్తూ, బొడ్డుక్రిందకి చీర, ఉండీ లేనట్టు భ్రమ కల్గించే జాకెట్టు..."

"షటప్!" మరుక్షణంలో ఆమె చేయి అతని చెంపను తాకేదే. అది గమనించి ఆ చేయిని ఒడుపుగా పట్టేశాడు..

"అందరినీ కొట్టటం అంత తేలిక కాదు మేడమ్!"

"అందరి ఆడవాళ్ళను విమర్శించడం నీ తరం కాదు. సార్!" వెటకారంగా కోపంగా అంది. "నీ వేషం పెద్దమనిషి తరహాగా వుండగానే సరికాదు." చేయి విదిలించేసింది. "ఏం జరిగిందో కూడా తెలుసుకోకుండ నోరు పారేసుకునే మూర్ఖుడితో ఇంతసేపు కాలం వృధాచేయటం నాదే తప్పు." విదిలించినట్టే నాలుగు అంగల్లో బయటికి వచ్చింది.

"శాంతీ! ... శాంతీ..." వెనకాలే సునంద పరుగెత్తింది.

"మైగాడ్! శాంతా? జ్వాల అంటే బావుండేది." మన్మోహన్ కంఠం విన్పించింది. ప్రశాంతి ముఖం జేవురించింది. అతను పట్టుకున్న చోట ఒకసారి తడిమి చూసుకుంది.

## 4

సుమిత్ర భర్త కారు తీసుకుని వెనకే వెళ్ళిపోయాక, తుఫాను తరువాత ఉండే ప్రశాంతతలా మారిపోయింది అక్కడ వాతావరణం. మన్మోహన్ మామూలుగా ఉండటానికి ఎంతో ప్రయత్నం చేశాడు. తనేం చేశాడు? ఏనాడూ ఎవరినీ ఒక్కమాట అనని తనేనా, ఇంత మూర్ఖంగా ప్రవర్తించింది! అరుణ దూరంగా నిలబడి అన్ననే తదేకంగా చూస్తోంది.

"ఇదిగో కూల్‌డ్రింక్" యెవరో కోకాకోలా తెచ్చి ఇచ్చారు. అతను జరిగినదానికి అమితంగా బాధపడుతున్నాడు. వాతావరణము అతని మనసులాగే అయిపోయింది. ఉక్క బోస్తూ ఊపిరి ఆడనట్టుంది.

"మనూ!" సుమిత్ర వచ్చింది.



"నన్ను క్షమించు సుమిత్రా! నానిగాడి పుట్టినరోజు ఇంత గోలగా అవుతుందని అనుకోలేదు." అన్నాడు బాధగా.

"నాకేం బాధలేదు. సునందను వాళ్ళవాళ్ళు ఏమంటారో! ఆ పిల్ల అంటే ఆ ఇంట్లో అందరికీ ఆరోప్రాణం."

"సారీ... వెరీ సారీ..." అతని అవస్థ గమనించిన వారెవరో ఇంట్లోంచి ఫ్యాన్ తెచ్చి పెట్టారు.

"అమ్మా..." పనివాడు పిలవటంతో సుమిత్ర వెళ్ళిపోయింది. మన్మోహన్ హృదయంలో ఎక్కడో సన్నని పోటు ప్రారంభం అయింది. ఇతరుల మాటలు విని తనెంత అన్యాయంగా ప్రవర్తించాడు. ఆ అమ్మాయి మొగవాళ్ళను నీచంగా చూస్తుంది. పురుగులను తీసేసినట్టు తీసేస్తుందని అందరిమాటలు తన మనసులో ఓ వెగటు భావాన్ని పుట్టించాయి.

"మూర్ఖులతో కాలం పాడుచేయటం నాదే బుద్ధి తక్కువ." అన్న ప్రశాంతి మాటలు అతని చెవుల్లో గింగురుమనసాగేయి. అతను రుమాలుతో ముఖం తుడుచుకుని లేచాడు. ఒకమ్మాయి కులుకుతూ అతనిముందు నిలబడింది. అతను ఏమిటన్నట్టు చూచాడు.

"మీకు ఫలహారం కావాలా?"

"అక్కరలేదు." అన్నాడు.

ఇంతలో సుమిత్ర రావటంతో, ఆ అమ్మాయి పరుగెత్తుకుపోయింది.

"మనూ!"

"ఊఁ."

"జరిగింది మరిచిపో. నిన్నోమాట అడగనా?"

"అడుగు."

"ఇందాక నీ ముందు నిల్చున అమ్మాయి ఎవరు?"

"నాకెలా తెలుస్తుంది."

"లాయర్ విశ్వనాధంగారి ఏకైక పుత్రిక."

"అయితే? ఆయనకు నన్ను దత్తు ఇస్తావా?"

"అంతా తొందరే."

"మరి నీ అడగటం చూస్తే ఏమనాలి?"

"అది కాదురా. ఇన్నాళ్ళుంటే వివాహం అనగానే అరుణను అడ్డువేసేవాడివి. ఇప్పుడేం?"

"ఇప్పుడు వద్దని నేను అన్నానా? నువ్వు నన్ను అడిగిందెప్పుడట."

"అలా దారికిరా చిట్టి తండ్రి. తండ్రి లేని కొడుకువంటూ అపురూపం చేసి అమ్మా, పిన్ని పాడు చేశారు నిన్ను."

"మీ ఆయన డాక్టరే కదూ-" అన్నాడు నవ్వుతూ. ఆ నవ్వు బలవంతంగా తెచ్చి పెట్టుకుందని యెవరికయినా ఇట్టే తెలిసిపోతుంది.

"అది కాదురా... ఆ అమ్మాయి... అదే విశ్వనాథం గారి కూతురు అందంగా లేదూ?"

"లేదని నేను అన్నానా?"

"మరి వాళ్ళు మీ బావ ప్రాణం తీస్తున్నారు. పిన్నితో మాట్లాడేదా?"

"అమ్మతో మాట్లాడటానికి, బావ ప్రాణానికేం లంకె!" అన్నాడు ఆశ్చర్యం నటిస్తూ.

"మాటలు నేర్చావు."

"నేనా? ఒక్కమాటలో ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటావా అని అడిగి ఏడ్వరాదూ?"

"అలాగే. ఆ అమ్మాయిని..."

"పెళ్ళిచేసుకోను." మధ్యలో త్రుంచేశాడు మాటలు.

"ఏం? యెందుకు?"

"అలాంటి వారిని నాలాంటి వాడు భరించగలడని యెలా అనుకున్నావు?"

"ఏం? అంత లావుగా ఉందేమిటి? తండ్రికి ఒక్కర్తే పిల్ల. ముఖ్యంగా నువ్వంటే ఇష్టము."

"అమ్మా! సుమిత్రా! మా ఇంటికి, పెద్దమ్మ ఇంటికి నువ్వే పెద్దాడబడుచువి. కావాలంటే ఇదిగో నీ కట్నం. నన్నిలా బతకనియ్యి." అంటూ జేబులో వంద రూపాయలు తీశాడు.



"చాల్లే శానతనం! పోనీ నీ మనసులో యెవరయినా ఉంటే చెప్పరాదూ."

"సుమిత్రా! మీ ఆయన్ని, నానిగాడిని చూసుకోవే చాలు. ఈ పెళ్ళిళ్ళ పేరమ్మ పని నీ కెందుకు?"

"మొండివాడివి." విసుక్కుంటూ యెవరో పిలిస్తే వెళ్ళింది.

మన్మోహన్ షామియానా వంక చూశాడు. చాలా మటుకు అతిథులు వెళ్ళిపోయారు. కొందరు యువతులు కూర్చుని సినిమా కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళలో అరుణ కూడా కూర్చుంది.

"అరుణా! వెళ్దాం పద" అన్నాడు.

"ఏమిటయ్యా బాబు, మీ చెల్లిని కొరుక్కుంటామా?" వరుసకు మరదలయిన ఒకావిడ అంది.

"అవును. పెళ్ళి అయితే మళ్ళీ ఎప్పుడు కలుస్తామో." మరొక యువతి అన్నది.

"సరే... సరే. పది నిమిషాల్లో తెమలాలి. అమ్మ ఒక్కర్తీ ఉంది" అనుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు. అక్కడ టేప్ రికార్డరు దగ్గర చేరిన యువకులు నవ్వుతున్నారు. గుణవంత్ రావ్ హీరోలా ఫోజు పెట్టాడు.

"అబద్ధం యెందుకు చెప్పావురా?"

"తెలివి బాగానే ఉంది. నిజం చెబితే మన్మోహన్ ఆ అమ్మాయి మీద అలా విరుచుకు పడేవాడా?" తను చేసిన ఘనకార్యము మరోసారి గొప్పగా చెప్పుకున్నాడు.

"కాలు తొక్కాను. కల్యాణం అయిందంటావా."

"ఊరుకోరా బాబూ! ఆ అగ్గిబరాటాని భరించే శక్తి యెవరికి ఉంది?"

"అంతకాడికి గొడవెందుకు చేశారు? అనవసరంగా అతన్ని ఇరికించారు. అతనికి నిజం చెప్పాల్సింది రావ్."

"నిజం చెబితే నా రెండో చెంప పగిలేది." గుణవంతరావు భయంగా చూచాడు.

"ఇప్పుడేం మించిపోయింది." అంటూ మన్మోహన్ అతని రెండు చెంపలు వాయించాడు. అతను అంతులేని ఆవేశాన్ని బలవంతంగా అణచుకున్నాడని తెలుస్తోంది.

"నేను గంట తరువాత వచ్చి అరుణను తీసుకువెడతానని సుమిత్రమ్మతో చెప్పు." పనివాడితో చెప్పి చరచరా వెళ్ళిపోయాడు. మరో నిముషంలో అతని స్కూటర్ స్టార్ట్ అయినట్టు శబ్దం వినిపించింది.

## 5

ఆత్రంగా గదిలో అడుగుపెట్టిన భార్యను చూచి ఉలిక్కిపడ్డాడు వేణు. ఏమని సంజాయిషీ ఇవ్వాలి? పార్టీ సంగతి పూర్తిగా మరిచిపోయాడు. అయిదు నిమిషాల క్రితమే వచ్చాడు.

ఆలస్యంగా వెళ్ళి అందరికీ ప్రదర్శన వస్తువులా అవటం అతని కెంతమాత్రం ఇష్టం లేదు. సునందకు కోపం వస్తుంది. రాదు మరీ? ఇంకెప్పుడిలా జరుగదని హామీ ఇవ్వాలి అనుకున్నాడు. సునంద తలుపులు వేసి, ఊపిరి పీల్చుకుంది. ఎవరో తరుముకు వచ్చినట్టు బట్టలు మార్చుకుంది. గబగబా వచ్చి మంచంమీద పడుకుని ముసుగు తన్నింది. ఇదంతా అలక కాబోలు! అనుకున్నాడు.

"సునీ!"

"నాకు విపరీతమైన తలనొప్పి. నన్ను మాట్లాడించకండి."

"కోపమా?"

"ఊహుఁ... ప్లీజ్! అత్తయ్యగాని, మామగారు గాని వస్తే నేను చాలా అలసిపోయానని చెప్పండి. రేపు మాట్లాడతాను." వేణు అర్థంగానట్టు చూశాడు. భార్య ఇంత వణికిపోతుందేం?

"సునీ! అమ్మా... నాన్న మన గదికి యెప్పుడయినా వచ్చారా?"

"ఈ రోజు వస్తారు... వస్తారు." ఆమె కెంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగటం లేదు. అతని గుండెల్లో తల దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

"సునీ! మతిపోయిందా? ఏం జరిగింది?" యెంతో అనునయంగా అడిగాడు.



"నా తప్పేం లేదండీ. నేను వాళ్ళకు దగ్గరగా కూడా లేను."

"అబ్బబ్బ! సునందా! నీ తలా, తోక లేని మాటలు మతి పోగొడు తున్నాయి. ఏమిటో వివరంగా చెప్పు."

"యుద్ధం... వాగ్యుద్ధం..."

"యెవరికి?" ఆమె భయం చూస్తే అతనికి జాలి వేసింది. దగ్గరగా తీసుకున్నాడు."చూడు సునీ! నీ వల్ల ఏదయినా పొరపాటు జరిగినా నేనేం అనుకోను. ఎవరినీ ఏమీ అననీయను సరా?" అతను అనునయించాక మెల్లగా జరిగిన సంగతి చెప్పింది.

"బావగారు చాలా కంగారుపడ్డారు. టాంక్‌బండ్‌పై కారాపి దాదాపు అరగంట బ్రతిమిలాడారు. ప్రశాంతి దేనికీ సమాధానం చెప్పలేదు. నాకు భయంగా ఉంది."

"ఇందులో నీ తప్పేం ఉంది. వాగ్యుద్ధాన్ని నువ్వేం ప్రోత్సహించలేదు."

"లేకపోతే మాత్రం?" తల అడ్డంగా తిప్పింది. "ప్రశాంతిని బలవంతంగా నేను తీసుకుపోలేదూ?"

"నువ్వేం దిగులు పడకు, అమ్మా, నాన్న ఏదయినా అన్నా నేను నచ్చచెబుతాను."

"ఒకరోజు మీ బంధువులు యెవరో ప్రశాంతి జీన్స్‌ను కామెంట్ చేస్తే మామగారు మండిపోయారు."

"ఇప్పుడే ప్రశాంతిని పిలిచి నాన్నగారి దాక వెళ్లొద్దని చెప్పేదా?" అతను లేవబోయాడు.

"వద్దు... వద్దు. మీకు పుణ్యం ఉంటుంది" అతన్ని గట్టిగా పెనవేసుకుపోయింది.

"ఇక మాట్లాడక నిదురపో."

"నిద్రా..." అతను నిద్రపోయినా అలాగే అశాంతిగా దొర్లుతూ పడుకుంది. మళ్ళీ మెలుకువ వచ్చేసరికి ఎనిమిది గంటలయింది. వేణు అలవాటు ప్రకారం టీ త్రాగుతున్నాడు.

"గుడ్ మార్నింగ్ మేడమ్!"

"ఏం వెక్కిరించ వద్దులెండి."

"ఈ ఆరోపణ బావుంది. లే-లే- టీ చల్లారిపోతోంది."

లేవబోయింది. ఒళ్లు విరుచుకుని కూర్చుంది. తలుపు తోసుకుని ప్రశాంతి లోపలికి వచ్చింది. సునంద మళ్ళీ పడుకుని బ్లాంకెట్టు లాక్కుంది. అది చూచి ప్రశాంతి నవ్వింది.

"ఇంకా లేవలేదా వదినా?"

"ఉహుం... తల పగిలిపోతుంది." బాధ నటిస్తూ అంది.

ప్రశాంతి విరగబడి నవ్వింది. భార్యా భర్తలు ఒకరి ముఖం ఒకరు చూచుకుని నవ్వుకున్నారు. ప్రశాంతి ఇంట్లో వాళ్ళకు చెప్పలేదన్నమాట.

"చాలించమ్మా నీ నటన." బ్లాంకెట్టు లాగేసింది.

"వదినా నేను పొగరుమోతుదాన్నే కాని మూర్ఖురాలిని మాత్రం కాదు. నీ పొరపాటేముందని అమ్మకు చెబుతాను. పద పద నీ ఫేవరేట్ టిఫిన్ ఉంది.

"శాంతీ!"

"పద తల్లీ. ఆకలి కరకరలాడి పోతోంది."

సునంద లేచి గబుక్కున ప్రశాంతి చెంప ముద్దుపెట్టుకుంది. ప్రశాంతి ఉలిక్కిపడింది.

"ఛీ..... ఛీ...... ఏమిటి పాచిముఖాన" విసుక్కుంది. సునంద బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది. అన్నా, చెల్లెలు ఒకరిని చూచి ఒకరు అభిమానంగా నవ్వుకున్నారు. సునంద స్నానం చేసి బొట్టు పెట్టుకుంటూ, ప్రశాంతి వంక చూచింది. ఆశ్చర్యంగా గుడ్లు వెళ్ళబెట్టింది.

"మళ్ళీ ఏం వచ్చింది?"

ఎప్పుడో వాళ్ళ పెద్దన్న బహుమతిగా తెచ్చిన నీలం అంచు హాండులూమ్ చీర కట్టుకుంది. జుట్టు ఒక దగ్గరికి లాగి బాండ్ కట్టుకుంది. ముందునుండి చూచినవారు జడవేసుకుందనుకుంటారు. లిప్‌స్టిక్ లేదు. రంగులు లేవు. నుదుట చిన్న నీలంబొట్టు. చేతులకు నీలం గాజులు ఉన్నాయి.

"అన్నయ్యా! యెందుకయినా మంచిది మీ ఆవిడను మెంటల్ ఆస్పత్రిలో చేర్పించు."



"అవును... అవును. నువ్విలా వీధిలోకి వెళ్ళు. అందరూ మెంటల్ ఆస్పత్రికి వెడతారు. ఈరోజు ఓ కొత్త సత్యం తెలిసింది. అందమైనవారు ఏ బట్టలు వేసుకున్నా బాగుంటారని..."

"ఏం రీసర్చిరా తండ్రీ! ఇంత జ్ఞానం మొదటే వుంటే బి.ఏ.లో దండయాత్ర చేయకపోదువు."

"చూడండి..." భర్త దిక్కు చూచింది.

"మీకు పుణ్యం వుంటుంది. మీ వాగ్యుద్ధంలో పాల్గొనే ఆయుధం నా దగ్గరలేదు." అతను లేచి క్రిందికి పోయాడు. ఒదినా, మరదళ్ళు ఇద్దరూ నవ్వుతూ మేడ దిగారు. హాల్లో నవ్వుతూ రఘుపతితో మాట్లాడుతున్న వ్యక్తిని చూచి ఇద్దరూ తెల్లబోయారు.

"నిన్ను చాలాసార్లు చూశాను. మనం బంధువులమని తెలియదోయ్." రఘుపతి సంతోషంగా అంటున్నాడు. అతను కూతురి వంకకు తిరిగాడు.

"అదిగో వచ్చింది. ప్రశాంతీ! మన్మోహన్‌వల్ల ఏదో చిన్న పొరపాటు జరిగిందట క్షమార్పణ చెప్పాలని వచ్చాడమ్మా."

సునంద మండిపడ్డట్టు అతనివంక చూస్తోంది. శాంతికి గుండెలు ఎక్కడో కలవరం బయలు దేరింది. ప్రయత్నపూర్వకంగా అణచిపెట్టింది. చిన్నగా నవ్వుతూ నమస్కరించింది. అప్పుడు తనెంతో మర్యాదగా చేతులు జోడించాడు. ఆ కళ్ళలో రాత్రి కన్పించిన జుగుప్స, నిరసన, తీవ్రత ఏం లేవు. స్వచ్ఛంగా వున్నాయి.

"సునందా! బ్రేక్‌ఫాస్ట్ ఇక్కడికే పంపు." రఘుపతి చెప్పాడు.

"అలాగే." నమ్మలేనట్టు మరోసారి తన అన్నగార్ని చూస్తూ లోపలికి పోయింది. డైనింగ్ హాల్లోనుండి వేణు బయటికి వచ్చాడు.

"సారీ మన్మోహన్‌గారూ! వీళ్ళంతా వున్నారు. నాకు టైమయింది."

"నో.నో. మీరు వెళ్ళి రండి." అతను బట్టలు వేసుకోవడానికి మేడ యెక్కాడు.

"అసలింతకూ ఏం జరిగిందోయ్? యెక్కడికి వెళ్ళినా పార్టీవిశేషాలు చెబుతుంది మా అమ్మాయి. రాత్రి మాట్లాడనే లేదు."

"ఏం లేదు నాన్నా! చిన్న వాదన..." సర్దేసింది ప్రశాంతి. ప్రణతి, ఫలహారంతో సునంద వచ్చారు. అందరూ ఫలహారం చేశారు.

"మా ఇల్లు చూద్దువురా అన్నయ్యా." సునంద పిలిచింది. అందరు పైకి వెళ్ళారు. రఘుపతి పని ఉందంటూ బయటకు వెళ్ళాడు.

"ఏరా! నన్ను సంసారం చెయ్యనివ్వాలని లేదా?" సునంద విరుచుకు పడింది. "రాత్రి నేనెంత నరకం చూశానని. మేం నీకేం అపకారం చేశాము? ప్రశాంతికి నేనంటే అభిమానం కాబట్టి అత్తయ్య దాకా వెళ్ళలేదు."

"అందుకే కదా, ఉదయం లేస్తూనే వచ్చింది. అయామ్ సారీ మిస్ ప్రశాంతీ... రియల్లీ సారీ! క్షమించమంటున్నాను."

"ఒక్కమాటతో అంటే పోయిందా? పదిమందిలో ఎంత అవమానం! వాళ్ళంతా సత్యసంధులా, ఋష్యశృంగులా! రావు సంగతి నాకు తెలియదా. ఆడపిల్ల కనిపిస్తే ఒళ్ళూ, కళ్ళూ తెలియని వెధవ."

"సునందా! నేనేం చేస్తే నీ కోపం పోతుందో చెప్పు."

సునందకు మండిపోయింది. ఒంగి ప్రశాంతి పాదాలు పట్టుకోమని అనాలనుకుంది. అంతలోకే ప్రశాంతి జవాబు యిచ్చింది.

"ఈ పూట ఇక్కడే భోజనంచేసి వెడితే మీ చెల్లాయి కోపం పోతుంది." అని రాత్రి ఎంత భయపడిందో క్లుప్తంగా చెప్పింది. అతని చిరునవ్వులో చిన్న బాధావీచిక తొంగి చూచింది. అతను ప్రశాంతివైపు తిరిగాడు.

"సునంద సంగతి వదిలేయండి. మీరు మనస్ఫూర్తిగా క్షమించాలి" అన్నాడు.

"మీ గుణవంతుడి ధైర్యానికి మెచ్చుకోవాలి. నా వెనుకయినా నిజం అంగీకరించినందుకు." నిజం చెప్పడం దేనికని అతను నవ్వేశాడు.

"మీరు విధించిన శిక్షలాంటిదే ప్రతిసారీ విధిస్తే వారంలో నాలుగు పొరపాట్లు చేసి భోజనానికి వస్తాను."

"తప్పకుండా."



"కాని ఈ రోజుమాత్రం క్షమించాలి. మా అరుణ వివాహ ముహూర్తం నిర్ణయించటానికి పెద్దలు వస్తున్నారు." అతను అనే తీరును చూస్తే బలవంతం చేయాలనిపించలేదు. ఎందుకో యిద్దరూ ఒకరిని ఒకరు చూచుకోవటానికి జంకినట్టు ఎటో చూస్తూ మాట్లాడటం ప్రణతి గమనించింది.

"ఓహో! మీరేదో ప్రోగ్రామ్ పెట్టుకుని వచ్చారన్నమాట!" "మళ్ళీ ఎప్పుడొస్తారు?"

అతను సమాధానం వెంటనే చెప్పలేకపోతే చూపుడు వేలుతో ముక్కురాసుకుంటాడు. ముక్కు రాసుకుంటూ పెదవి నొక్కిపట్టాడు. సునంద కల్పించుకుంది.

"వాడు ప్రతి నిముషము విలువయింది అంటాడు. వస్తే గిస్తే తన చెల్లి పెళ్ళికి పిలవటానికి వస్తాడు."

"నిజం! ఆ సంగతే గుర్తుకు రాలేదు. ఇన్విటేషన్ కార్డ్సు తీసుకుని వస్తానండీ."

"పని వుంటే తప్ప రారన్నమాట." అతనితో మాట్లాడుతుంటే ప్రశాంతి ముఖంలో ఏదో జీవకళ సజీవంగా మెరుస్తుందని ప్రణతి పసిగట్టింది. అతను వెళ్ళిపోయాడు. శాంతి తొందరగా బాల్కనీలోకి వెళ్ళి నిల్చుంది. పైజామా లాల్చీలో కొంచెం వయసు తగ్గినట్టు కన్పించాడు. అతని స్కూటర్ వెళ్ళిపోయినా అక్కడే నిల్చుంది.

## 6

"శాంతీ!"

వెళ్ళబోయేది ఆగి, తల్లి దగ్గరికి వెళ్ళింది. మంచంలో చోటు చేసుకుని కూర్చుంది.

"విద్యాసాగర్ తొందరపడుతున్నాడమ్మా."

"మరి ఆలస్యం దేనికి? ప్రణతి కూడా ఇష్టపడిందిగా."

"పెద్దదానవు నువ్వుండగా..."

"అవన్నీ పూర్వకాలపు పద్ధతులూ, ఆచారాలూ. నా ఎం. ఏ అయ్యే

వరకు మరేం మాట్లాడొద్దు. ఇన్నాళ్ళూ హోటళ్ళలో, సినిమాలలో, టాంక్ బండ్ మీద యెక్కడ అంటే అక్కడ ఇంటర్వ్యూకు హాజరయ్యాను. ఎందుకు? మీ తృప్తి కోసం. ఇకముందు నన్ను అలా పంపొద్దమ్మా." ఆఖరిమాట అనేటప్పుడు ఆమె కొంత వణికింది.

"పోనియ్యమ్మా, నీ కిష్టం లేనిది ఏమీ జరగదు. నాకో మాట వింటే సంతోషం, నిశ్చింత కలుగుతాయమ్మా. నీ మనసులో యెవరయినా ఉన్నారా?"

"ఊఁ" అంది లేచిపోతూ ప్రశాంతి. కాంతమ్మ హృదయం పొంగిపోయింది.

ప్రశాంతి ఇష్టానికి వ్యతిరేకంగా ఆ ఇంట్లో ఏదీ జరుగదు. అందుకే ప్రణతి వివాహం చెయ్యాలని నిశ్చయించారు. ప్రతిరోజు బట్టలకని, సరుకుల కని బజారు వెడుతున్నారు. సాగర్ తనకు నచ్చిన సూట్లు కొన్నాడు. వేణు డబ్బులు ఇస్తున్నాడు. ఆ ఖర్చు చూస్తుంటే వేణుకు మతిపోసాగింది.

ఆ రోజు మధ్యాహ్నము సాగర్ వేణుకు ఫోన్ చేసి తన వద్దకు ఒకసారి రమ్మన్నాడు. వేణు వెళ్ళి నిస్పృహగా తిరిగి వచ్చాడు.

"ఏమిట్రా?" కాంతమ్మ అడిగింది.

"ఏముందమ్మా ఎవడో కెనడానుండి వస్తూ రేడియోగ్రామ్ తెచ్చాడుట. సాగర్‌కు నచ్చింది."

"యెంత?"

"మూడువేలు." ముభావంగా చెప్పి పైకి వెళ్ళి పోయాడు. కాంతమ్మ దగ్గర జమా, ఖర్చుల లెక్కలు లేకపోయినా, దానికింత, దీనికింత అని కూడు కుంటే పాతికవేలు అయ్యాయి. యాభై వేలు క్యాష్ కావాలన్నాడట. పెళ్ళి అయ్యేసరికి యెంతలేదన్నా మరో పాతిక వదిలేట్టుంది. ఒక పిల్లకు లక్షా?

"అమ్మా ! లాంఛనంగా కొన్ని పాత్రలు ఇవ్వాలిగా. నువ్వూ, శాంతీ వెళ్ళండి. మీకు నచ్చినవి తీసుకోండి." వెయ్యి రూపాయలు బల్లమీద పెట్టాడు వేణు. రఘుపతికి గుండెజబ్బు మూలాన జమా, ఖర్చులన్నీ వేణు చూస్తున్నాడు.



"వెయ్యి ఏం చాలుతాయి అత్తయ్యా?" సునంద అడిగింది. "వెండిపాత్రలు ఇవ్వరూ?"

"తలకేసి కొట్టుకోనా? పెద్దాడికిచ్చినవి అలా మూలుగుతున్నాయి. వాటికి కాపలా కాయలేక చావు" కాంతమ్మ తన అయిష్టతను వెళ్ళడించింది. "పదమ్మా శాంతీ."

"నేనెందుకమ్మా? ప్రణుకు కొంటున్నారు దాని ఎన్నిక కావాలి."

"ఇదెక్కడి విడ్డూరమే. సారె కూడా పెళ్ళి కూతురి ఇష్టమా? మా కాలంలో..."

"అమ్మా!" అసహనంగా అంది శాంతి. "మీ కాలం కాదమ్మా. పోని ఓ మాట చెప్పు. నువ్వు వివాహానికి పూర్వం నాన్నగార్ని చూచావా?"

"ఇదెక్కడి సిగ్గులేని పిల్లమ్మా." ఆవిడ, ఆ రోజులు గుర్తుకు తెచ్చుకుంది.

"నువ్వు ఏమయినా అనుకో. ఇప్పుడు మీరంతా మా ఇష్టప్రకారమే వరుడిని వెతికినప్పుడు, మా కిష్టమైన వస్తువులు కొంటే తప్పు లేదనుకుంటాను. ప్రణూ!" చెల్లెలిని కేక వేసింది.

"ఏమిటే?"

"అమ్మ వెంట బజారుకు వెళ్ళి నీ సంసారానికి కావల్సిన వస్తువులు కొని తెచ్చుకోవే."

కాంతమ్మ కూతుర్లనిద్దరిని మార్చి, మార్చి చూసింది. ప్రశాంతి నిర్మోహమాటస్తురాలు. ప్రణతి అలా కాదు. అది బజారుకు రానంటుంది అనుకుంది. కాని తల్లి ఆలోచనకు విరుద్ధంగా అయిదు నిమిషాల్లో తయారయి వచ్చింది. తల్లి ముఖం అప్రసన్నంగా అయింది. ప్రశాంతి గ్రహించింది.

సాయంత్రం బండెడు సామాన్లతో, వాడిన ముఖాలతో ఇల్లు చేరారు.

"వెయ్యిరూపాయల్లో యిన్ని సామాన్లే!" ప్రశాంతి గుండెలమీద చెయ్యివేసుకుంది.

"నీకు వెయ్యిరూపాయలకు ఇన్ని సామాన్లు ఏ తలకు మాసిన వాడిస్తాడే? రెండున్నర వేలు ఖర్చయింది. జంబులింగం కొట్లో ఖాతా రాయించాం."

"ఇన్ని యెందుకు కొన్నట్టు?"

"యెన్ని ఉన్నాయేం?" కయ్యిమని లేచింది ప్రణతి. "అన్నీ అవసరమైన వస్తువులే. కాకపోతే నా అభిరుచికి తగినట్టు సెట్లు తెచ్చుకున్నాను."

"అవున్లే. వెండిసామాన్లు అడిగితే, అంత ఖర్చు అయ్యేదిగా!" కాంతమ్మ అంటుండగానే ఫోను మ్రోగింది. సాగర్ నుంచి ఫోన్. తన తమ్మునికి ఇష్టంలేదు కాని తల్లికి సరదా అట. వెండి కంచాలు, చెంబు, ఇతరత్రా చిన్న, చిన్న సామాన్లు కావాలిట. అది విన్న ప్రశాంతి మండిపడింది. ఎంత వంచన! ఎంత నటన. తన వారిని వదులుకోగల పెద్దమనిషి.

రెండు మూడు రోజులు ప్రశాంతి అశాంతిగా గడిపింది.

వేణు, సునంద తయారయి వెడుతున్నారు. ఎక్కడికని అడక్క ముందే తెలిసిపోయింది. పనికుర్రాడు వివాహ ఆహ్వాన పత్రికలు వెండి పళ్ళెంలో పెట్టి కార్లో పెట్టాడు. సునంద చేతిలో కుంకం భరిణ ఉంది.

"నేను రానా అన్నయ్యా?"

"అమ్మ ఏమంటుందో! .... ఫరవాలేదు. పద, అయిదు నిమిషాల్లో తెమలాలి మరి."

"ఇలాగే వస్తాను పద."

"అయితే ఈ రోజు వడగళ్ళ వాన పడుతుంది." అతను నవ్వుతూ వదినా, మరదళ్ళు యెక్కగానే కారు స్టార్ట్ చేశాడు.

"అన్నయ్యా నేనో మాట అడిగేదా?"

"నాకు తెలుసు శాంతీ! సాగర్ గురించే కదూ నువ్వు అడిగేది? అతనిలో ఆశాపరుడయిన ఇంకో పురుషుడున్నాడని, ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తాడని అనుకోలేదమ్మా. ఇప్పుడయినా మించిపోయింది లేదు వివాహం మాన్పించాలనుకుంటే. ప్రణు పూర్తిగా అతని ఇంపాలాకి దాసురాలయింది."

"ఊఁ" యెంత ప్రమాదం తప్పిపోయిందన్నట్టు నిట్టూర్చిందామె.

శుభలేఖలు ఇస్తూ, వారిచ్చిన కాఫీయో, టీ యో త్రాగుతూ కొన్ని చోట్ల వద్దని వారిస్తూ పంచేశారు.



"సునందా! స్నేహితులను పిలవటానికి మీరు వెళ్ళండి. నాకు అవసరమైన పని ఉంది."

"మీరు యెలా వెడతారు?"

"టాక్సీలో వెడతాను. ప్రశాంతీ! జాగ్రత్తమ్మా. నీవు స్పీడుగా నడుపుతావు." అతను హెచ్చరించి దిగిపోయాడు. విద్యానగర్‌లో స్నేహితులకి ఇచ్చారు. కారు నడుపుతున్న శాంతి సడెన్ బ్రేకుతో ఆపింది. మనిషో, కుక్కో కారుకింద పడిందని అనుకుంది సునంద. భయంతో, కళ్ళు మూసుకుంది.

"వదినా!"

"నేను చూడలేను..."

"కళ్ళు తెరువు."

"కారు క్రిందకు ఏం వచ్చింది."

"నా తలకాయ." విసుక్కుంది. "అడుగో ఆ యెదురింట్లో చూడు." సునంద తాపీగా కళ్ళు తెరిచి చూచింది. ఆమె ముఖం ప్రసన్నంగా మారిపోయింది.

"నువ్విక్కడే వుండు. రెండంటే రెండు నిముషాల్లో పిన్నికి శుభలేఖ ఇచ్చి వస్తాను" చిన్న పిల్లలా పరుగెత్తింది సునంద.

స్టీరింగ్‌వీల్ పట్టుకుని కూర్చుంది శాంతి. యెంత వద్దనుకున్నా తల తిప్పకుండా ఉండలేక పోయింది. చిన్న ఇంటిముందు పూలమొక్కలలో అతి శ్రద్ధగా గడ్డి పీకేస్తున్నాడు మన్మోహన్. పైజామా, బనీను వేసుకున్నాడు. కండలు తిరిగిన శరీరంతో గమ్మత్తుగా కన్పించాడు 'ఛీ... అంత మర్యాదలేని మనుషుల్ని గూర్చి ఆలోచించడం బుద్ధి తక్కువ' అనుకుంది. అతను నవ్వుతూ సునంద వీపుపై చిన్న దెబ్బ వేశాడు. ఆమె మరింత గారాలు పోతూ లోపలకి తుర్రుమంది. 'ఏం ఆడవారురా నాయనా, తను ఫలానా అని చూపించే వరకు పిన్ని పేరయినా యెత్త లేదు. అకస్మాత్తుగా ఇంత ప్రేమ పుట్టుకు వచ్చింది. తన్ను తాను మైమరిచిపోయింది.' అనుకుంది.

"నమస్తే!"

ఉలికిపడి ఇటు తిరిగింది. షర్టు గుండీలు పెట్టుకుంటూ నిల్చున్నాడు మన్మోహన్. ప్రతి నమస్కారం చేసింది.

"పిలవటానికొచ్చి కార్లో కూర్చోటం మర్యాదేనా?"

"మీ చెల్లి కూర్చోమన్నది" అని చెప్పాలనుకుంది. కాని అతనికి సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం తనకేం?

"ఒకరు వచ్చి పిలిస్తే పిలుపు చాలదా?"

"అలా ఒకరు రాక పోస్టులో పంపినా నా కభ్యంతరం లేదు. అభినందించటానికి వస్తాను. ఇలా కార్లో కూర్చుంటే దారిన పోయేవారికి ప్రదర్శన వస్తువు అవుతారు. ఇక మా సునంద సంగతి మీరు గ్రహించి వుండాలి. అయిదు నిమిషాలంటే గంట అని వేసుకోండి. అరుణ, అమ్మ అదీ ముగ్గురూ ఒకచోట చేరితే మాటలు ఊరుతూనే వుంటాయి" అని డోరు తీశాడు. దిగక తప్పలేదు. ఆ ఇల్లు తమ మేడ వెనుక అవుట్‌హౌస్‌లా వుంది.

"రండి." లోపలికి దారితీశాడు.

"ఈ మొక్కలమధ్యే బావుంది."

"అవును. టాంక్ బండ్‌న మీ నివాసం. ఇంట్లో ఉక్కగా ఉంటుంది." అక్కడున్న కుర్చీ ఆమెకు చూపి, వేపచెట్టు తిన్నెమీద తను కూర్చున్నాడు. ఆడంబరంగా లేకపోయినా, శుభ్రంగా వుంది.

"మీ చెల్లి వివాహం ఎప్పుడు?"

"శుక్రవారము."

"ఆఁ...." నమ్మలేనట్టు చూచింది. "ఈరోజు సోమవారం. ఇంకా వారం రోజులు కూడా లేదు. నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారేం? ప్రణతి వివాహానికి ఇంకా పదిహేనురోజులున్నా మేమందరం హడావుడిగా తిరుగుతున్నాం."

పెళ్ళి అబ్బాయి ఇంటిదగ్గరా?

"లేదు. మా యింటి దగ్గరే." అతను నవ్వాడు. "మీ సందేహం నాకు తెలుసు. ఆడంబరంగా ఏర్పాట్లు జరగటం లేదని కదూ? మీ స్థితి మాకు తెలుసు. జుట్టు కత్తిరించుకోవటం, జీన్స్ వేసుకోవడం, హిప్పీలను



అనుకరించడం ప్రగతి మార్గం కాదు. సంసారాలు కూల్చే దురలవాట్లను నిర్మూలించటం, తన స్థితి ఎరిగి బ్రతకడం..." అతను చెప్పుకుపోతున్నాడు. ఆమె ముఖం ఎర్రబడింది. అది గమనించనే లేదు.

"క్లుప్తంగా మా సమక్షంలో, ఆలయంలో వివాహం అవుతుంది. సాయంత్రం ఇక్కడ ముఖ్యమైన స్నేహితులకు, బంధువులకు టీపార్టీ..."

"టీపార్టీ కూడా దేనికి? ఓహో అర్థం అయింది. కానుకలు కావాలి కదూ?"

ఈసారి అతని ముఖం ఎర్రబడింది. ప్రశాంతికి సంతోషంగా ఉంది ఎదురు దెబ్బ తీశానని.

"ఎవరితో మాట్లాడినా మీ స్థితి ఏమిటో యెరిగి మాట్లాడండి. మా ఇష్టం జుట్టు కత్తిరించుకుంటాం. నగ్నంగా నాట్యం చేస్తాం." విసురుగా లేచి కార్లో కూలబడి, బొయి బొయమని హారన్ మ్రోగించింది. సునంద పరుగెత్తుకు వచ్చింది.

"వస్తాను పిన్నీ..."

"నీ మతిమరుపు చల్లగుండా, అమ్మాయి ఉందని చెప్పవేమిటే?"

"నాకు కూర్చోవటానికి మీ ఇంట్లో ఏం ఉండవని మీ సునంద భయం లెండి." జవాబిచ్చి కోపంగా యాక్సిలేటర్ నొక్కింది. 'గూయి' మంటూ శబ్దం చేసిందే తప్పితే కారు కదలలేదు. మరోసారి, రెండోసారి. లాభం లేకపోయింది.

"అన్నయ్యా! కాస్త ట్రబులేమిటో చూడరా?"

"మొదట ఆవిడ అంగీకరిస్తుందా అడుగు."

"అక్కరలేదు. కార్లముఖం చూడని మీకు దాని సంగతి ఏం తెలుసు?" పొగరుగా అని బోనెట్ యెత్తి చూచింది. ఏం అర్థం కాలేదు.

"వదినా! అల దిష్టిబొమ్మలా నిలబడకపోతే వెళ్ళి అన్నయ్యకు ఫోనులో ఈ విషయం చెప్పరాదూ?"

"మా ఇంట్లో ఫోను లేదు మేడమ్!"

"తెలుసు..." విసుగ్గా చూచింది.

"ప్రశాంతీ! ఈ ఒక్కసారి అన్నయ్యను చూడనియ్యి. ఇంటి దగ్గర అదుర్దా పడుతుంటారు."

"మీ అన్నయ్య రీడరా, మెకనిక్కా?" విసుగ్గా తాళం చెవులు గిరాటేసింది.

"అన్నయ్యా! ప్లీజ్!" సునంద మాట పూర్తికాక పూర్వమే అతను కీస్ తీసుకుని పని ప్రారంభించాడు. బోనెట్ యెత్తి చూశాడు. పెట్రోలు కావల్సినంత అందటం లేదు. కార్బొరేటర్ తీసి శుభ్రపరిచి మళ్ళీ పెట్టేసరికి సరిగ్గా అరగంట పట్టింది. అతను ఇంజన్ స్టార్ట్ చేసి చూశాడు.

"సునందా! ఇదిగో కీస్. ఇక వెళ్ళొచ్చు."

"థాంక్స్ అన్నయ్యా!"

"మీ అన్నయ్య చక్కని సైడ్ బిజినెస్ చెయ్యొచ్చు వదినా! రోజుకు అధమపక్షం పది రూపాయలు గిడతాయి." నిర్లక్ష్యంగా నవ్వుతూ అంది ప్రశాంతి.

"శాంతీ!" సునంద గాభరాగా చూసింది.

"సునందా! మీ ఆడబడుచు పాపం బట్టీపట్టి చదువుకుందిలా ఉంది. చదువుకు తగిన సంస్కారం లేదు. ఏం చేస్తాం. నువ్వు లేకపోతే చెవులు పిండి పాతిక రూపాయలు రిపేర్ చార్జీల క్రింద వసూలు చేసేవాడిని." మన్మోహన్ పెంకెగా అన్నాడు.

"పాతిక కాదు. ముప్పై. ఇప్పుడే పారేస్తాను." పర్సు తీసింది.

"థాంక్స్... థాంక్స్! జేబు ఖాళీగా వుంది. ఎలాగా అని భలే తికమక పడ్డాను సుమండీ."

ప్రశాంతికి ఆశాభంగం కల్గింది. యెప్పుడూ వందకు తక్కువ వుండదు పర్సులో. ఈరోజు చూసుకోలేదు. పది నోటు కొంత చిల్లర మాత్రమే వుంది.

"రసీదు కావాలా మేడమ్?"

"బిల్ ఇంటికి పంపించు." కార్లో కూర్చుంది.

"శాంతీ?" సునందకూడా యెక్కింది.

మీ అన్నయ్యకు మన్మోహన అని పెట్టేకంటే, అమర్యాదారావు అన్నపేరు బావుంటుంది."



"సునందా! మీ ఆడపడుచు పేరు 'అహంకారమ్మ' అంటే చాలా బావుంటుందే." కొంటెగా నవ్వాడు.

"అన్నయ్యా!" సునంద అసహాయంగా చూచింది.

ప్రశాంతి కోపమంతా యాక్సిలేటర్ పై చూపింది.

## 7

ప్రణతి వివాహం ఘనంగా ముగిసింది. వియ్యాలవారి ఆరళ్ళకు లక్ష్మీపుత్రుడయిన రఘుపతికూడా హడలిపోయాడు. విద్యావంతుడయిన సాగర్ నవ్వుతూ అన్నీ చూస్తుంటే ప్రశాంతికి యెక్కడలేని కోపం వచ్చింది. వెళ్ళి అతన్ని తన్ని తగిలేసి ప్రణతిని లాక్కు రావాలనిపించింది. సాయంత్రం వెళ్ళి పోయే చెల్లెలు... ఇరవై ఏళ్ళుగా ఒకచోట మసలిన తోబుట్టువు, దూరం అవుతుందనుకుంటే యెక్కడలేని బాధ వేసింది. తన కోపాన్ని సర్దుకుని ప్రణతి బట్టలు సర్దుతూ కూర్చుంది.

"శాంతీ!"

"ఏమిటి ప్రణూ?"

"నేను... నేను..."

"చెప్పవే" గోరింటాకుతో చక్కగా మెరిసే చేతుల నాణ్యం పరీక్షించసాగింది.

"జపాన్ నైలాన్ చీరలు అన్నీ నాకు నచ్చాయే. నేను అన్నీ తీసుకోనా?"

ప్రశాంతికి అప్పుడు గుర్తుకు వచ్చింది. తమిద్దరి చీరలు కలిసే ఉన్నాయని. నవ్వుతూ తీసుకోమన్నట్టు చెల్లెలివంక చూచింది. సారధి వచ్చాడు పైకి.

"ప్రశాంతీ! నేను సాయంత్రం వెళ్ళాలనుకుంటున్నాను."

"మంచిది మామయ్యా!"

ప్రశాంతి ఆలోచనలో పడింది యెందుకో. యిందాక వివాహ మంటపంలో కూడా ఆమె చుట్టే తిరగటం చికాకు అన్పించింది.

నువ్వు వుండమంటే రెండురోజులు సెలవు పొడిగిస్తాను.'

"సెలవుంటే ఫరవాలేదు, పొడిగించడం దేనికి?"

"శాంతీ! భగవంతుడు నీకు అందం ఇచ్చాడు గాని అనురాగం ప్రదర్శించే హృదయం యివ్వలేదు. మొగవాడి మనసును అర్థం చేసుకునే తెలివి తేటలు లేవు." విసురుగా వెళ్ళి పోయాడు. అతని విసురు అర్థం కాలేదు. ప్రణతి అలమరా ఖాళీ చేసింది. క్రింద గోల విన్పిస్తోంది. వెడదామని గది బయటకు వచ్చింది. సాగర్ పైకి వస్తున్నాడు. అతన్ని దాటుతూ వెళ్ళాలంటే అదోలా ఉంది. అందుకే ప్రక్కనున్న గదిలోకి వెళ్ళింది. అది వారి స్టడీరూమ్.

"హల్లో!"

వెనుతిరిగి చూచింది. సాగర్ అప్పటికే గదిలోకి వచ్చాడు.

"మీరా!" అన్నది ఆశ్చర్యాన్ని అణచుకుంటూ.

"ఒక విషయం చెప్పాలని వచ్చాను."

"నాతో చెప్పే విషయాలు ఏమున్నాయి?" ఏం చెబుతాడు. 'కట్నాలు, లాంఛనాలు నా కిష్టం లేదు. మా వారికోసం తీసుకున్నాను' అని చెప్పొచ్చు.

"ఎందుకులేవు ప్రశాంతీ" అతని గొంతు యెలాగో అయిపోయింది. "మొదటిచూపులోనే నా సర్వస్వం నీ ముందు సమర్పించుకున్నాను. మీ ప్రణతిని చేసుకుంది కేవలం నిన్ను అప్పుడప్పుడు చూడవచ్చని..."

"ఛీ... ఛీ ఆ మాట అనడానికి సిగ్గులేదూ?"

"నీ ముందు ఏమీ గుర్తుండవు."

"ఈ మాటే మీ శ్రీమతి ముందు చెప్పండి."

"నిర్భయంగా చెబుతాను. భార్యంటే భర్త సుఖం కోరునది. నా సుఖానికి అడ్డు వస్తే కాళ్ళకింద నలిపేస్తాను." అంతే, అతని చెంప చెళ్ళుమంది.

"నీతో మాట్లాడటం నాకే సిగ్గుచేటు." వడిగా బయటికి వచ్చింది. ఆమె ముఖం మాగిన టమోటాపండులా ఎర్రగా ఉంది.

"ఇది నా అదృష్టం అనుకుంటాను. నీకు సరదాగా వుంటే రెండో చెంప కూడా సిద్ధమే."

ఒకసారి అసహ్యంగా చూచి వెనుతిరిగింది. అప్పుడు ప్రణతి బయటికి వచ్చింది.



"యెవర్నే శాంతీ కేకలు వేస్తున్నావ్?"

"మీ ఆయన్ని."

'ప్రణూ! మీ అక్క నిన్ను గూర్చి జాగ్రత్తలు చెబుతోంది."

'ప్రణూ! మీ ఆయన తెలివితేటలు అమోఘం. యెలా నెట్టుకువస్తావో పిచ్చి సన్యాసి.' అనుకుంటూ క్రిందికి దిగిపోయింది. ఆఖరి మెట్టుమీదుండగా సాగర్ గొంతు వినిపించింది.

"మీ అక్క అందగత్తెనన్న భావం ప్రతి అడుగులో ప్రదర్శిస్తోంది. నిజంగా నాకు నువ్వెంతో నచ్చావు ప్రణూ."

చతురుడు. అడ్డమైన గడ్డి తిని అయినా భార్యను సంతోషపెడతాడు. పోనీ అదొకందుకు మంచిదే. ఆమె ఆలోచనలు భంగం చేస్తూ క్రింద గల్లంతు. విద్యాసాగర్ అక్క చేతులు తిప్పుతూ అలగా జనంలోని స్త్రీలాగ అరుస్తోంది.

"ఏమిటండీ గోల!"

"మాది గోలా. బంగళా, డాబు చూచి హోదాకు తగ్గట్టు పెడతారనుకున్నాం."

"ఏం పెట్టలేదు?"

"ఊర్లో విద్యను యెత్తి పెంచిన ఆయా వుంది. పనివారున్నారు. మా కోడలమ్మ మాకేం తెచ్చిందని అడగరూ?" ఆమె కంఠం హెచ్చింది. "మీ వాళ్ళు మరిచిపోయారట."

ప్రశాంతికి మండుకొచ్చింది. ఆవిడను కొర కొర చూచింది.

"ఇంకా ఏం పెట్టాలిట?" పెద్దన్న అడిగాడు.

"అన్నీ అమిరాయట. ఆ ఇంటి ఆడబడుచులకు పెట్టాలంట అన్నయ్యా!"

అందరూ హాస్యం అనుకుని గొల్లున నవ్వారు. అప్పటికే మేడదిగిన సాగర్ మండిపడ్డాడు. అతనికి చెంప దెబ్బ యిచ్చింది కాక అందరినీ అవమాన పరుస్తుందా?

"వాతలు, గీతలు మీరు పెట్టుకోండి. మేం వెడుతున్నాం." తన వారిని కేక వేశాడు. వెనుకాల లారీపైన సామాన్లతో, కూతురితో రఘుపతి

వెళ్ళి దిగబెట్టి వచ్చాడు. ప్రశాంతికి భయంగా ఉంది ఎవరేమంటారో అని. అప్పటికే అలసిపోయారు. వియ్యాలవారి ఆరడితో ఎవరూ ఏం అనలేదు. సాయంత్రం ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తుండగా సారథి వచ్చాడు.

"ఊరు వెడతానన్నారు?"

"నేనుండడం ఇష్టం లేదా?"

"నేను ఇష్టపడితే ఇక్కడే ఉంటారా?"

"అడిగి చూడు." అతని మాటల ధోరణి పూర్తిగా మారిపోయింది. చనువుగా దగ్గరకు వచ్చి, ఆమె ముక్కుపై రాలిన కుంకుం తుడిచాడు. వదినలు వెడుతుంటే తల్లి అందరితో పాటు బొట్టు పెట్టింది. అది రాలి ముక్కుపై పడింది. తుడుచుకోవాలన్న ధ్యాసే లేదు.

"ఛ... ఏమిటిది?" దూరం జరిగింది.

"శాంతీ! అలా కాసేపు టాంక్‌బండ్ మీద తిరిగి వద్దాం."

తనకూ పిచ్చిగానే ఉంది. తను, చెల్లెలు ఒకచోట పెరిగారు. ఆమె అత్తగారింటికి వెళ్ళే సమయానికి తను... పిచ్చిగా మాట్లాడింది.

"పదండి" ఇద్దరూ అలా వెడుతుంటే కాంతమ్మ కళ్ళు మెరిశాయి. చిన్నగా నవ్వుకుంది.

భుజంమీద చెయ్యి పడేసరికి ఉలికిపడింది. అందంగా నవ్వుతూ నిల్చున్నాడు సారథి.

"ఇక్కడికి వచ్చింది మాటాపలుకూ లేకుండా నిల్చోటానికా?"

"మరెందుకు?"

అతను పక్కున నవ్వాడు. ఆ నవ్వు చూస్తే ఆమెకు కంపరం పుట్టుకు వచ్చింది.

"స్త్రీలకు ప్రపంచజ్ఞానం యెక్కువ అంటారు. నీలో మాత్రం ఇంకా పసి చాయలు పోలేదు." ఆమె నుదుటపడ్డ ముంగురులు వెనక్కు నెట్టాడు. "పురుషుడి మనసు అర్థం చేసుకోలేవా శాంతీ?" అతని గొంతు అదో మాదిరిగా ఉంది. అతని ఉద్దేశం తెలుసుకోవాలనుకుంది.

"మీ మనసు కాబోయే అత్తయ్య అర్థం చేసుకోవాలి మామయ్యా!"



"శాంతీ! వేళాకోళానికిది సమయం కాదు. కాళ్ళూ చేతులూ కట్టి తీసుకుపోదును. ఎం.ఏ. కానియ్యమని అక్కయ్య అంది."

"మామయ్యా! అక్కయ్య అభిప్రాయంతో ఏకీభవించినందుకు ధన్యవాదాలు. నా అభిప్రాయం వినండి. మిమ్మల్ని గౌరవించాను. కాని భర్తగా ఊహించలేదు."

"శాంతీ!" ఆమె మాటలు త్రుంచేశాడు. "అక్కయ్య చెప్పినమాట అబద్ధమా?"

"ఏ మాట?"

"నువ్వు నన్ను ఇష్టపడుతున్నావని..."

"యెక్కడో పొరపాటు జరిగింది. నేను మిమ్మల్ని ఇష్టపడతాను. గౌరవిస్తాను..." అతని ముఖంపై అంత క్రితమే వ్యాపించిన నిరాశ మాయమయింది.

" కాని... కాని భర్తగా కాదు. నేను అన్నయ్యను అభిమానించినట్టు."

"చాలు... చాలు... శాంతీ. పద" అతను వెళ్ళిపోయాడు. ఆమె అనుసరించి వస్తుందా, లేదా అన్న ఆరా కూడా లేదు.

## 8

రఘుపతి దంపతులకు మొదటిసారిగా యెన్నడూ రానంత కోపం వచ్చింది కూతురిపై. రెండురోజులుగా ఎవరూ మాట్లాడలేదు శాంతితో. ఒక సునంద మాత్రం మునుపటి లాగే ఉంది. సారథిని ఆపాలని వారు చేసిన ప్రయత్నమంతా వృథాయే అయింది. ఇక రెండురోజులు ఆగితే తను యూనివర్సిటీకి వెడుతుంది. ఈ ఆలోచనలు రావు. అనుకుంటూ టాంక్‌బండ్‌ను, హుస్సేన్‌సాగర్ అలలను చూస్తూ కూర్చుంది.

* * *

"శాంతీ! మీ అన్నయ్య వెళ్ళి ప్రణతిని తీసుకు వచ్చాడు. క్రిందికి రావూ?" సునంద అడిగింది.

"అదేమిటొదినా, సాగర్ రాలేదూ?"

"ఊహుఁ" అని వెళ్ళిపోయింది. నెమ్మదిగా మెట్లు దిగింది. తల్లి గదిలోకి పోబోయింది. ప్రణతిమాటలకు టక్కున ఆగిపోయింది.

"స్వయంగా మా వారే చూశారటమ్మా. ఆయన నా ముఖం చూచి ఊరుకున్నారట. మీ అక్క జీవితం అల్లరిపెట్టడం అయిదు నిముషాలపని అన్నారమ్మా."

"ఛీ... యెక్కడో పొరపాటు జరిగిందే. దానికి కాస్త పొగరున్న మాట వాస్తవమే. అలాంటి చవకబారు పనులు..."

"అబద్ధం చెబితే ఆయనకేం ఒరుగుతుంది?"

"దాన్ని తప్ప మరొకరిని వివాహం చేసుకోనని అన్నయ్యతో చెప్పాడట..."

"ఆ విషయాలు మీకు తెలియకూడదని దాన్నే అడిగారట. ఈ వివాహం జరగదని చెప్పు. లేకపోతే తను చూసిందంతా మీతో చెబుతా నన్నారట."

"ప్రణూ!"

అందరూ ఉలిక్కిపడి చూచారు. "ప్రశాంతి కళ్ళు నిప్పులు కురుస్తున్నాయన్న భ్రమ కలుగుతోంది...."

"ఏమిటే వాగుతున్నావ్?"

"ఉన్నమాటే!"

"సిగ్గులేదూ? నీ మొగుడయిపోయి ఆ వెధవ బ్రతికిపోయాడుగాని లేకపోతే... లేకపోతే..."

"అమ్మా, చూచావా ఆయన్ని వెధవ అంటోంది." ప్రణతికి ఏడుపు వచ్చింది.

"అంతకంటే ఇంకేదయినా ఉంటే అనేదాన్ని ప్రణూ! మీ ఆయన నువ్వూహించినంత ఉన్నతుడూ, సచ్చరితుడూ కాడు. దుర్మార్గుడు, మూర్ఖుడు."

ఆమె మాట పూర్తిచేయకముందుపే తల్లి ముందుకు వచ్చి రెండు చెంపలు వాయించింది.



"చిన్న దానివని అల్లారుముద్దుగా పెంచినందుకు బాగా గడ్డి పెడుతున్నావ్. సాగర్ యెవరనుకున్నావ్ ఈ యింటి అల్లుడు." జీవితంలో మొదటిసారి తల్లిచేత దెబ్బతిన్న ప్రశాంతి రెండు నిమిషాలు రాయిలా నిలబడింది. తేరుకుని చెల్లెలివంక అసహ్యంగా, నిరసనగా చూచింది.

"ప్రణూ! ఒకరోజు నీ అంతట నీవే నిజం చెప్పి ఏడుస్తావ్. వస్తాను." వచ్చినంత వేగంగా పైకి వెళ్ళింది. వెళ్ళేటప్పుడు తల్లివంక చూచింది. ఆమె కూతురి గంధపు వర్ణపు చెంపలు, రక్తవర్ణం దాల్చటం చూచి గిలగిల లాడిపోయింది. సునంద చిత్తరువులా నిలబడింది.

"అమ్మా."

"ప్రణూ! ఈ విషయాలన్నీ మరిచిపోమ్మా. నా మాటగా సాగర్‌కు చెప్పు."

సాయంత్రం వరకూ అక్కడ వుండి తనింటికి వచ్చింది ప్రణతి. జరిగిన విషయాలతో పాటు తల్లి కోరిన విధంగా అన్నీ చెప్పింది. సాగర్ చిన్నగా నవ్వి భార్యను దగ్గరగా తీసుకున్నాడు.

"మీ అక్కంటే నాకు పగా ప్రణూ! ఇకనైనా జాగ్రత్తగా ఉంటారని నోరు జారాను."

ప్రణతికి భర్త పథకం యెంతో నచ్చింది. అచ్చంగా తమ పుట్టింటి లాంటి ఇల్లు కట్టాలని, అందులో ప్రణతి అనే ప్రతిమను ప్రతిష్ఠించాలని. అతనికి టాంక్ బండున స్థలం దొరకటం కష్టమని తెలిసిపోయింది. కొంచెందూరంలో ఆదర్శనగర్‌లో ప్లాటు కొన్నాడు మూడు రోజులనంతరం. పనివాడి మాటలు నమ్మలేకపోయింది. ఇంపాలా కారు అమ్ముడయి పోయింది. ఆ రోజే వివాహానికి వచ్చిన బంధువులు వెళ్ళి పోయారు. భార్యాభర్తలు స్వేచ్ఛగా మాట్లాడే అవకాశము దొరికింది.

"కారు అమ్మారా?"

"అవును. మనమేం లక్షాధికార్లము కాము. ఇల్లు కట్టాలిగా."

ప్రణతి మాట్లాడలేదు. తను ఊహించింది వేరు. ఇంపాలా కారులో తిరగాలనుకుంది.

"మళ్ళీ కొందాము. అంత విచారం దేనికి?"

"విచారమా? లేదే."

"నీ వాలకంచూస్తే ఇంపాలా కోసమే నన్ను వివాహం చేసుకున్నట్లు ఉంది."

"పోదురూ." అన్నది. విద్యాసాగర్ వుంటున్న ఇల్లు చిన్నది. అయినా అందంగా అమర్చుకోవాలని ప్రణతి తాపత్రయం. పాతచీరల కర్టెన్లు వ్రేళ్ళాడుతున్నాయి.

"ఏమండీ! బజారుకు వెడదాం. మంచి కర్టెన్ గుడ్డ కొనాలి" అన్నది ఓనాడు సాయంత్రము.

"ఉన్నాయిగా."

"అవి పాత చీరలండీ బాబూ! మీ అమ్మగారి ఓపికకు మెచ్చుకోవాలి" అన్నది నవ్వుతూ.

"అద్దె ఇంటికి ఈ అలంకారాలన్నీ యెందుకు?"

అదీ నిజమేననిపించింది. మరేం మాట్లాడలేదు. నెల రోజులలో కొన్ని విషయాలు బాగా అర్థం అయ్యాయి. డబ్బు దగ్గర అతను చాలా కచ్చితమైన మనిషి. అవసరంగా కూడా ఖర్చు పెట్టడు. వంటవాడిని తీసేశాడు.

"ప్రణూ! వీడిని తీసింది నీ మేలుకోరే" అన్నాడు.

"నా మేలా?"

"కాదా, మరి? నీ బాడీషేప్ యెప్పటిలాగే వుండాలంటే ఎంతో ఎక్సర్‌సైజ్ చేయాలి."

"ఏబుర్లు" అన్నది బుంగబూతి పెడుతూ.

"అన్నీ ప్రణాళిక ప్రకారం చేయాలోయ్. నీకు డయటింగ్ ప్రాబ్లమ్ వుండదు. దుబారాఖర్చు వుండదు."

"అమెరికా వెళ్ళి ఇదే నేర్చుకువచ్చారా?

"ఇంకా చాలా." ఆమె వెనుకాల వచ్చి మెడమీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. అతను కార్యవాది. నాలుగు మాటలు పడ్డా సరే పనులు అయితే చాలు అనుకుంటాడు. ప్రతి పనినీ పర్యవేక్షిస్తాడు.



"ప్రణూ!"

"ఏమండీ?"

"పనిమనిషికి టీ ఇచ్చావా?"

"అవునండీ. నిన్న వర్షంలో తడిసిందట."

"ఇలాంటి అలవాట్లు ఒకసారి చేస్తే చాలా విచారించాల్సి వస్తుంది తరువాత."

జీవితంలో మొదటిసారి ఇలాంటి విషయం విన్నది. అందుకే గుడ్లు వెళ్ళబెట్టి చూచింది.

"వెళ్ళు, నేను త్వరగా వెళ్ళాలి వంటపని చూడు."

ప్రణతి వంట కాదుకదా, వడ్డనకూడా ఏనాడూ చేయలేదు. మొదటిసారిగా తల్లిని తిట్టుకుంది. ఫలహారం అయింది, వెళ్ళిపోయాడు సాగర్. అతనికి ఆలూబిర్యానీ అంటే చాలా ఇష్టము. అది చేయాలని ముందు పెట్టుకుంది. అన్నీ ఉజ్జాయింపుగా కొలవడం యెలా? వెంటనే దగ్గరలోవున్న కొట్టుకువెళ్ళి కిచెన్ స్కేల్ కొన్నది. బిర్యాని మొదలుపెట్టింది. ఏ పనితో మొదలుపెడితే పని తెములుతుందో తెలియటం లేదు. పన్నెండుదాటినా పని పూర్తి కాలేదు. సాగర్ వచ్చాడు. అతనికి వంటిల్లు చూడగానే మతిపోయింది.

"ప్రణూ!"

"వచ్చారా! మరో పదినిమిషాల్లో అయిపోతుంది."

"అది సరే. ఏమిటీ దుబారా?"

"నేను దుబారా యేం చెయ్యలేదు. ఇద్దరికి సరిపడా వండాను"

"వంట కాదు. మీ ఇంట్లో ఏం నేర్పలేదా! బంగాళా దుంపలు పొట్టు తీయడం ఇలాగేనా? సగం నేల పాలు చేశావు. కిలో రెండురూపాయలు."

"నాకు అంతగా రాదండీ" అతను చిర బుర లాడుతూ వెళ్ళిపోయాడు. చిరబురలాడకుండా సన్నగా నచ్చ చెబుతూ ఆమె శ్రమను మెచ్చుకుంటే బావుండును అనుకుంది.

మర్నాడు బల్లపై మాంసాహారం చూచి తెల్లబోయాడు. "ఇదంతా ఏమిటి?"

"మీ కిష్టం లేదా. మీరు బయట ఉండి వచ్చారు కదా అని చేశాను. అన్నయ్యకు ప్రతిరోజూ మాంసాహారమే కావాలి."

"నాకు అదంటే ఇష్టం లేదు, బలం పేరుతో పైసా నష్టం తప్పితే. దున్నపోతులు, ఎద్దులు ఇంత కష్టం చేస్తాయి. అవేం తింటాయి? మనలో మనమాట 'గడ్డి' అవునా?"

"కొంపదీసి నన్ను గడ్డి తినమనరు కదా?"

"నో. చెబుతుందేమిటంటే ఆకుకూరలలో ఉన్న బలం దేంట్లోనూ ఉండదోయ్."

ఆ రోజునుండి ఆకు కూరలు మొదలుపెట్టింది. మధ్యాహ్నము పప్పుతో వండాలి. సాయంత్రం వేపుడు. అవి కూడా ఇష్టం వచ్చినవి కావు. బజార్లో ఏ వస్తువు చవకగా ఉంటే అదే కొనాలి."

"మీ అమ్మగారికి నిన్ను చూడాలని ఉందట." సాయంత్రం టీ తీసుకునేటప్పుడు చెప్పాడు సాగర్.

"వెళ్దామా?"

"మీ అక్క వెళ్ళేవరకు ఆ ఇంటికి రావాలని లేదు. అయినా నిన్ను బాధపెట్టడం ఇష్టం లేదు." ఇద్దరూ వెళ్ళారు. వారు వెళ్ళేసరికి ప్రశాంతి లేదు. స్నేహితులతో సినిమాకు వెళ్ళిందట. సాగర్ ముఖంపై ఒక నిరాశా వీచిక నాట్యం ఆడి మాయం అయింది. తనింట్లో ఇష్టం లేనివన్నీ అత్తగారింట్లో చక్కగా తిన్నాడు సాగర్.

"అన్నయ్యా! నాకు ఇలాంటి కర్టెన్ గుడ్డ కావాలి." అన్నది వేణుతో. అతను రెండురోజులలో పంపుతానన్నాడు. సాగర్ ప్రణతికి పని రాదంటూ, యెన్నో విషయాలు హాస్యంగా చెప్పినట్టు చెప్పి తృప్తిపడ్డాడు. భర్తను అర్థం చేసుకోలేక సతమతమవుతోంది ప్రణతి.

ఓ రోజు సాగర్ అని పిలిస్తే అతను మృదువుగా మందలించాడు. "ఈ అలవాటు మా పెద్దలముందు కూడా ప్రదర్శిస్తే ఇంకేముంది?" అన్నాడు.



ఇతను సనాతనుడా, అధునాతనుడా అంతుపట్ట లేదు. భయపడుతూనే అన్న పంపిన కర్టెన్ గుడ్డతో కర్టెను కుట్టింది. అతను ఏం అనకపోగా, బావున్నాయని మెచ్చుకున్నాడు.

డబ్బు అతనిది కాకపోతే అన్నీ బావుంటాయి అనుకుంది కసిగా. ఏదో అసంతృప్తి మెల్ల మెల్లగా ఆమె మానసాన్ని ఆవరించుకోసాగింది.

## 9

నెల గడిచిపోయినా ఇంట్లో తల్లీ కూతుళ్ళమధ్య రాజీ కుదరలేదు. యాంత్రికంగా యూనివర్సిటీకి వెడుతోంది, వస్తోంది. ఇదివరకు మహారాణిలా ఠీవిగా తిరిగేది. ఇప్పుడు పరధ్యానం, నిర్లక్ష్యం యెక్కువయ్యాయి. ఆమెను గూర్చిన వింత పుకార్లు యూనివర్సిటీలో కూడా వ్యాపించాయి. అది సాగర్ పుణ్యమేనని తెలిసింది.

"ఏం పోజులురా తండ్రీ! వెనుకాల ఇంత గ్రంథముందా?"

"ఈవిడగారే ప్రేమంటే ఎలర్జీ అందటరా ఒకసారి."

"ప్రేమంటే ఎలర్జీ. కాని జీవితాలతో ఆడుకోవటం సరదా. నాలుగు రోజుల మోజు తీర్చుకుని ఆ తరువాత..." వినలేకపోయింది. ఏమిటది? విద్యాసాగర్‌కు ఎందుకు తనంటే అంత కక్ష! అతను అనుచితంగా ప్రవర్తిస్తే ఒక దెబ్బ వేసింది. ప్రతీకారం ఇలా తీర్చుకుంటున్నాడా?

ఓ రోజు తండ్రికి పని ఉండి కారు తీసుకు వెడతానన్నాడు. బస్సులో వెళ్ళాలనుకుంది ప్రశాంతి. బస్సు వచ్చేవరకు అక్కడే నిలబడితే హృదయం తూట్లు పడేలా ఉన్నాయి.

"ఏం చేయాలి?"

"గుడ్ ఈవినింగ్ మిస్ ప్రశాంతీ!"

వెనుక్కు తిరిగి చూసింది. మన్మోహన్ స్కూటర్‌కు స్టాండ్ వేస్తున్నాడు.

"మీరా?" అంది క్రమంగా ఆమె ముఖంలోని అప్రసన్నత మాయం అయింది. కళ్ళల్లోకి కాంతి వచ్చింది.

"బస్సుకోసం చూస్తున్నారా? ఆఖరు బస్సు కూడా వెళ్ళిపోయింది."

"ఎప్పుడు?"

"ఇందాకే, మీరు ఏదో ఆలోచిస్తున్నారులా ఉంది."

'మైగాడ్!' అంది అప్రయత్నంగా. రెండు బస్సులు మారి ఇల్లు చేరాలి."

"మీకు అభ్యంతరం లేకపోతే నేను డ్రాప్ చేస్తాను రండి."

"..."

"మీకంతగా ఇష్టం లేకపోతే వద్దు." అతను రెండడుగులు ముందుకు వేశాడు.

"అది కాదండీ..."

"ఫ్రీగా రావటం ఇష్టం లేదా? పోనీ ఆటోకిచ్చే లెక్కన ఛార్జీలు కట్టి ఇవ్వండి" యెప్పటిలా మండిపడలేదు. చిన్నగా నవ్వింది.

"మీరు ఆలస్యం చేస్తున్నారు. చుట్టూ చూసేవారికి మనం కథావస్తువు కారాదు."

మరేం మాట్లాడక ఆమె అతని వెనకాల యెక్కింది. స్కూటర్ స్టార్ట్ అయింది. కొందరు కళ్ళు వెళ్ళబెట్టి చూశారు. మన్మోహన్ యెవరో పూర్తిగా తెలియదు వారికి. వెంటనే బస్సు రావటంతో చీలిపోయారు.

ప్రశాంతికి మనసు యెటో ఉంది. మొగవారంతా ఇంతేనా. స్త్రీని ఆటబొమ్మను చేసి ఆడుకుంటూ, ఆమె లొంగి రాకపోతే నీలాపనిందలు వేస్తారు. మన్మోహన్ అంతే. ఏ టాంక్‌బండ్‌కో, నౌబత్ పహాడ్‌కో తీసుకువెళ్ళి తన ప్రేమను వెళ్ళడిస్తాడు. అది ప్రేమ కాదు కామం. కాదంటే ఇక ప్రచారం మొదలుపెడతాడు. ఈరోజు తన స్కూటర్ ఎక్కాల్సింది కాదు. అతనికి ప్రత్యక్ష సాక్ష్యం కల్పించింది.

"దిగండి" ఉలికిపడింది. టాంక్‌బండ్ కాదు, నౌబత్ పహాడ్ కాదు అతను స్కూటరు తెచ్చి 'ప్రశాంతి నిలయము' ముందు ఆపాడు.

"వచ్చేశామా?" దిగింది. అతన్ని ఇంట్లోకి పిలవటమా, మానటమా ఆలోచనలో పడింది.



"నా షేర్ ఇప్పించండి మేడమ్!" అతని వంక చూచింది. కొంటెగా పెదవులు బిగబట్టి ఉంచాడు. ఈ రోజు అతనితో పోట్లాటకు సిద్ధంగా లేదు. తను చిన్నగా నవ్వింది.

"ఖాతా రాసుకోండి. వీలుగా ఈజీ ఇన్‌స్టాల్‌మెంట్లలో తీరుస్తాను."

"బాప్‌రే. ఆ రోజు మీ వాలకం చూచి డబ్బంటే నిర్లక్ష్యం అనుకున్నాను. మీ ప్రాణానికి డబ్బుకు లంకె అన్నమాట." అతను నవ్వాడు.

"మీకు మా ధనవంతుల విషయాలన్నీ తెలుసునే..." అన్నది చిత్రంగా కళ్ళు తిప్పుతూ. "పోనివ్వండి, ఇంట్లోకి వచ్చి ఒక కప్పు కాఫీ త్రాగి వెళుదురు గాని."

"కాఫీయా! అసలే నాది అరువు బేరం అయింది. రేపిచ్చే ఇన్‌స్టాల్‌మెంటులో కాఫీ ఖర్చని ఓటి కట్ చేస్తే! నా బాకీ తీర్చాకే కాఫీకి వస్తాను. బై..." అతని స్కూటర్ వెళ్ళిపోయింది. నెమ్మదిగా ఇంట్లోకి వెళ్ళింది. అంత వరకున్న సంతోషం నెమ్మదిగా కరిగి నీరవ్వసాగింది. హాల్లో అడుగుపెట్టి అలాగే నిలబడిపోయింది. విద్యాసాగర్ దంపతులు, వేణు దంపతులు పేక ఆడుతున్నారు. ఒక్కసారి వారివంకచూచి వెళ్ళిపోయింది. బట్టలు మార్చుకుని చల్లటినీటితో ముఖం కడుక్కుంది. తేటగా అన్పించింది. క్రిందికి వెళ్ళాలని లేదు. అలాగే ఈజీచైర్లో కూర్చుని ఫ్రాయిడ్ వ్రాసిన సైకాలజీ గ్రంథం తీసి చదవసాగింది. కాలం తెలియలేదు.

"శాంతీ!"

"ఏం వదినా?" తలెత్తి చూచింది.

"భోజనానికి రమ్మంటున్నారు."

"నాకు ఆకలిగా లేదు వదినా! తలనొప్పి. ఒక గంట తరువాత ఒక కప్పు వేడిపాలు పంపించు."

"సరే." ఆమె వెళ్ళిపోయింది. శాంతికి కన్నీరు ఆగలేదు. ఇదివరలో అయితే తల్లీ, తండ్రి ఆకాశం భూమి ఒకటి చేసేవారు. ఇప్పుడు! ఒక్కరోజు భోజనం మానితే! అవును వారికి ప్రాణం కన్నా, సంతానం కన్నా పరువు మర్యాదలు ముఖ్యము. ఒక గంట గడిచాక తుఫానులా వచ్చింది కాంతమ్మ.

"శాంతీ?"

"ఏమిటమ్మా?"

"ఈ ఇంటి పరువు మంట కలపాలని యెందుకే అంత తాపత్రయం?" తీవ్రంగా అడిగింది. ఉలిక్కిపడింది ప్రశాంతి. తను మన్మోహన్ స్కూటర్ పై రావటం వీళ్ళు చూశారా ఏమిటి? అయినా తన భావాలు బయట పెట్టకుండా నెమ్మదిగా అడిగింది.

"నేనేం చేశానమ్మా?"

"భోజనం ఎందుకు వద్దు?"

"నాకు తలనొప్పిగా ఉంది."

"తలనొప్పి ఉన్నవాళ్ళెవరూ పుస్తకాలు చదవరు. నీ దృష్టిలో పురుషులందరూ దద్దమ్మలు కావచ్చు. కాని విద్యాసాగర్ ఈ ఇంటి అల్లుడు. అతన్ని గౌరవించాల్సిన బాధ్యత అందరి మీద ఉంది."

"ఆయనను నేను అగౌరపరిచిందెప్పుడు?"

"నోరు ముయ్యి. అమ్మ ప్రేమనే చూశావ్ ఇంత వరకూ, ఇక నుండి కోపం చూస్తావు. వాళ్ళు వచ్చినప్పుడు తప్పించుకు తిరుగు. ప్రాణం తీస్తాను. అమ్మంటే ఏమనుకున్నావో." ఆవిడ వచ్చినంత వేగంగా వెళ్ళిపోయింది. చాలా సేపటికి పాలు తెచ్చింది సునంద.

"వదినా!"

"ఏమిటి శాంతీ?"

"నేను యెవరినీ ఏం అడగను. ఒక్క విషయం చెప్పు. నేను బల్లదగ్గర లేనని విద్యాసాగర్ ఏదయినా అన్నారా?"

"ఆయన విచిత్రమైన మనిషి శాంతీ! అవన్నీ పట్టించుకోవద్దు."

"అలా దాటవేయకు. ఏం జరిగిందో చెప్పు."

"ప్రణతీ, ఆయనా ముఖాలు మాడ్చుకున్నారు. వారిక్కడికి రావటం నీ కిష్టం లేదన్నట్టు నిష్ఠూరాలు వేశాడు. అత్తయ్య అతని మాటలకంత ప్రాముఖ్యం యెందుకిస్తారో అర్థంకాదు" అన్నది సునంద.



"వదినా!..." ఇంకేదో చెప్పబోయింది ప్రశాంతి. వేణు పిలిచాడు భార్యను. వదిన వెళ్ళిపోగానే భోరున ఏడవాలనిపించింది. ఏనాడూ తను ఏడ్చే అవసరం రాలేదు. ఆడవారు యెందుకు ఏడుస్తారు అనుకునేది.

విద్యాసాగర్‌తో ఓ చిక్కు వచ్చిపడింది. ప్రతి సాయంత్రము టాంక్ బండ్‌కు షికారుకు వస్తాడు. అలాగే అత్తగారింటికీ వస్తాడు. పేకాట ఆడుదాం అని స్నేహితులిద్దరూ కూర్చుంటారు. తరువాత భోజనాలు. తల్లి ఆజ్ఞ మేరకు అక్కడుంటే ఏదో అంటాడు సాగర్. అందరూ హాస్యం క్రింద జమ కడతారు. ప్రశాంతికి ముళ్ళమీద ఉన్నట్టు ఉంటుంది.

ఆరోజు అందరూ భోజనానికి కూర్చున్నారు. కాంతమ్మ దగ్గరే నిలబడి వడ్డిస్తోంది.

"ఏం వేణు, మీ పెద్దచెల్లాయి డయటింగ్ చేస్తోందా!"

"దానికి డయటింగ్ యెందుకు? ఓవర్ వెయిట్ లేదే."

"అన్నం కెలుకుతుంటేను. వివాహం అయ్యే వరకు నాజూకుగా ఉండాల్సిందే." అతను ప్రశాంతి వంక చూచి నవ్వాడు. ఆమె తలయెత్త లేదు, నోరు విప్పలేదు. అనవసరంగా వాగటం యెందుకని. అతను తన భార్య ముందే మరో స్త్రీని నిశితంగా గమనించటం చూస్తే ఒళ్ళు మండిపోయింది.

"మాట్లాడరేం వదినగారూ?"

"ఏం మాట్లాడాలో చెప్పండి మరిదిగారూ?"

"మేమున్నామనా భోజనం సరిగ్గా చేయటం లేదు?"

"అలా ఎందుకు అన్వయించుకుంటారు. నాలాంటి క్యారెక్టర్ లేని మనుషులు, యూనివర్సిటీలో ఎవరితోనైనా తిరగవచ్చు. కడుపు రావచ్చు. తిండి మానేయవచ్చు."

"శాంతీ!"

"ఎందుకు నాన్నగారు కోపగిస్తారు? అతని ఉద్దేశం అదేగా!"

"గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకోవడం దీన్నే అంటారు." అన్నాడు నవ్వుతూ.

"ఏమిటే నోటికెంతవస్తే అంతేనా?"

"అమ్మా! నా తిండి విషయాలు ఈ ఇంటికి అల్లుడయినవారు తెలుసుకోవటం అవసరమా?"

"నోరు ముయ్యి. పరిహాసం తెలిగని మూర్ఖురాలివి."

"నాకిలాంటి హాస్యాలు, పరిహాసాలు గిట్టవు."లేచి చెయ్యి కడుక్కుంది.

"పరిహాసం గిట్టదా, మేం అంటేనే గిట్టదా?"

"రెండూ, సరేనా?" త్వరగా వెళ్ళిపోయింది. విద్యాసాగర్ గొడవ చేస్తాడనుకున్నారు. అతనేం అనలేదు. రాత్రికి కాంతమ్మ, రఘుపతికి ఏదో వెలితిగా అనిపించింది.

"పెద్దతల్లి పెళ్ళి చేసేయాలండీ."

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. దానికి నచ్చినవాడు దొరకవద్దూ! యెవరూ ఒక పట్టాన నచ్చరు."

"అలా అనే నెత్తిన యెక్కించుకున్నాం. తాడో, పేడో తేల్చమనండి తన యిష్టమొచ్చిన వాడినయినా చేసుకోమనండి. లేదా మనిష్టము వచ్చినవాడి అంగీకరిస్తుందా అడగండి."

"నువ్వే అడుగు కాంతం."

"నాకు దాని మొండితనం చూస్తే ఒళ్ళు మండిపోతోంది. సాగ చెప్పిన విషయాలు గుర్తుకు వస్తాయి. దాన్ని తన్నాలనిపిస్తుంది."

"మన అమ్మాయి అలా దిగజారే మనిషి అంటే నమ్మబుద్ధి కావట లేదు. అతను అబద్ధం చెపుతాడా అంటే అదీ అంగీకరించలేను."

"గతం నాస్తి. ఇక జరగబోయేది ఆలోచించాలి. ఈ విషయా బయటపడకముందే ఆ మూడుముళ్ళూ పడితే మంచిది."

"అలాగే."

"ఇప్పుడే తేల్చండి."

"తొందరేం? కొంచెం ఆలోచించనీయి."

ఆ రాత్రి రెండు మూడుసార్లు భార్య గుర్తుచేయగా కూతురి గది వచ్చి అడగలేక వెళ్ళిపోయాడు. ఏదో పోగొట్టుకున్నట్టుండే కూతురి క చూస్తే జాలేసింది.



# 10

"హల్లో!" తనంతట తాను మొదటిసారిగా పలకరించింది మన్మోహన్‌ని. లైబ్రరీలో ఏదో పుస్తకం చూస్తున్నాడు.

"హల్లో! మీరా మిస్ ప్రశాంతీ!" నవ్వుతూ ఇటు తిరిగాడు.

"అవును. వారంరోజులుగా ప్రతిరోజూ లైబ్రరీచుట్టూ తిరుగుతున్నాను ఓ పుస్తకం కోసం. అది కనిపించటం లేదు. నాకంటే ముందే యెవరో తీసుకుపోతున్నారు. బజార్లోనూ లేదుట" అన్నది.

"ఏం పుస్తకం?"

పేరు చెప్పింది. అతను క్షణం ఆలోచించాడు. జ్ఞాపకం వచ్చినట్టు తలాడించాడు.

"నా దగ్గర ఉంది. సాయంత్రం ఇంటికి వెళ్ళేటప్పుడు వచ్చి తీసుకోండి."

"థాంక్స్."

"మీరు ధన్యవాదాలన్నా, మరేం అన్నా రోజుకి పావలా అద్దె కావాలి మేడమ్."

"ఓ యస్. అలాగే. కాతా రాసుకోండి సర్!" నవ్వుతూ వెళ్ళిపోయింది. అతను యూనివర్సిటీలో రెండు మూడు సార్లు కనిపించి పలకరించాడు. అతను చాలా బాగా చెబుతాడట పాఠం, జూనియర్స్ చెప్పారు. తమకు చెబితే బాగుండును అనుకుంది.

సాయంత్రం కార్లో కూర్చున్నాక పుస్తకం సంగతి గుర్తుకు వచ్చింది.

"డ్రైవర్! విద్యానగర్ పోనియ్యి." ఇంటి నంబరు చెప్పింది. అతను చిన్న వరండాలో కూర్చున్నాడు. ఇద్దరమ్మాయిలు కూడా ఉన్నారు. ఒకమ్మాయి బి.ఏ. ఫైనలియర్ సరోజ, రెండో అమ్మాయి ఎం. ఏ. ప్రీవియస్‌లో ఉన్న ఉమ.

"రండి మిస్ ప్రశాంతీ! ఒక నిమిషం." అంటూ లేచాడు మన్మోహన్.

"వాళ్ళను పంపేసి నా కిద్దురుగాని లేకపోతే తిట్టుకుంటారు" అని వారి వంక చూచి నవ్వింది.

"మరెక్కడయినా నీలాంటి లక్ష్మీ పుత్రికలదే కదోయ్ ఫస్ట్ ప్రెఫరన్స్" అన్నది ఉమ.

"అందుకే వెయిట్ చేస్తానన్నాను" వారు మళ్ళీ తమ చర్చలో మునిగిపోయారు. పది నిమిషాల తరువాత కొన్ని పుస్తకాల పేర్లు చెప్పి వారిని పంపించివేశాడు.

"మీ అమ్మగారు లేరా?"

"అరుణకు అనారోగ్యం. వెళ్ళారు. ఈ రోజో, రేపో రావచ్చు." అన్నాడు అతను. వెళ్ళి పుస్తకం తెచ్చి ఇచ్చాడు. ఇక మాట్లాడటానికేం లేదన్నట్టు కూర్చున్నాడు.

"వెళ్లొస్తానండీ. చాలా థాంక్స్." అన్నది లేస్తూ.

"పుస్తకం సక్రమంగా తిరిగివస్తే నేనే మీకు ధన్యవాదాలు అర్పిస్తాను"

"అదేం?"

"సాధారణంగా పుస్తకాలు తీసుకు వెళ్ళినవారు తిరిగి ఇవ్వరు. పోయిందనో, యెక్కడో పెట్టి మరిచిపోయామనో అంటారు. సాధారణంగా నేను యెవ్వరికీ ఇవ్వను."

"నేను పుస్తకం రోజుకు పావలా ఇస్తాననే నమ్ముతున్నారా?"

"పావలా సంగతేమోగాని పుస్తకం ఇస్తారన్న నమ్మకం ఉంది."

"ఒకవేళ ఇవ్వకపోతే?"

"... పోతే?" ముక్కుపట్టుకుని ఆలోచనలో పడ్డాడు అతనికి ఏం తోచనప్పుడు ముక్కును పదును చేస్తున్నట్టు రుద్దుకుంటాడు.

"మరేం భయంలేదులెండి. యెంత పొగరుమోతునైనా పుస్తకాలపట్ల నాకు అమితమైన ఆసక్తే" అన్నది.

"మిమ్మల్నో మాట అడగనా?"

"అడగండి."

"నెలరోజుల క్రితం చూచిన ప్రశాంతి మీరేనా అన్పిస్తుంది. మీలో చాలా మార్పు వచ్చింది."

"లావయ్యానా?" కొంటెగా అడిగింది.



"కాదు. అసహనము తగ్గింది. చూపులు... చూపులు."

"చెప్పండి. మిమ్మల్ని కొట్టనని హామీ ఇస్తున్నాను."

"మీరు చెయ్యెత్తినా తప్పించుకోలేని వాజమ్మను కాదు."

అతను నవ్వాడు. "మీరు యేదో పోగొట్టుకున్నట్టు చూస్తారు. మునుపటి ఉత్సాహం - కొంటెతనం ఏం లేవు."

"మీదాక రాలేదా? చిత్రంగా వుందే."

"అసలు సంగతేమిటి?"

"మీకే అర్థం అవుతుంది కొన్నాళ్ళు ఆగండి." ఇంకేం లేదన్నట్టు వెళ్ళి కార్లో కూర్చుంది. కారు స్టార్టు అయ్యాక కళ్ళు తుడుచుకుంది.

* * *

ఆరోజు విద్యాసాగర్ దంపతులు రాలేదు. అందుకే ప్రశాంతంగా వుంది ఇల్లు. టేబుల్ లైట్ వేసుకుని చదువుకోవాలని ఇంట్లో కూర్చుంది.

"శాంతీ!" తల్లి గొంతు తీక్షణంగా వినిపించింది. 'ఈరోజు మళ్లీ యేం జరిగింది? తను ఎవరినీ యేం అనలేదే!'

"ఏమిటమ్మా?"

"మమ్మల్ని చంపదలుచుకుంటే కొంచెం విషం ఇవ్వరాదూ?"

"నేనేం చేశాను?"

"సాగర్ మాటలు ఇంతవరకు పూర్తిగా నమ్మలేదు. స్త్రీ పురుషుల సన్నిహితాన్ని అందరూ ఒకేరకంగా అర్థం చేసుకోలేరు. అందుకే అతని మాటలు అంతగా పట్టించుకోలేదు. ఈ రోజు నువ్వు యెక్కడికి వెళ్ళావు?"

"నేనా? ఎక్కడికీ వెళ్ళలేదు." అంతే మరోసారి చెంప ఛెళ్ళుమంది. "పాపిస్టిదానా, అబద్ధాలుకూడా నేర్చావ్. డ్రైవర్ను పిలవనా?"

"అమ్మా!"

"అమ్మకాదు, ఆదిశక్తి. అమ్మగా అనురాగమే చవి చూచావు. యిక... యిక..." ఆవిడ మాట్లాడలేకపోయింది.

ప్రశాంతికి అర్థం అయింది. తను మన్మోహన్ యింటికి పుస్తకం దే తెచ్చుకోవడానికి వెళ్ళిన సంగతి డ్రైవరు చెప్పాడన్నమాట. ఇక నుంచి

తన ప్రతి కదలిక డ్రైవరు గమనిస్తాడు కాబోలు. ఏడ్పు రాలేదు. నవ్వు వచ్చింది.

"అమ్మా? విద్యాసాగర్ మాటలు మీకు శిలాక్షరాలే అయితే దాని నా జవాబు యేం లేదు. ఈరోజు నేను వెళ్ళింది ఒక రీడర్ యింటికి. ఎక్కడ దొరకని పుస్తకం అతనింట్లో దొరుకుతుందని తెలిసి వెళ్ళాను. నేను చెడిపోయి దాన్నయినా, అతనికి చాలా మంచి పేరుంది. వెళ్ళి విచారించు. వదిన చుట్టమే అతను."

కాంతమ్మ హృదయము ద్రవించలేదు. కూతురు ఏడ్చి మొత్తుకుంటే ఆమె కరగిపోయేది.

"విచారించాలో, మానాలో నాకు తెలుసు. ఇకనుండి నీ కాలేజీ చదువు కట్టిపెట్టు."

"అది అసంభవమని చెబుతున్నాను. ఇకనుండి మీరు డ్రైవర్ల ద్వారా పనివారిద్వారా నా విషయాలు రాబట్టడం అనవసరం."

"గారాబం చేసినందుకు గడ్డి బాగా పెడుతున్నావ్."

"గారాబం చేశారు... కాదని నేను అనలేదు. ఎవరో ఏదో చెప్పారని నన్ను అనటం మంచిదికాదని మరోసారి మనవి చేస్తున్నాను."

"నువ్వు యూనివర్సిటీలో ఎవడినో ప్రేమించి, వాడితో విచ్చలవిడిగా తిరుగలేదూ?"

"లేదు."

"అతన్నీ నిన్నూ చాలాసార్లు ఒకచోట చూసిన విద్యాసాగర్ మందలిస్తే అతన్ని బ్రతిమాలలేదూ?"

"లేదు... లేదు... లేదు. ఒక్కసారి కాదు వందసార్లు చెబుతున్నాను. విద్యాసాగర్‌ను మొదటిసారి చూసింది మనింట్లో అన్నయ్య స్నేహితుడుగా."

"ఎంతకు తెగించావే." ఆమె విసురుగా వెళ్ళి పోయింది. అర్ధరాత్రి వరకు దొర్లి నిద్రబోయింది. మర్నాడు లేచి తయారయింది. క్రిందికి రాగా ఎంతగోల జరుగుతుందో అనుకుంది. అలాంటిదేం జరగలేదు. ఎవరి పనులలో వారున్నారు. రాత్రి జరిగింది కల కాదు కదా, అనుకుంది ఓసారి



బల్ల మీదనున్న బరిణలోని ఒక ఇడ్లీ తీసుకు తిని, ఫ్లాస్కులోని కాఫీ త్రాగి యూనివర్సిటీకి వెళ్ళిపోయింది.

ప్రొఫెసర్ రాలేదు. క్లాసులో ఎందుకని నెమ్మదిగా లైబ్రరీలో వచ్చి కూర్చుంది. పుస్తకం ముందున్నా మనసు ఎటో వుంది.

"హల్లో మిస్ ప్రశాంతీ!"

తిరిగి చూసింది. మనోమోహన్. అలవాటుకు విరుద్ధంగా ఈరోజు ప్యాంటు, షర్టు వేశాడు.

"నమస్తే, ఏమిటీ విశేషం?"

"ఏంలేదు. పుస్తకాల వివరాలు అడగాలంటే అంత మొహమాటమా?"

"నాకా? ఏం పుస్తకాలు, ఏం వివరాలు?"

"చచ్చాం పొండి. రాత్రి మీ అన్నా, సునంద మా యింటికొచ్చారు. మార్కెట్టులో దొరకని పుస్తకాలు ఎక్కడ దొరుకుతాయని..."

ప్రశాంతి ముఖం వివర్ణమయింది. తను చెప్పింది నిజమో కాదో కనుక్కోవాలని వెళ్ళారన్నమాట.

"ఏమిటలా అయిపోయారు?"

"ఏం లేదు..." బలవంతంగా నవ్వు ముఖానికి పులుముకుంది.

"మాటవరసకంటే వారు నిజంగా వచ్చారా? పోనివ్వండి. మీ రేమిటీ రోజు..." అతని బట్టలవంక చూస్తూ అంది.

"ఓ అదా! స్టూడెంట్స్ స్పోర్ట్స్‌లో పాల్గొంటానని పేరిచ్చాను. కంఫర్టబుల్‌గా ఉంటుందని." తన ప్యాంటు వంక చూచుకున్నాడు. అందంగా, ఆరోగ్యంగా ఉన్న వారి కే బట్టలయినా బాగానే ఉంటాయి కాబోలు అనుకుంది.

"సారీ... మీ చదువు చెడగొట్టినట్టున్నాను, వస్తాను." అతను వెళ్ళిన దిక్కే చూస్తుండిపోయింది.

క్లాసులు తొందరగా అయిపోయాయి. కారు రావటానికి ఇంకా రెండుగంటల టైముంది. బస్సులు వెంటనే దొరికినా, ఇల్లు చేరేవరకు అదే

సమయం అవుతుంది. బి.ఇడి.లో తన ఫ్రెండ్ ఉంది. చూద్దామని అటు వెడుతుంటే పోస్టాఫీసు దగ్గర మన్మోహన్ కన్పించాడు.

"నమస్తే."

"నమస్తే, మీరు పనిమీద వెడుతున్నారా?"

"లేదు. అమ్మకు ఉత్తరం రాసి పోస్టు చేశాను, త్వరగా రమ్మని. నాకు బొత్తిగా వంట రాదు. పనికుర్రాడికి ఆరోగ్యం బావుండలేదు" అన్నాడు.

"అలా అయితే వెంటనే ఓ వంట వచ్చిన అమ్మాయిని చూసి వివాహం చేసుకోండి" అన్నది.

"చాలా థాంక్స్! మీ దృష్టిలో యెవరయినా వంటలక్కలున్నారేమిటి?" అన్నాడు అతను.

"ఒకరేమిటి మీరు 'ఊ' అనండి క్యూలో నిల్చుంటారు."

"ఓ తండ్రోయ్! ఒక్కరిని భరించటమే కష్టంగా వున్న ఈ కాలంలో..." భయం నటించాడు.

"నేను నిజంగా అడుగుతున్నానండీ. మీ అమ్మ కీ వయసులో శ్రమ ఇస్తున్నారు."

"అది నిజమే మిస్ ప్రశాంతీ... నా కాళ్ళు పీకుతున్నాయి. అలవాటు తప్పింది. నిన్న ఒకటే ఆట..." దగ్గరలో చిన్న బండరాయి మీద కూర్చున్నాడు. "మీకు అభ్యంతరం లేకపోతే ఇటు కూర్చోండి" దూరంగా ఉన్న రాయి చూపాడు. దానిపై కూర్చుంటూ నెమ్మదిగా అన్నది.

"ఒట్టి ప్రశాంతి అంటే చాలు. మిస్‌ను మిస్ చెయ్యండి."

"థాంక్స్!"

"నా ప్రశ్నకు జవాబు చెప్పనే లేదు."

"ఏం అడిగారు?"

"మీరు వివాహం ఎందుకు చేసుకోరు?"

"... ..."

"మీకు నచ్చిన స్త్రీ దొరకలేదా?"

"అలాగే అనుకోండి."



"యోగ్యతలూ, అర్హతలు చెప్పండి. ఎక్కడయినా అలాంటి అమ్మాయి తటస్థపడితే నేను మీ దగ్గరకు పంపుతాను."

"ఏం చదువు వదిలి పెళ్ళిళ్ళ పేరమ్మ పని చేస్తారా?"

"గిట్టుబాటయితే."

"నిజంగా మీరు చాలా మారారు."

"జీవితం నేర్పిన పాఠాలు ఏ విశ్వవిద్యాలయమూ నేర్పదు" అన్నది నిట్టూరుస్తూ.

"మీరు దేనికోసమో బాధపడుతున్నారు. ఓ స్నేహితుడిగా, మీ బాధ అడగొచ్చునా?"

"నయం, మీ శత్రువుగా అని అడగలేదు. పోని స్నేహితురాలిగా అంగీకరించారు. మీ ఊహాసుందరిని గూర్చి చెప్పండి."

"జరగని విషయాలను గూర్చి చర్చించడం అనవసరమంటాను."

"నేను తెలుసుకుంటే తప్పేం?"

"ఏం లేదు. జీవితంలో తొంబయి మంది స్త్రీలు భర్త హోదాకే ప్రాముఖ్యం ఇస్తారు ప్రశాంతిగారూ! నా ఊహాలో స్త్రీ అంటే... నవ్వొద్దు మరి. స్త్రీ అంటే భర్త వ్యక్తిత్వానికి ప్రాముఖ్యం ఇవ్వాలి. వివాహం తరువాత ఇల్లూ, పిల్లలు తన ప్రపంచము అనుకోవాలి. క్లబ్బులూ, వనితామండలులు, ఉపన్యాసాలంటే పరమ చికాకు..."

"స్త్రీ పూర్తిగా బానిసగా మీ క్రింద బ్రతకాలన్నమాట."

"బానిసగా కాదు. ఆ యింటి యజమానురాలిగా, సంసారానికి సారధిలా, దాన్ని మీరు బానిసత్వమంటే నేను ఏం జవాబు చెప్పలేను. భర్తను, పిల్లలను, ఇల్లును నిర్లక్ష్యం చేయటమే స్వాతంత్రమా? దినమంతా మొగాడు చెమటోడ్చేది యెందుకు?"

"ఉమకు మీరంటే చాలా ఇష్టం."

"ఆ జాతి వారంటే నాకు భయం. ధనవంతుల నీడంటేనే భయం. బజార్లో అన్ని వస్తువులతోపాటు పరువూ, మర్యాద, మార్కులు, గౌరవము అన్నీ కొంటారు. నా జీతం అంతా కలిపితే ఆవిడ కాస్మటిక్స్‌కే చాలదు."

"కాస్మటిక్స్ మీకిష్టం లేదా?"

"ఉండాల్సినంతవరకు ఫరవాలేదు. అర అంగుళం మేకప్పు వేసుకునే స్త్రీలన్నా, పెదాలకు రంగు పూసుకుని తిరిగేవారన్నా చచ్చే భయం. వేలం వెర్రిగా ఒకరినొకరు అనుకరించటం కాకపోతే యెంతమంది ఈ అలంకారాలతో అందంగా కనిపిస్తారు? ఉన్న అందం కూడా పోతుంది. అఫ్‌కోర్స్, మీ లాంటి వారు ఒకటీ అరా ఏ అలంకారంలోనైనా అందంగా కన్పించేవారూ ఉన్నారనుకోండి."

"మనుష్యుల్ని ఫూల్స్‌ను చెయ్యటంలో చతురులు" ఫకాల్న నవ్వింది. వీటన్నిటికీ అతీతులుగా వుండే స్త్రీలు ఉంటారా అన్పించింది ప్రశాంతికి.

"లక్షణాలు చెప్పానుగా, ఇక వెతకండి సంబంధాలు..." అతని మాట పూర్తికాక పూర్వమే వాచీ చూసుకుని కంగారుగా లేచింది.

"మైగాడ్! కారొచ్చే వేళయింది." ఆ లేవటంలో ముందేముందో చూసుకోలేదు. చిన్నరాయి కాళ్ళకు తాకింది. బోర్లాపడేదే. వెంటనే మన్మోహన్ పట్టుకున్నాడు. నిలద్రొక్కుకోవటంలో పూర్తిగా అతనివైపు తూలిపోయింది. అతను రెండు చేతులూ ఆసరా ఇస్తున్నట్టుగా ఆమెను పెనవేసుకుపోయాడు. నెమ్మదిగా కళ్ళెత్తి చూచింది.

"చూశారా యెంత ప్రమాదం తప్పిందో. జీవితంలో ప్రతి అడుగు ఆలోచించి వేయాలి." ఆమెను మెల్లగా వదిలేశాడు.

"ప్రమాదం ఏముంది! పడేదాన్ని."

"అంతేనా, మీ అందమైన ముఖంపై యెక్కడో మచ్చ ఏర్పడేది."

"మీరు మనుష్యుల్ని బాగా ఫూల్స్‌ని చేస్తారని చెప్పానుగా." వడిగా నడచి ఆర్ట్స్ కాలేజి దగ్గరకు వచ్చింది. ఆ వెనకాలే మెల్లగా నడుస్తూ మన్మోహన్ వచ్చాడు.

"హల్లో మోహన్" రిసర్చి స్టూడెంటు ఉమ అన్న ప్రభాకర్ పిలిచాడు.

"హల్లో.... నీ పని ఈ రోజు త్వరగా తెమిలిందేంరా?"

"బోరు. ఉమ పిక్చరుకు పోదాం అంటోంది."

ఒకప్పుడు మన్మోహన్, ప్రభాకర్ క్లాస్‌మేట్స్.



"శుభం"

"అత్తయ్యలేదుగా. అక్కడే భోజనం చెయ్యొచ్చు. నువ్వూ రాకూడదూ?"

"నాకు వేరే పని ఉందిరా, మరోసారి వస్తాను."

"నీకు పనిలేందెప్పుడటా. యంత్ర పక్షీ."

"ఒరేయ్... నేనిక్కడ పంతుల్నిరా. మర్యాదగా మాట్లాడు." వారి ముందు కారు వచ్చి ఆగింది. ప్రశాంతి కార్లో కూర్చొని తల బయటికి పెట్టింది.

"మీ స్కూటర్ తేనట్టున్నారు. రండి డ్రాప్ చేస్తాను."

"థాంక్స్. నాకు వేరే పని వుంది."

"సరే. డ్రైవర్ పోనియ్యి." కారు వెళ్ళిపోయింది.

"కులుకులాడి రఘుపతి ముద్దుల కూతురు కదూ!"

"ముద్దుల కూతురో, సుద్దుల సుతనో తెలియదు. ఇక్కడి ఎం.ఏ. ఫైనలియర్ స్టూడెంట్."

"నీకు టోకరా ఇవ్వాలని చూస్తుందా ఏం? దాని సంగతి ఎవడికి తెలియదూ?"

"ఎవరిష్టం వారిది. మన జోలికి రానంతకాలం..."

"ఆగరా. ఆవిడ ఫోజులూ ఆవిడా, పురుష ద్వేషి అని ముద్దు పేరుకూడా ఉందిలే."

"నీకంత అసూయగా ఉంటే ప్రవరాఖ్యుడని నీ పేరు ప్రచారం చెయ్యనా?"

"పేరు కెవరు ఏడ్చారు! దాని వేషాలకు చెబుతున్నాను. వీడు నచ్చడు, వాడు నచ్చడు అంటుందిట. దాని వెనకాలో పెద్ద కథ ఉందిట. స్వయంగా వారి బంధువులే చెప్పారు. యెవడినో ప్రేమించింథి, వాడితో కులికి, వాడు వద్దంటే వాడిని మరువలేక ఏడ్పట..."

"ఒరేయ్ ప్రభాకర్! ఇంకా రిసర్చి యెందుకురా, హాయిగా ఇంట్లో కూర్చోక, స్త్రీ జీవిత పరిశోధనలో ఎంత ముందుకు పోయావు."

"నీకు నాపై నమ్మకం లేదు కదూ? స్వయంగా ఆవిడ చెల్లెలి మొగుడు చెబితే వింటావా? 'మీరు అమెరికా వంటి దేశాలు చూశారు. నైతిక విలువలు నమ్ముతారా? నన్ను చేసుకోండి అని భోరున ఏడ్చిందట. వాళ్ళన్న మీదున్న అభిమానం కొద్దీ చిన్నమ్మాయిని చేసుకున్నాడట."

"ఏడ్చాడు. పోనీ ఆడపిల్ల అలా అడిగిందే అనుకుందాం, ఈ వెధవకు బుద్ధిలేదూ టాం, టాం వెయ్యటానికి..." మరెవరో రావటంతో ప్రభాకర్ వెళ్ళిపోయాడు. 'మీకు తెలుస్తుంది లెండి కొన్ని రోజులలో' అన్న ప్రశాంతి మాటలు చెవులలో రొద పెట్టసాగేయి. ఇది నిజమా? పుకార్లా, ఎందుకో ఉత్సాహం అంతా హరించుకుపోయింది. బస్సు రావటంతో ఎక్కేశాడు.

## 11

రెండు గంటలనుండి వాదోపవాదాలు జరుగుతున్నాయి. తల్లీ తండ్రి కూతుర్ల మధ్యన, వారు అడిగిన ప్రతి మాటకు 'నాకు తెలియదు' అన్న సమాధానమే ఇస్తోంది ప్రశాంతి.

"శాంతీ!" రఘుపతి కూతురి దగ్గరగా వచ్చాడు.

"ఇంకా అడిగేవి ఏమయినా మిగిలాయా నాన్నా?"

"అడిగేవి కావు. ఆజ్ఞాపించేవి ఉన్నాయి."

"కానివ్వండి."

"నీకు... గారాబం నేర్పుకుని అనుభవిస్తున్నామే" కాంతమ్మ గయ్యిమంది.

"నువ్వూరుకో కాంతం... చూడమ్మా, నువ్వు ప్రేమించడం అంతా అబద్ధం అనుకుందాం. అయితే వివాహం ఎందుకు వద్దు?"

"వివాహం వద్దని అన్నానా?"

"అవును. ఎం.ఏ. అయ్యేవరకు వాయిదా వేశావు. అది కుదరదు. వెంటనే నీ వివాహం అయి తీరాలి."

"నాన్నా!"



"నాన్న బ్రతకాలంటే అదొక్కటే మార్గము. వరుని విషయంలో మా బలవంతం ఏం లేదు. నీకు నచ్చిన వారు ఎవరో చెప్పినా సరే, లేదా మాకు నచ్చినవారిని చూస్తాం."

"చెప్పవేం?" తల్లి గద్దించింది.

"శాంతీ! వెంటనే చెప్పమనటం లేదు. రెండురోజులు గడువు ఇస్తాను. ఆలోచించి చెప్పు. పుట్టినప్పటినుండి నువ్వేదడిగినా ఇచ్చాను. ఈ ఒక్క మాట నా తరపు నుండి వస్తుంది. నువ్వు వినాలి. విని తీరాలి." తండ్రి కంఠములో దృఢత్వానికి చలించింది ప్రశాంతి.

"అలా చూస్తావేమే!"

"ఏం చేయాలమ్మా! ఇరవై ఏళ్ళు ఇష్టారాజ్యంగా పెంచి ఒకేసారి..." కంఠం వణికింది.

"పెంచినందుకు అనుభవిస్తున్నామే తల్లీ!"

"అమ్మా, ఒక్క మాటచెప్పు, ఏం అనుభవిస్తున్నావ్?"

"వాదనలు అనవసరం శాంతీ! ఆలోచించుకో." తండ్రి బయటికి వెళ్ళిపోయాడు. కాంతమ్మ స్త్రీ హృదయం భగ్గుమంది. ఏం పిల్ల ఇది! కంటినుండి నీరు కూడా రాదు. అనుకుని లేచి వెళ్ళిపోయింది.

తన అభిప్రాయం ఏం చెబుతుంది. తనకిష్టమైనవ్యక్తికి తన నీడ అంటే భయం. తన ప్రవర్తనతో మెప్పించుకోవటానికి తనకు అవకాశం ఇవ్వరు తల్లి తండ్రులు. 'నేను బ్రతకాలంటే నీ వివాహం వెంటనే జరగాలి.' అన్న తండ్రిమాటలు చెవులలో రొదపెట్టసాగేయి.

మర్నాడు ఆదివారం. లేచి నెమ్మదిగా గది సర్దుకోసాగింది. తన పనులు తను చేసుకోవటం మంచిదనిపించింది.

"శాంతీ!" సునంద వచ్చింది.

"అదేమిటి నువ్వు సర్దుతున్నావు? రాజమ్మను పంపనా?"

"వద్దు వదినా, మన పనులు మనం చేసుకుంటే తప్పేం?"

"నువ్వెందుకో చాలా ఉదాసీనంగా మారిపోతున్నావ్ శాంతీ!"

"ఇంట్లో వారి ప్రేమ అజీర్తి అవుతుంది వదినా. మీరు వెళ్ళి వచ్చాక అయినా అతనింటికి వెళ్ళాం అంటే బావుండేది. అతని ముందు తెల్ల మొహం వేసే బాధ తప్పేది."

"మనూ అన్నయ్య దగ్గరకా...." ఉలిక్కిపడింది. "నీకు అతను చెప్పాడా?" అంది తడబడుతూ.

"ఊఁ... నేను ఎప్పుడయినా చేసినవి తప్పించుకోగా చూశారా? అన్నయ్య ఇంత బాగా అర్థం చేసుకున్నాడంటే నవ్వు వస్తుంది."

"క్షమించు శాంతీ. మీ అమ్మగారు తొందరపడ్డారు ఆరోజు."

"అవును, చెప్పుడుమాటలెంత కర్ణప్రియంగా ఉంటాయో అర్థం అవుతుంది. విద్యాసాగర్ అసలు రూపం గ్రహించిననాడు అందరూ విచారిద్దురుగాని, వెళ్ళి అమ్మతో చెప్పు. వారికిష్టమైన ఏ వల్లకాట్లో రామయ్య అయినా నాకిష్టమేనని."

"శాంతీ!"

"అంతే వదినా. ఈ ఇంట్లో అవమానాలు భరించేకంటే అదే మేలు" అన్నది దృఢంగా.

నాల్గు రోజులనంతరం వేణు ఓయువకుడిని వెంటబెట్టుకు వచ్చాడు. అతను రెండు, మూడు నెలలలో అమెరికా వెడతాడట. అతన్ని క్రింద కూర్చోబెట్టి పైకి వచ్చాడు. ప్రశాంతి హుస్సేన్ సాగర్‌లోని అలలకేసి చూస్తోంది.

"శాంతీ! ఒకసారి బట్టలు మార్చుకుని క్రిందికి రా."

"ఇప్పుడే ఈ బట్టలు వేసుకున్నాను."

"సంతోషించాం తెలివికి. ఫారిన్ నైలాన్‌ది గ్రీన్ చీర కట్టుకో."

"అవి ప్రణు తీసుకు వెళ్ళింది."

"ఇంకేదయినా..."

"ఫారిన్ నైలాన్‌వి లేవు. ఇంకేవి కట్టుకోమన్నా కట్టుకుంటాను."

అతను అయిదు నిమిషాలు తేరిపారజూశాడు. మరేం అనలేదు. క్రిందికి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన దిక్కే చూస్తూ నిలబడింది. చెప్పుడు మాటలు ఇంత దారుణంగా ఉంటాయా? ప్రతి పనికి విలువనిచ్చే అన్న ఎం



మారిపోయాడు? పోనీ యెవరయినా సరే అంగీకరిస్తుంది. నెమ్మదిగా మేడ దిగింది.

హాల్లో వేణు, నూతన యువకుడేకాక విద్యాసాగర్ కూడా ఉన్నాడు. ఆమె రాగానే నూతన యువకుడు రెప్పవేయటం కూడా మరిచిపోయాడు. ఆమె ముదురాకుపచ్చ వయిలేట్ కలర్లు కలిసిన ప్రింటెడ్ చీరలో ఆకుల మధ్యలోంచి తొంగిచూచే గులాబీలా ఉంది. ఈ మధ్య జుట్టు కత్తిరించడం మానేసింది. వెంట్రుకలు వెనుక్కు కట్టింది.

'అందమైన వారు ఏది కట్టినా అందంగానే ఉంటారు. నేనే అనవసరంగా ఏదో అన్నాను' అనుకున్నాడు వేణు.

"రామ్మా, మా చెల్లెలు ప్రశాంతి. ఇతను జియాలజిస్ట్ శ్రీధర్." ఆసక్తిగా చూడలేదు. నమస్కరించింది. అతను ప్రతి నమస్కారం చేయటం కూడా మరిచిపోయాడు.

"ఏమండోయ్ శ్రీధర్‌గారూ! మా మరదలు మిమ్మ మూగవారు అనుకున్నా అనుకోగలదు... సారీ వదినా...' అన్నాడు సగం హాస్యంగా, సగం వ్యంగ్యంగా సాగర్.

"ఆఁ ఏమన్నారు?"

"మా వదినగారికి కళ్ళు వెళ్ళబెట్టే పురుషులంటేమంట."

అతని ముఖం యెలాగో అయింది. అది చూచి వేణుకు కోపం వచ్చినా ఏం అనలేక ఊరుకున్నాడు. సునంద కాఫీలు తేవటంతో వాతావరణం కొంచెం మారిపోయింది.

"ప్రణతి రాలేదేం అన్నయ్యా?"

"నన్ను మాత్రం మీ ఆయన పిలిచాడా? ఉండబట్టలేక వచ్చాను" అన్నాడు.

'ఉద్ధరించావ్' అనుకుంది శాంతి.

"మీరు బంధువులా పిలవడానికి ఇంటి మనుషులే గదా" సునంద సర్దిచెప్పింది. ఈసారి వరుడు ప్రశాంతి పాదాలపై నిలిపాడు దృష్టి. ఈ రోజు ఎవరేమన్నా తనకోపం నిగ్రహించుకోవాలనే వచ్చింది. అన్నింటికి తలూపాలనే.

"మీ ప్రయాణం ఎప్పుడు శ్రీధర్?"

"అవకాశం కలిసివస్తే డిసెంబరులో వెళ్ళాలని ఉంది."

"చదువుతారా ఉద్యోగం చేస్తారా స్టేట్స్‌లో."

"ఇంకా ఏదీ నిర్ణయం కాలేదు."

శ్రీధర్, వేణు మాట్లాడుతున్నారు. సాగర్ ఆశ్చర్యంగా, అసూయగా చూస్తున్నాడు. తనకంటే అతను దేంట్లో గొప్పో, ఎంత తల బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. ప్రశాంతి మౌనం చూస్తే అంగీకారంలానే కన్పిస్తోంది. అతని హృదయం అవమానంతో బుసలు కొట్టసాగింది. ఇటు ప్రశాంతికి సాగర్ సమక్షంలో ముళ్ళమీదున్నట్టే వుంది. ఏ క్షణంలోనైనా అతను అనుచితమైన మాటనవచ్చు, తను నోరు జారవచ్చు.

"అన్నయ్యా?"

"ఏమ్మా?"

"నేను పైకి వెళ్ళనా?"

"వెళ్ళు."

ఆ తరువాత ప్రపంచ విషయాలు ముగ్గురూ చర్చించారు.

"ఇక నేను వెడతాను వేణూ." శ్రీధర్ లేచాడు.

"నేను రెండు మూడు రోజులు అయ్యాక వస్తాను."

"నా అంగీకారంకోసమే అయితే అంత శ్రమపడ అక్కరలేదు."

"ఏమిటి శ్రీధర్?" వేణు ముఖం పాలిపోయింది.

"నిజమే. కాలంతోపాటు మనమూ మారాలి. కన్యాదాతలు పదిసార్లు ఇండ్ల చుట్టూ తిరగాలనటం బూర్జువా పద్ధతి. నాకిష్టమే. ఇక మీ అమ్మాయి కిష్టమైతే, మీకు వీలుగా ముహూర్తాలు పెట్టండి."

"ఓహ్" వేణు తేలికగా నిట్టూర్చాడు. సాగర్ ఆదుర్దాగా చూస్తున్నాడు.

"ఆమె అంగీకారం స్వయంగా వినరాదూ, పైకి పోదాం." చనువుగా శ్రీధర్ భుజాలపై చేయి వేశాడు. సాగర్ అనుసరించటానికి సభ్యత అడ్డువచ్చింది. ఇతన్ని అంగీకరిస్తుందా ఈ అహంకారి అన్న కుతూహలం



అతన్ని నిలువనీయటం లేదు. అతని మనసులోని మాట గ్రహించినట్టే వేణు పిలిచాడు.

"రా సాగర్! వంటరిగా ఏం చేస్తావ్? శాంతి పరాయిదా ఏం?"

వెంటనే లేచి వారిని అనుసరించాడు. పైన ప్రశాంతి మన్మోహన్ దగ్గర తెచ్చిన పుస్తకం పట్టుకుని అటూ ఇటూ తిప్పుతోంది.

"శాంతీ!" అన్నగారి పిలుపుకు ఇటు తిరిగింది. శ్రీధర్ స్నేహ పూర్వకంగా నవ్వాడు. సాగర్‌ను ఉడికించాలని జవాబుగా మధుర మందహాసం వెలువడిందామె ముఖంపై. అది చూచి వేణు తృప్తిగా నిట్టూర్చాడు.

"కూర్చోండి" అన్నది.

"మరెప్పుడయినా కూర్చుంటారు. శాంతీ, శ్రీధర్‌కు నువ్వు నచ్చావు. నీ అంగీకారమే కావాలి. అది నీ నోటి మీదుగా వినాలని....." అన్నాడు వేణు.

తనిష్టమా, ఉహు! నవ్వుకుంది. అంగీకారం తెలుపాలనే అభ్యర్థన అన్నగారి చూపులలో కన్పించింది. ఒక్కసారి తండ్రి బెదిరింపులు గుర్తుకు వచ్చాయి. ముగ్గురు యువకులు ఒక్క క్షణం భరించలేనట్టుగా, జవాబుకై యెదురు చూస్తున్నారు.

"నా కిష్టమే." అన్నది శక్తినంతా కూడదీసుకుని. చిరునవ్వుతో కళ్ళముందు నాట్యం చేసే బొమ్మను బలవంతంగా త్రోసి పుచ్చుతూ.

ఇద్దరి హృదయాలపై పన్నీరు చిలికితే, మరొకరి హృదయంపై మసిలే నూనె చిలికినట్టు అయింది.

"థాంక్స్!" శ్రీధర్ వెనక్కు తిరిగాడు. మిగిలిన వారు అనుసరించక తప్పలేదు. శ్రీధర్ వెళ్ళగానే సాగర్ వెళ్ళిపోయాడు. వేణు గబగబా పైకి వచ్చాడు.

"నీ నోట ఈ రోజు యెంత మంచిమాట విన్నానే." అన్నాడు. లోపలికి వెళ్ళి తల్లి తండ్రులకు ఈ వార్త చెప్పాడు.

"ఈ నెలలో ముహూర్తాలుంటాయిరా?"

"ఎందుకుండవు? అయినా కార్తీకమాసం బావుంటుందని నా అభిప్రాయం అమ్మా!"

"మా ఆదుర్దా మీకు తెలియదురా. యెంత తొందరగా అయితే అంత తొందరలో జరిగిపోవాలి." కాంతమ్మ అన్నది.

"నిజం వేణూ! నీకు సెలవు దొరికితే ఓ పదిరోజులలో పెట్టు. అన్ని ఏర్పాట్లు చేసుకుందాము?"

"అలాగే నాన్నగారూ!" అన్నాడు. కాంతమ్మ ఇన్ని రోజుల తరువాత మొదటిసారిగా కూతురుతో ఆనందంగా మాట్లాడింది. ఈసారి బిగుసుకు పోవటం కూతురు వంతు అయింది.

"నా తల్లీ, నువ్వంటే మాకు పగా, కోపం లేవు. నీ జీవితం ఏమయిపోతుందోనన్న భయం తప్పితే." కూతురి తల నిమిరింది. ప్రశాంతి ఏం మాట్లాడలేదు.

మన్మోహన్ యూనివర్శిటీ క్యాంపస్‌లో కనిపించినా తప్పుకు తిరుగుతోంది.

సాయంత్రం యింటికి రాగానే తల్లి బజారుకు పోదాం అని గొడ మొదలుపెట్టింది.

"ఇప్పుడే యెందుకమ్మా?"

"నీకు ఒక పట్టాన నచ్చవు. నాలుగు కొట్లు తిరిగినట్లొంటుంది." ఆమె తాపత్రయం ఆమెది. రెండు వారాలలో ముహూర్తాలున్నాయన్నారు మరి అన్ని పనులూ ఒకేసారి కావాలంటే మాటలా. ఆఖరికి పెళ్ళి కూడాను

"అమ్మా! నాకేం వద్దు. మీ కిష్టమయినవి తీసుకురండి."

"ఇంకా నాపై కోపమేనా! నీకు తెలియదు పెద్దతల్లీ. నీపై చేయి చేసుకుని వారంరోజులు కుమిలిపోయాను."

"నాకేం కోపం లేదమ్మా! తల్లిగా ప్రేమించే అధికారం ఉన్నట్లే దండించే అధికారం ఉంది. నువ్వు ఏ బట్టలు తెచ్చినా నాకిష్టమే. నాకు బయటి రావాలంటే చికాకు." అన్నది.

"ప్రశాంతీ!"

"కోపం వద్దమ్మా! చూడు. నవ్వు తెచ్చినవాటికి వంక పెట్టను. నిజం" అన్నది. ఆవిడ గొణుక్కుంది. వెళ్ళేప్పుడు మరోమాటు అడిగింది. ఆమె వెళ్ళగా నవ్వుకుంది ప్రశాంతి. జీవితాంతం గడపబోయే వ్యక్తినే వారిష్టప్రకారం ఎన్నుకుంది, చీరలో లెక్కా.



"శాంతీ!"

"ఏం వదినా!"

"అత్తయ్య చాలా బాధపడుతోంది."

"బావుంది వదినా! విధేయత చూపినా కష్టమేనా మీతో?"

"ఓ రెండుగంటలు వస్తే ఏం?"

"నాకిష్టం లేనిపని చేయించటమే మీ ధ్యేయమైతే నాకేం అభ్యంతరం లేదు." లేచింది.

"నువ్వు చాలా మారిపోయావు శాంతీ, వద్దులే నువ్వు రావద్దులే" అని పోబోయి ఆగిపోయింది.

"శాంతీ!"

"ఇంకా ఏమయినా అడగాలా వదినా?"

"అవును. నువ్వు శ్రీధర్‌ని హృదయపూర్వకంగా ఇష్టపడుతున్నావా?"

"ఏం అనుమానంగా ఉందా?"

"అవును. నీ కళ్ళు ఏదో చెబుతున్నాయి."

"మా ముద్దరాలు వదినకు కళ్ళభాష కూడా వచ్చునే." నవ్వింది. "అతన్ని ఇష్టపడక పోవటానికి కారణం ఏముంది వదినా? ధనవంతుడు, అందగాడు, విద్యావంతుడు, త్వరలో అమెరికా వెడుతున్నాడు..."

"ఒకప్పుడు వివాహానికి ఇవే అర్హతలు కావు అనేదానివి."

"ఎప్పుడూ ఒకేలా ఉండముగా."

"పోనీ నేను యెంతో దగ్గరగా వచ్చినా నన్ను అంత దూరములో ఉంచుతావు."

"లేదు వదినా..."

"చాల్లే. నీ మనసులో యెవరో ఉన్నారు."

"ఉంటే...?"

"అదుగో దొంగ దొరికిపోయింది, నాతో చెప్పవా?"

"అది చెప్పే విషయము కాదు. నాలోనే నాతోనే పోవాలి." అన్నది యెటో చూస్తూ.

"ఏం, అతను మన అంతస్తుకు తగడా?"

"అదొక్కటే అడ్డయితే అన్ని బంధనాలు తెంచుకుని అతని అంతస్తుకు చేరుకునేదాన్ని."

"మరి?"

"అతనికి నాలాంటివారి నీడంటేనే గిట్టదు."

"శాంతీ!"

"అవును వదినా!"

"సాగర్ చెప్పేది అతన్ని గూర్చేనా?"

"ఛీ... ఛీ... సాగర్ చెప్పింది అభూత కల్పన వదినా! ఈ విషయం మనిద్దరి మధ్యే ఉండాలి."

"సరే" ఆమె వెళ్ళిపోయింది. వాళ్ళు బట్టలు కొనేందుకు వెళ్ళారేమో అనుకుని చాలా సేపు హుస్సేన్ సాగర్ అలల కేసి చూస్తూ ఉండిపోయింది. బయట అంతా చీకటి వ్యాపించినాక గాని ఈ లోకంలోకి రాలేదు. లేచి లైటు వేసుకొని, క్రిందికి దిగింది. హాల్లో రఘుపతి, వేణు మౌనంగా కూర్చున్నారు. కాంతమ్మ ముఖం కందిపోయినట్టు ఎర్రగా వుంది. ఏమయింది? నెమ్మదిగా బయటికి వచ్చింది వెనుక తలుపు గుండా. ఆమె ఊహించినట్టే వరండాలో నిలబడింది సునంద.

"వదినా!"

"ఏమిటి శాంతీ?" వెను తిరిగింది. ఆమె ముఖంలో ఏ భావమూ కన్పించలేదు.

"అమ్మా, నాన్న అలా ఉన్నారేం?"

"శ్రీధర్ ఇందాక ఫోను చేశాడు."

"ఏమని?" ఆదుర్దాగా అడిగింది.

"తన కప్పుడే పెళ్ళి ఇష్టం లేదట. మనము వేరే సంబంధం చూసుకోవాలట."

"ఆఁ..." పైకి అందిగాని ఎందుకో గుండెలమీద మోస్తున్న పెద్ద బండరాయి దిగినట్టు ఫీలయింది.



"కారణం చెప్పారా?"

"ఊహుఁ."

"నేనూహించనా? నా క్యారెక్టరు మంచిది కాదు. అవునా?"

"అలా ఏం చెప్పలేదు."

"నాకు తెలుసు. సాగర్ మహాశయుడి పని."

## 12

మన్మోహన్ బయటికి వచ్చే సరికి ఎం.ఏ. మొదటి సంవత్సరం విద్యార్థులంతా అక్కడ నిలబడి ఉన్నారు.

"ఏమిటి. నాతో పని వుందా.?"

"అవునండీ, మీరెప్పుడూ సీరియస్‌గా ఉంటారు. ఏది అడగాలన్నా భయమే." అన్నాడు రాజు.

"బావుంది ఆరోపణ." నవ్వాడు మన్మోహన్. దూరంగా నిలబడిన ఉమ గుండెల్లో గులాబులు పూశాయి.

"మాట్లాడుతూనే భయం అంటారేమయ్యా!"

"అది కాదండీ. మాదో చిన్న కోర్కె."

"చెప్పండి."

"మీరు కాదనకూడదు."

"మరి అనుకూలమయింది కాకపోతే?"

"అలాంటి అనుచితం అయింది అడగమండీ. అందరం సరదాగా జువాలజికల్ పార్క్‌కు పిక్‌నిక్ వెడదాం."

"ఎప్పుడు?"

"సాటర్‌డే."

"అలాగే. అందరూ అంటే ఎవరెవరు?"

"మా గ్రూపు వాళ్ళందరం."

"సరే" అన్నాడు. రాజు అడిగే తీరు చూస్తే కాదనబుద్ధి కాలేదు. తను వారిని కాదని చేసేది ఏముంది ఇంటి దగ్గర!

"మెనీ... మెనీ థాంక్స్ సర్!" అన్నాడు రాజు.

"నేనే మీకు చెప్పాలి. మరి ఏదైనా రిఫ్రెష్‌మెంట్స్ తేవాల్నా."

"అంతా మేం చూసుకుంటాము. మీరొస్తున్నారు. అదే చాలు." నవ్వి వెళ్ళిపోయాడు.

"థ్యాంక్స్ రాజా! మెనీ, మెనీ థ్యాంక్స్." ఉమ వచ్చింది.

"ఇంత తొందరగా అంగీకరిస్తాడని అనుకోలేదు" అన్నాడు శంకర్.

"అందుకేగా రాజును పంపింది. అతను అడిగే తీరుకు అందరూ ముగ్ధులవుతారు." ఉమ ఘనంగా చెప్పింది. "మరి ఫస్టుక్లాసు స్టూడెంటాయె."

అప్పుడే ఫైనల్ ఎం.ఏ. ఎకనామిక్స్ గ్రూపు విద్యార్థులు కూడ అక్కడకు వచ్చారు. విషయం తెలిసి వారు కూడా పిక్నిక్‌కు వస్తామన్నారు.

ఉమ అంతర్యము ఎరగని రాజు, శంకర్ దానిదేముంది రమ్మన్నారు.

"గోలగా ఉంటుంది. తక్కువమంది అయితే సరదా."

"అదేం లేదు. అందరం కలిసి ఇరవై మంది అవుతాం" రాజు తేల్చేడు. ఉమ చూపులకర్థం గ్రహిస్తే అలా అనేవాడు కాదు. ముఖ్యంగా ఉమకు ప్రశాంతి రావటం ఇష్టం లేదు. రాజును మనసులోనే తిట్టుకుంది. ప్రశాంతి ఎక్కడున్నా ఆకర్షణకు కేంద్ర బిందువని తెలుసు. కాని ఏం చేస్తుంది. హుస్సురంటూ వెళ్ళిపోయింది.

క్లాసులో మానీటర్‌లా వ్యవహరించే నరహరి వచ్చి ప్రశాంతిని అడిగాడు.

"నాకిలాంటి పార్టీలు పెద్దగా ఇష్టం ఉండదు." అన్నది.

"సహజమేగా. మీరు లక్ష్మీపుత్రికలు. ఎప్పుడంటే అప్పుడు ఎక్కడకంటే అక్కడికి వెడతారు. మాలాంటి వారికి సమస్యలు మరిచిపోవటానికి కాస్త రిక్రియేషన్ కావాలి."

"మిమ్మల్ని వద్దనలేదే."

"మీరు రాకపోతే నిండుగా ఉండదు." దూరంగా నిలబడి క్లాస్‌మేట్స్ నరహరి వంక జాలిగా చూస్తున్నారు. ఏ క్షణంలోనైనా చెం... పగలవచ్చు. బి.ఏ.లో ఉండగా ఒకరిద్దరికి అలాంటి సత్కారం జరిగింది.



"బాగుంది. నేను అంత లావుగా ఉంటానా?" కొంటెగా నవ్వింది.

"మీరలా మరో అర్థం చేసుకుంటే ఏం చేయాలి? మీ ఇష్టం." అన్నాడు చిన్నబుచ్చుకుంటూ.

"మీరలా చిన్నబుచ్చుకోవద్దు. వస్తాను. సరేనా?" నరహరి ముఖం సంతోషంతో వెలిగిపోయింది. మిగిలినవారి ముఖాలు చిన్నబోయినా ఆశ్చర్యంతో చూస్తున్నాయి.

"నిజంగా!"

"కాగితంమీద రాసివ్వమంటావా?"

"అంత మాట వద్దు."

'నా రాకవల్ల నల్గురికి సంతోషం కలిగితే అదే చాలు' అనుకుంది. ఇంట్లో రెండు రోజులనుండి ఏర్పడిన నిస్తబ్దత దూరం అవుతుంది, అదే చాలు. మర్నాడు ఆమె తయారవుతుంటే ఎక్కడికని ఎవరూ అడగలేదు. లైబ్రరీకి పోవటము అలవాటే. అందుకే డ్రైవర్ని బస్సుస్టాండు దగ్గర వదిలించుకుంది.

సీనియర్స్ వస్తున్నారని తెలియని మన్మోహన్ లోపల గేటువద్ద నిలబడ్డాడు. అతనికి బస్సుదిగే ప్రశాంతి కన్పించింది. ఆమేనా అని మరోసారి కళ్ళు తాటించి చూశాడు. ఆమె అయితే వేషంలో విపరీతమైన మార్పు. లేత నీలం గోధుమ రంగు కలనేత చీర, నీలం జాకెట్టు, చేతులనిండుగా గాజులు, రెండు పాయలు అల్లి రిబ్బను కట్టిన పొట్టి జుట్టు, నుదుట బొట్టు. అందమైనవారి అందం ఏ దుస్తులలోనైనా ప్రదర్శితం అవుతుంది కాబోలు! అనుకోకుండా అతని కాళ్ళు ముందుకు సాగాయి. ఆమె తలెత్తింది. ఆమె కళ్ళలో నీరసం పోయి మెరుపు ప్రవేశించటం అతనికంట పడింది.

"మీరా?"

"కాదు, నా పేరు ప్రశాంతి."

"సారీ! మీరు వస్తున్నట్టు రాజు చెప్పలేదే."

"ఏం మానేసేవా?" అప్పటికే జనంతో 'జువాలజికల్ పార్క్' నిండింది.

"అలాగే అనుకోండి."

"అయితే మించిపోయిందేం ఉంది. పొమ్మంటారా?"

"వద్దు లెండి. అందరూ నా ప్రాణానికి పడి ఏడుస్తారు." ఇద్దరూ నవ్వుతూ లోపలికి వెళ్ళారు. అప్పటికే వచ్చిన రాజు టికెట్లు తీస్తున్నాడు. రెండవ బస్సులో బిల, బిలమంటూ అందరూ దిగారు. దూరం నుండే ఉమ మన్మోహన్‌ను చూచింది. అతని ప్రక్కన అతి సామాన్యమయిన దుస్తులలో నిలబడిన ప్రశాంతిని చూడగానే ఆమె హృదయం భగ్గుమంది. 'ఛీ దరిద్రురాలు యెలాంటి బట్టల్లోనైనా వెలిగిపోతుంది.' అనుకున్నది. వస్తూనే ప్రశాంతిని అడిగేసింది.

"బస్సులో వచ్చావా? సార్ ఎక్కడ కలిశారు?"

"ఇక్కడే... ఈ గేటు దగ్గర కలిశాము. బస్సులో వచ్చాను. సరిగ్గా తొమ్మిది నిమిషాల క్రితం" అన్నది ప్రశాంతి.

"ఒహో! కారేమయింది?"

"నా మాటకేం గాని మీ కారు ఏమయింది."

"డాడీకి ఆస్పత్రిలో పని ఉందట" అన్నది. తరువాత మన్మోహన్‌ను పలకరించింది.

"యెంతయినా పక్షపాతం పోనిచ్చుకున్నారు కాదు. మొదట స్నేహితురాలి తరువాతే గురువులు కదా" మన్మోహన్ నవ్వుతూ అన్నాడు.

"కాదు..." తడబడింది. అందరూ ఒక్కసారి గోలగా అరుస్తూ గేటు దగ్గర చేరారు. ప్రశాంతి మన్మోహన్‌నే చూస్తోంది. అందరిలోకి చిన్నవాడుగా కన్పిస్తున్నాడు అతను. అందరిలోను అతను ప్రత్యేకంలా కన్పిస్తాడు. ఉమ లాంటి వారు అభిమానిస్తారంటే అతిశయం  ఏం లేదు. ఇరవై మందిలో ముగ్గురు ఆడవారు. ఉమ, ప్రశాంతి కాక సీత అనే మరో యువతి వచ్చింది. ఆమె ఉమ క్లాస్‌మేట్. నవ్వుతూ, త్రుళ్ళుతూ పార్కు చూడటం ప్రారంభించారు. ఉమ, సీత ఒక జట్టు అయి మన్మోహన్ వెనకాలే నడుస్తున్నారు. ప్రశాంతి ఒక్కర్తీ అయిపోయింది. ఆమెకోసం మన్మోహన్ ఆగి వెనుతిరిగి చూడటం చచ్చే చికాకు అన్పించింది.

"ఆమె చిన్నపిల్లా? వస్తుంది పదండి." రెండు, మూడు సార్లు ఉమ



హెచ్చరించింది. కావాలని అతన్ని తాకడం, విరగబాటుగా నవ్వటం చూస్తే సీతకి అదో మాదిరిగా ఉంది.

"మిస్ ప్రశాంతీ!... అలాగే అక్వేరియం ముందు నిల్చోండి."

రాజు తన కెమేరా లోడ్ చేశాడు. ఆమె ఫోటో తీశాడు.

"ఎందుకు పనికి వస్తుంది. ఫోజులు ఇవ్వటానికి కాక పోతే..." ఉమ విసుక్కుంది. దూరం వెళ్ళి మన్మోహన్‌ను ఫోటో తీసింది. మళ్ళీ దళం ముందుకు కదిలింది. కోతుల దగ్గర కొచ్చి ఆగారు. ప్రశాంతి యేదో ఆలోచిస్తూ వాటివంకే చూస్తోంది.

"ఏమిటి ప్రశాంతీ అంత మైమరుపు! కొంపతీసి కోతులను ప్రేమించలేదు కదా." ఉమ జోకింది.

"ప్రేమించినా తప్పులేదు ఉమా! మనకంటే అవే నయం.' మనం రెచ్చగొడితే తప్ప మనజోలికి రావు" అన్నది నిబ్బరంగా.

ఉమ మూతి విరిచింది.

అందరు ముందుకు పోయినా ప్రశాంతి అక్కడే నిల్చుంది. సాగర్ ప్రవర్తనే తనకు గుర్తొస్తోంది. అతను ఇక తన జీవితం బాగుపడనీయడని అర్థం అవుతోంది. అతనికి బుద్ధిచెప్పే మార్గం లేదా?

"ప్రశాంతిగారూ..."

వెనుతిరిగింది. మన్మోహన్ నిల్చున్నాడు. అతనికి తన మీదున్న పుకార్లు తెలిస్తే ఈ స్నేహభావం ఉంటుందా అనుకుంది.

"సారీ, పదండి."

"పోదాం తొందరేం, నేనోమాట అడగనా?"

"తప్పకుండా."

చూడండి నేను మీకంటే చిన్నదాన్ని 'అండీ, గారూ' అనకపోతేనేం? అన్నది.

"మర్యాద ఇచ్చి పుచ్చుకోవాలి."

"మీరు అండీ అననంత మాత్రాన నేను గౌరవించనని భావించవద్దు" అన్నది.

"ప్రయత్నిస్తాను. రోజు, రోజుకూ మీరు పరధ్యాసగా, నిర్లిప్తంగా వుంటున్నారు."

"...జవాబు ఏమని చెబుతుంది! చెపితే మర్యాద మట్టి పాలవదూ?

"పోనివ్వండి. మీ కిష్టం లేకపోతే బలవంతం లేదు."

"ఇష్టం లేక కాదు. మరెప్పుడయినా చెబుతాను." అన్నది.

అప్పుడే ఉమ వచ్చింది. ఆమెకు చికాకుగా వుంది.

"అందరం కలిసివచ్చినప్పుడు కలిసి తిరగాలి." అన్నది.

"ఆ మాట గుర్తుంటే మరిలా ప్రశాంతిని వంటరిగా వదలరు" అన్నాడు.

"సారీ! రా ప్రశాంతీ" చేయిపట్టి లాక్కుపోయింది.

తిరిగి, తిరిగి అలసిపోయాక, ఓ దగ్గర పచ్చికపై కూర్చుని ఫలహారాలు తీసుకున్నారు.

"ఇక్కడ కోతులు, కొండముచ్చులు ఏం బావుండలేదు. కిద్వాయి గార్డెన్స్‌కి వెడదాం." ఉమ ప్రపోజ్ చేసింది. ప్రశాంతికి ఉమ ఆంతర్యం అర్థం అయింది. తనుండటం ఇష్టం లేదని. వాళ్ళంతా బస్సులోనా, రిక్షాలలోనా అని వాదించుకుంటున్నారు.

"నేను వెళ్ళిపోతానండీ."

"ఏం ప్రశాంతీ! మాతో వుండటం బాధగా వుందా?"

"మీ అభిమానులకు బాధగావుంది."

"పదండి... పదండి బస్సు వచ్చేసింది." రాజు అరుపటంతో అందరు బిల, బిలమంటూ లేచారు.

"పదండి సార్!" మన్మోహన్ బస్సు ఎక్కగానే, తనూ ఎక్కి తేలికగా నిట్టూర్చింది ఉమ. ప్రశాంతి, మరికొందరు ఉండిపోయారు వెనకాల. బస్సు కదలబోయే సమయంలో మన్మోహన్ కింద వుండిపోయిన వారిని చూడటం దిగటం ప్రశాంతి చూడలేదు.

"మీరు దిగేశారేం?"



"మీరంతా ఉండిపోయారని."

"మాకేం భయమా?" అనబోయి మాటలు మింగేసింది. నిజం నిర్మొహమాటంగా అంటాను అన్న అహంకారమే తన జీవితానికో పెద్ద గ్రహణం అయి కూర్చుంది.

"ఏమిటో చెప్పబోయి ఆగిపోయారేం? ప్రతి మాటకు పరధ్యాసగా ఆలోచిస్తారు." అని ప్రక్కనున్న ఇద్దరు జూనియర్ విద్యార్థుల వైపు తిరిగాడు.

"మీరలా దూరంగా నిలబడితే యెల్లా? అందరితో కలిసిపోవాలి." అన్నాడు.

"మేం కలిసినా వారు కలవనివ్వరు సార్! మేం కావాలనే ఉండిపోయాం. కేవలం మీ కోసం వచ్చాం" అన్నాడు ఒకతను.

"నిజం సార్! మీకు అంగీకారం అయితే మేం వెళ్ళిపోతాం."

"మనము వచ్చేది కొన్ని గంటలు మన యాంత్రికజీవితం మరిచి పోవడానికి. మనశ్శాంతి కరువయితే అక్కడ ఉండటంలో అర్థం లేదు. మీ ఇష్టం వచ్చిన చోట తిరగండి."

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. ఇద్దరే మిగిలారు. ప్రశాంతి మెల్లగా పక్కవారికి విన్పించనంత చిన్న గొంతుతో జరిగే తంతులూ, జరుగుతున్న విషయాలూ చెప్పింది.

"మేం ఇద్దరం అక్కా, చెల్లెళ్ళలా కాదు, ప్రాణ స్నేహితుల్లా ఉండే వారము. పెళ్ళి అయింది మొదలు ప్రణు మాటలాడిందే తక్కువ. అతని అనుచితమైన మాటలకు అవమానించాను. ప్రతీకారం తీర్చుకుంటున్నాడు."

"రాస్కెల్! ఒకమ్మాయి నడవడికను గూర్చి పుకార్లు లేవదీయటమా వాడు అమెరికా వెళ్ళి ఏం చేశాడట."

అతని ముఖం ఎర్రగా మారింది. ప్రశాంత కంఠం తేలికగా ఉంది. చిన్నప్పటినుండి పొగరుమోతు అమ్మాయి అని యెవరూ స్నేహితురాండ్లు లేరు. ఆమె ఏమో చెప్పబోయేలోగానే దూరం నుండి ఇద్దరి మాటలూ వినిపించాయి.

"నీ ఆడబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. ఆ అమ్మాయిదే అపురూప సౌందర్యము."

"మీరు పొట్టి. అందుకే అతనంటే కుళ్ళుగా ఉంది. నిజంగా అతని ముందు ఆమె అందం తీసికట్టే."

"పోనీ ఇద్దరూ ఒకరి కొకరు సరిపోయారు సరేనా?"

వారి మాటలకు తమ మాటలాపి ఉలిక్కిపడి చూచారు. ఎవరో యువజంట, తమనుగూర్చి అభిప్రాయం వెల్లడించుకున్నారు. 'వారిద్దరూ పిక్‌నిక్' వచ్చిన వారిలా కన్పించలేదు. బస్సుకోసం ఎదురుచూస్తూ నిల్చున్న నూతన జంటలా' ఉంది. ఇద్దరూ, ఒకరినొకరు చూచుకున్నారు. ప్రశాంతి తల వంగిపోయింది. బస్సు రాగానే ఇద్దరూ ఎక్కేశారు. ఆ తరువాత దారిపొడవునా మౌనవ్రతమే. వారు దిగగానే ఉమ యెదురు వచ్చింది.

"శ్రీకంఠన్, గోపాలం ఏరి?"

"ఇది ధనవంతుల పిక్‌నిక్ అని వెళ్ళిపోయారు."

"మన్మోహన్‌గారూ! వారిని మీరు తలపై ఎక్కించి పాడు చేశారు" అన్నది ఉమ. మీరు దిగిపోయారేం అని డైరెక్ట్‌గా అడగలేక.

"నా తలపై వారినెక్కించేపాటి స్థలం లేదే." నవ్వుతూ ముందుకు నడిచాడు.

ఉమ జనాంతికంగా అంది. "తలపై అంటే తలపైనే ఎక్కించుకోవాలా! ఫీజులు కట్టి, నోట్స్ యిస్తూ....."

"ఆయనే చాలా బీదవాడంటావుగా?" మరొకతను అన్నాడు.

"బీదవాడు కాక కుబేరుడా!" మెల్లగా అంది.

"వీళ్ళందరికీ పైత్యం లే, బీదవానిని పైకి లాగాలని" ఆమె గొణుగుతుంది. ప్రశాంతి ఆశ్చర్యపోయింది. ఉమ అతని ఎదురుగా అంతలా పొగడి వెనకాల ఇలా అంటుందేమిటి? లోకం తీరే అంత కాబోలు. తను అలాగే మారాలి అనుకుంది. రాజు పిలవటంతో వెళ్ళిపోయింది.

## 13

"శాంతీ!"

"ఏమన్నయ్యా!"



"నిన్న ఎక్కడికి వెళ్ళావు?"

"కమలానెహ్రూ జూలాజికల్ పార్క్‌కి. కిద్వాయ్ గార్డెన్స్‌కి వెళ్ళాం."

"ఇంట్లో చెప్పావా?"

"ఇదివరకు వెళ్ళినప్పుడు చెప్పానా?" ఎదురు ప్రశ్న వచ్చే సరికి అతను కనుబొమ్మలు చిట్లించాడు.

"అది సరే! అనుకున్న ముహూర్తానికి నీ వివాహం జరిగిపోవాలి."

"... ..."

"మాట్లాడవేం? ఈ రోజే సారధికి ఉత్తరం రాస్తున్నాను. వారం రోజులు సెలవుపెట్టి రమ్మని. సరేనా?"

"మీ ఇష్టం అన్నయ్యా! సారథే కాదు, రిక్షావాడిని తెచ్చి కూర్చోబెట్టి నీ భర్త అన్నా నేను అభ్యంతరం చెప్పను." అన్నది కఠినంగా.

"నీకిష్టమైన వాడెవడో చెప్పరాదూ?"

"లేడు, నన్ను మోసం చేశాడు. సరా?" అంది కసిగా.

"ఈ పొగరు కట్టిపెట్టి నేను చెప్పింది విను."

"విననని నేను ఎప్పుడూ అనలేదు." అంతే, అతను వెళ్ళిపోయాడు. సారధికి తల్లి కోర్కెపై టెలిగ్రాం ఇచ్చాడు వేణు. ఆ సాయంత్రము ప్రణతి భర్తతో వచ్చింది.

"ఈసారి అయినా ఏ విఘ్నం లేకుండా వివాహం అయితే బాగుండును." ఆరిందాలా అంది.

"ఆ మాట మీ ఆయనతో చెప్పు."

"అంటే నీ ఉద్దేశం." ప్రణతి కోపంగా లేచింది.

"కోపమెందుకే ప్రణూ! నా జీవితంతో ఆడుకున్నా ఫరవాలేదు. నీ జీవితం నాశనం చెయ్యకపోతే అదే పదివేలు. ఇంపాలా కారు చూసి మోసపోయావు. కారు పోయింది. ఆశలు అన్నీ ఆరిపోకుండా కాపాడుకో."

"శాంతీ!" ప్రణతి కోపంగా లేచిపోయింది.

ఆ రోజు భోజనం చెయ్యకుండా వెళ్ళారు ఇద్దరూ.

"దాన్ని ఏమయినా అన్నావా?" తల్లి అడిగింది. ఏమన్నానని చెబుతుంది. మౌనంగా తలాడించింది.

* *

సారథి తప్పక పాస్తాడు. ఈ అవకాశం వదులుకోడు. అన్య మనస్కంగా కాలేజీలో అడుగుపెట్టింది. చదవాలన్న ఉత్సాహం లేదు. జరిగింది జరగబోయేది చూస్తుంటే, విద్యకు, విజ్ఞానానికి పోలికే లేదనిపించింది. అందుకే దూరంగా యూనివర్శిటీ ప్రెస్ దాటిపోయి ఓ చెట్టు క్రింద కూర్చుంది.

ఈ క్రింది మాటలు వినిపించాయి.

"సార్! మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను."

"నా ఋణం సంగతి తరువాత. మళ్ళీ ఒంటరిగా బయలు దేరటం మంచిది కాదమ్మా!"

"అతడు నమ్మించాడు సార్!"

"యూనివర్శిటీకి మనలాంటి మధ్యతరగతి కుటుంబీకులు చదువుకోవటానికి రావాలి. అంతే. ధనవంతులు ఏం చేసినా చెల్లుతుంది. వారు అన్నీ కొనగలరు, అమ్మగలరు. మన జాగ్రత్తలో మనం ఉండాలి."

అది మన్మోహన్ గొంతు. దూరంగా బి.ఏ. ఫైనలియర్‌లో ఉన్న రమణి కనిపించింది. మన్మోహన్ కంటపడాలని లేదు. అయినా అతను చూడనే చూశాడు.

"వాట్ ఏ వండర్!" దగ్గరగా వచ్చాడు.

"మీరిక్కడున్నారేం?"

"మీరు క్లాసులో, క్లాసు బయట ధనవంతులను ఆడిపోసుకోవటమే ధ్యేయంగా పెట్టుకున్నారులా ఉందే?" యెదురు ప్రశ్నించింది.

"మీరలా వాదం వేసుకుంటే నిజం చెప్పక తప్పదు. మీ క్లాసులో సీతాపతి తెలుసా?"

"తెలియకేం. లాస్టియర్లు అతనికి నెల్లూరులో కెల్లా ధనవంతుల అమ్మాయితో వివాహం అయింది."

"ఆ వివాహితుడు కొత్తగా ఉమెన్స్ కాలేజీనుండి యూనివర్శిటీకి వచ్చిన రమణితో, వివాహం కాలేదని ప్రేమ కలాపాలు మొదలుపెట్టాడు. ఆమెను తీసుకుని వారం రోజులు మద్రాసు ఉడాయించాలని చూశాడు.



స్టేషన్లో నా కంట పడ్డారు కాబట్టి సరిపోయింది." అన్నాడు తేలికగా నిట్టూరుస్తూ.

"మీరీ మధ్య చాలా పుణ్యం మూటగట్టుకుంటున్నారు."

"మీకు భాగం కావాలా?"

చురుక్కున చూసింది. ధనవంతులనీడ అసహ్యించుకునే మనిషి ఇతను. అతను కొంటెగా చూస్తూ బుగ్గలు తడుముకున్నాడు.

"చెంపమీద కాదు. మిమ్మల్ని, తలమీద వేయాలి. అది మధ్యలోకి వస్తుంది." అని లేవబోయింది. చీర తట్టుకుని బోర్లాపడేది. అతను భుజంపట్టి ఆపాడు. ఆమె తల వచ్చి అతని గడ్డానికి కొట్టుకుంది. అతనికేదో మైకం కమ్మింది. అతను స్పృహలోకి వచ్చేసరికే ప్రశాంతి బుగ్గలు కందిపోయాయి. ఆమె యెలాంటి వ్యతిరేకత చూపలేదు. జీవితం అలాగే ముగిసిపోతే బావుండును అనుకుంది.

"ప్రశాంతీ!" అతను కోలుకొని తన పొరపాటు తెలుసుకున్నాడు.

"క్షమించు ప్రశాంతీ... నేనెంత దిగజారిపోయాను." ఆమెను వదిలి, నల్లబడిన ముఖంతో వెనుతిరిగాడు.

"చూడండి...

"చెప్పు"

"మీ అనుచిత ప్రవర్తనకు పరిహారం చెల్లించాలి."

"ఏం చెయ్యమంటావు. పది గుంజిళ్ళు తియ్యనా?" అతనికింకా ఆమె స్పర్శ తాలూకు అనుభూతి గిలిగింతలు పెడుతోంది.

"లేదు. జీవితాంతం నా బందీగా ఉండాలి."

"నువ్వు సామాన్యురాలివయితే ఆ పనే చేసేవాడిని ప్రశాంతీ" అన్నాడు. తిరిగివచ్చి ఆమె ప్రక్కన కూర్చుంటూ.

"నాలో మీకు కన్పించిన అసమాన్యత ఏమిటో!"

"చెబితే ఏడుస్తావ్."

"ప్రామిస్. వింటానుగా. చెప్పండి" అన్నది అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"నా జీతం అంతా కలిపినా నీ ఒక్క చీర ఖరీదు చేయదు. నీ స్థాయికి నేను యెదగలేను."

"పోనీ మీ స్థాయికి నేను దిగితే."

"అదంత తేలిక అనుకుంటున్నావా?" వారి మాటలు పూర్తికా మునుపే దూరంగా విద్యార్థులు కనిపించారు. అనవసరంగా స్కాండల్స్ వేస్తారు విడిపోయారు. ప్రశాంతికి ఒకటే ఆలోచన. అతన్ని తనవాడిగా యెల చేసుకోవటం? తనింత సింపుల్‌గా మారటం అతను చూడలేదా! గమనించడంటే నమ్మదగిన విషయం కాదు.

కారు ఎక్కేటప్పుడు ఏదో చెప్పబోయాడు.

"మధ్యతరగతి కుటుంబీకులు చదువుకోవటానికి వస్తారు. మీల ప్రేమపాఠాలు చెప్పరు. నాలాంటి ధనవంతులు ప్రేమ అమ్మగలరు, కొనగలరు" అన్నది కొంటెగా.

అతను ఏదో చెప్పేలోగా కారు వెళ్ళిపోయింది.

* * *

హాల్లో సారధిని చూస్తూనే అంతవరకు అనుభవించిన హాయి అంత మాయం అయింది. అలాగే నిలబడిపోయింది. అతను చిన్నగా నవ్వాడు.

"ఎప్పుడొచ్చారు?"

"గంట క్రితం" అన్నాడు. మరేం మాట్లాడేది లేదు అన్నట్టు పైకి వెళ్ళిపోయింది.

తను ధైర్యం చేసి ఇంకా కొన్ని రోజుల గడువు అడగాలి అని ఓ నిర్ణయానికి వచ్చి క్రిందికి రాబోయింది. పైన బాల్కనీలో మాట్లాడుతున్నారు సారధి, వేణు.

"తన నోటిమీదుగా వినేవరకు నాకు నమ్మకం కలగదు."

"లేదు సారధీ, తన అంగీకారం వినే నీకు రాశాను మళ్ళీ ఆలస్యం ఎందుకని టెలిగ్రామిచ్చాను."

"ఏమో! తనంటే వల్లమాలిన అభిమానంవల్ల వచ్చాను. ఆటబొమ్మలా ఆడిస్తోంది."

"చిన్నతనం. ఎప్పుడూ అలాగే ఉంటుందేమిటి? పెద్ద ఆడంబరం వద్దు. వివాహం క్లుప్తంగా కానిచ్చి గ్రాండ్‌గా రిసెప్షన్ ఇద్దాం."



"గుడ్‌నేను సాయంత్రం వెళ్ళి జనరల్ మేనేజర్‌తో అన్నీ చెప్పి వస్తాను." మైమరిచినట్టు మాట్లాడే అతని తీరుకు ప్రశాంతికి చిరాకేసింది.

"అన్నట్టు ఓ కారు చూడు వేణూ! ప్రశాంతిని నడిపించడం బావుండదు."

"నా పేరు మీదుగా అప్లయి చేశాను. అది తీసుకుందువుగానిలే"

ఎలా చెప్పాలి? రిక్షావాడికి కట్టబెట్టుకుంటానని హామీ ఇచ్చిందాయె. వచ్చిన దారినే తన గదిలోకి వెళ్ళింది. జీవితంలో మొదటిసారిగా బావురుమని ఏడ్చింది.

తనెలా చెప్పగలదు తన హృదయంలో మన్మోహన్‌కు తప్ప మరొకరికి స్థానం లేదని... అతనెలాంటి వాడయినా తనూహించిన పురుషత్వం అతనిలో ఉందని, దానిముందు తను సర్వం సమర్పించి, అతని పాదాలముందు జీవించగలదని. అలా యెంత సేపుందో తెలియదు.

అదే సమయాన సునంద భర్తతో వాదిస్తోంది. తన గదిలో సారధి క్రిందికి వెళ్ళిపోగానే వేణు గదిలోకి వచ్చాడు.

"మీ అందరి మనసులు ఏమిటో నాకు తెలియదు. ప్రేమయినా, కోపం అయినా ముంచుకు వస్తాయి."

"ఇంతకీ నువ్వు అనేది ఏమిటి?"

"ఇలా ఆఘమేఘాలమీద వివాహం చేసేటట్లయితే, ఏ పదిహేను సంవత్సరాల వయసున్నప్పుడే చేయాలి. పెళ్ళి చూపులంటూ, పెళ్ళికొడుకుల వెంట అమ్మాయిలను తిప్పి, ఈ రోజు ఒకేసారి ప్లేటు ఫిరాయిస్తే ఎలా? ప్రశాంతి ఇష్టా, ఇష్టాలతో పనిలేదా?"

"నేను అడగలేదా."

"మహా అడిగారులే..." విసురుగా అంది. "మెడమీద కత్తి పెట్టినట్టు అడిగితే ఏం చెబుతుంది. విద్యాసాగర్ మాటలకు అంత విలువ యివ్వటం కూడా మంచిది కాదు" అతనేం మాట్లాడలేదు. తామంతా ప్రశాంతిని ఎంత ప్రేమించారు. ఒక్క చెప్పుడు మాటతో వెలివేసినట్టు చూస్తున్నారు. పిచ్చిపిల్ల ప్రేమతప్ప ధూషణలు యెరుగక పోవటంవల్ల యెంత బాధ పడుతోందో.

తననూ, తండ్రినీ అడగలేకేనేమో అతి సాధారణమైన దుస్తులలో యూనివర్సిటీకి వెళుతోంది. జీన్స్, చుడీదార్, పైజామాలు అసలు వాడటం లేదు. బజార్లోకి వచ్చిన క్రొత్త ఫ్యాషన్ చీరలు మొదట ప్రశాంతి దగ్గరుండేవి. అలాంటి ఆమె బజారు ముఖం కూడా చూడడం లేదు. అతనికి బాధగా అనిపించింది. టైమ్ చూశాడు. ఏడు. గబగబా క్రిందికి వచ్చాడు. బజారువైపు కారును పోనిచ్చాడు.

ప్యాకెట్లు మొయ్యలేక మోస్తున్న అన్నగార్ని ఆశ్చర్యంగా చూసింది ప్రశాంతి.

"ఏరా పెళ్ళిబట్టలు ఇప్పుడే కొన్నావా?" తల్లి అడిగింది.

"పెళ్ళిబట్టలు కాదమ్మా! బజార్లో క్రొత్తరకాలు వచ్చాయి. మీకందరికీ తెచ్చాను. ముఖ్యంగా శాంతి కోసం."

అందరూ ఆసక్తిగా, అభిమానంగా చూస్తున్నా శాంతి ఎటో చూస్తూ అవును, కాదు అని నిరాసక్తిగా జవాబులిచ్చింది.

"ఏం నచ్చలేదా?"

"చాలా బావున్నాయి." అంది.

అది నిజంగా అన్నమాట కాదని అందరికీ తెలుసు.

## 14

మనోమోహన్ ఇంటికి వస్తూనే పిల్లలకు పాఠాలు మొదలుపెడతాడని అందరూ ట్యూషన్ అనుకుంటారు. తన చేతనయినంతగా ఒకరికి సాయం చెయ్యాలనే తత్వం అతనిది. అరుణ వుండగా అతని విషయాలు శ్రద్ధగా చూచేది. తల్లి చూడలేదు. భర్త తోడిదే లోకంగా బ్రతికిన ఆమె, పుత్రిక నిరసించినా బాధ్యతకు కట్టుబడి బ్రతుకుతోంది. కూతురి పెళ్ళి విషయం కొడుకు నిర్ణయము ఎవరూ హర్షించకపోయినా ఆమె బాధపడలేదు. ఇదేమని కొడుకును అడగలేదు. తల్లిలోని ఈ నిర్లిప్తత వల్లనేమో అన్నా, చెల్లెలు చాలా సన్నిహితులయ్యారు. ఇప్పుడిప్పుడే అతని తల్లికి ఇంట్లో ఇంకో మనిషి అవసరం



అనిపించసాగింది ఆమె అనారోగ్యం వల్ల పనులన్నీ కొడుకు నెత్తిన పడుతున్నాయి.

"మందు తీసుకున్నావా అమ్మా?"

"తీసుకున్నాను మనూ! నీవింత చేస్తావ్. నా దురదృష్టం చూడు. నీకు ఇష్టమైనవి వండిపెట్టే ఓపిక లేదు."

"నువ్వలా బాధపడకు. అరుణ వస్తుందిగా. అన్నీ చేస్తుంది."

"పాపం అక్కడే చేసుకుని వస్తుంది పిచ్చితల్లి. ఒకేసారి ప్రాణం పోయినా..."

"అమ్మా!"

"అనగానే పోతుందట్రా"

బయట స్టూడెంట్స్ వచ్చిన గోల వినిపించింది. ఆ రోజు తనకు ఒంట్లో బావుండలేదని వారిని పంపాడు. ఒంట్లో కాదు, మనసులోనే బావుండలేదు. ప్రశాంతి స్పర్శ, కళ్ళూ ఇంకా అతన్ని వెంటాడుతూనే వున్నాయి.

"మనూ!"

"చెప్పమ్మా."

"అరుణపై ఆధారపడటం కుదరదు బాబూ! త్వరగా నువ్వు వివాహం చేసుకుంటే నిన్ను గూర్చిన చింత ఉండదురా."

అతనేమంటాడు, అందరి తల్లుల్లా ఆమె యెప్పుడూ ఏ విషయములోనూ కోరికలు కోరలేదు. నోరువిడిచి ఈ రోజే అడిగే మాట కాదని యెలా అంటాడు. తన వయసు చిన్నదేం కాదు.

"లింగమూర్తి, ఆయన భార్య వచ్చారు." అన్నది. వారు ఎందుకు వచ్చారో తెలుసు. వారు ఉమ తల్లితండ్రులు. కూతురిని ఇస్తామని వచ్చి వుంటారు.

"వారి అమ్మాయికి నీకు బాగా చనువట కదా?"

"వాళ్ళే చెప్పారా"

"ఊఁ నీకు మీ అమ్మకు చెప్పాలనిపించకపోయినా, వాళ్ళమ్మాయి మాత్రం వారితో చెప్పిందట."

"ఏమని?"

"తనంటే నీకిష్టమని, అలాగే నువ్వంటే ఆ అమ్మాయికి అభిమానమట" అతను నవ్వాడు.

"అమ్మా! నీతో దాచవల్సిన అవసరం ఏముంది, నువ్వు ఫలానా పిల్లనే చేసుకో అని ఏమి ఆంక్ష విధించలేదుగా."

"మరి వారు అబద్ధం చెప్పారా?"

"నాకెలా తెలుస్తుంది." మరెవరో రావటంతో ఆ రోజు సంభాషణ ఆగిపోయింది. 'నేను మీ స్థాయికి దిగితే...' అన్న ప్రశాంతి మాటలే మాటిమాటికీ గుర్తుకువస్తున్నాయి. ఉమ పురుషులతో మెలిగే తీరు చూస్తే అతని వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయి. జీవితాంతం ఉమను భరించగలడా. వారం పదిరోజులు అతనికి ఊపిరి సలుపని పని. యూనివర్శిటీలో ఎవరో విదేశీయులు దిగారు. వారి ఉపన్యాసాలు అరేంజ్ చేస్తూ, అటూ ఇటూ తిరగటంతోనే సరిపోయింది.

ఆ రోజు ఇంటికి వచ్చే సరికి లింగమూర్తి దంపతులు ఉన్నారు. అరుణ కూడా వచ్చింది. మన్మోహన్‌కు వారి రాకలోగల ఆంతర్యం అర్థం అయింది. కుశల ప్రశ్నలు అయ్యాయి.

"మన్మోహన్, నువ్వు యూనివర్శిటీకి ఫస్టు వచ్చావ్. ఫారిన్ యెందుకు వెళ్ళవూ?"

"ఫస్టువచ్చిన వారంతా పోవాలని ఎక్కడుంది?"

"అవకాశమున్నవారు వెళ్ళొచ్చుగా"

"అది వ్యక్తి ఇష్టంపై కూడా ఆధారపడి వుంటుంది."

"నీకిష్టం లేదా?"

"ఉహుఁ! హోదా కోసం తప్పితే ఏం నేర్చుకు వస్తున్నారు. టెక్నికల్ సైడు వారు వెడితే కాస్త ప్రయోగాత్మక విద్య నేర్చుకుంటారు. వాదం ఎందుకు. చెప్పానుగా. అది కొంతమందికి ఇష్టం అని."

"అది నిజమే. మా ఉమకు చాలా సరదా బయట రిసర్చి చేయాలని."

"మంచి అభిలాషే"



"డాక్టర్లూ, ఇంజనీర్లూ యెందరో తమంతట తాము ముందుకు వస్తున్నారు. కాని..."

"మీ కభ్యంతరమా!"

"అలాంటిదే అనుకో. ఇద్దరూ ఒకే ప్రొఫెషన్‌లో ఉంటే బావుంటుందని. ఇద్దరూ కలిసి అమెరికా వెడతారు."

"నా స్టూడెంట్స్ చాలా మంది ఇలాంటి అవకాశాల కోసం చూస్తున్నారు. చెప్పేదా?"

నేనేనంటే నాకంటే పదిరెట్లు ఎక్కువ చదివాడే ఈ ప్రొఫెసర్ కుర్రాడు అనుకున్నాడు లింగమూర్తి. అతని పెదాలపై చిరుహాసం మెరిసింది.

ఇతను అతి తెలివి చూపబోతున్నాడు అనుకున్నాడు మన్మోహన్. అటువైపు స్త్రీలు అసహనంగా వీరి సంభాషణ వింటూ, ఉబుసుపోకకు అన్నట్టు ఏదో మాట్లాడుతున్నారు.

"అది కాదోయ్! అమ్మాయికి నీవంటే విపరీతమైన అబిమానము. అందుకే..."

"నేను అలాంటి దృష్టితో ఆమె నెప్పుడూ చూడలేదు."

"మంచిదేగా. ఇప్పుడేం పోయింది. మా కాలంలో ఇలాంటివి అన్నీ ఎక్కడ! పెళ్ళి కుదిర్చాను అని నాన్న రాస్తే వెళ్ళాను. అఫ్‌కోర్స్, ఇంతవరకు మా మధ్యలో భేదాభిప్రాయాలు రాలేదు." అతను భార్యవైపు చూచి సాభిప్రాయంగా నవ్వాడు. మన్మోహన్ ఇబ్బందిగా కదిలాడు.

"పెళ్ళి చేసుకుని ప్రేమించుకోండి."

"క్షమించండి. ఉమకు మరో సంబంధం చూడండి." తను చెప్పేది ఏం లేనట్టు లేచాడు.

"మా అంతట మేం అడిగామనా?" ఈసారి అతని ముఖం జేవురించింది.

"లింగమూర్తిగారూ! మన సమాజంలో ఇంకా కన్యాదాతలే అడిగే కాలం, అందులో అసహజం లేదు. అవమానం అంతకంటే కాదు. వివాహం వ్యాపారం కాదు. నా కిష్టం లేదని చెబితే మీకు కోపం రావాల్సిన పని లేదు."

"ఇదంతా... బెట్టులే." అతను లేచి ఇంట్లో వారితో చెప్పకుండా
భార్యను వెంటబెట్టుకుని వెళ్ళిపోయాడు.

"ఇదేం సభ్యతరా!" తల్లి ముక్కుమీద వేలుంచుకుంది.

"చూశావుగా! వాళ్ళమ్మాయిని ఎవరో ప్రేమించారట. పిల్లలు చెడిపోవడానికి సగం కారణం తల్లితండ్రులేనమ్మా! ఆయన డబ్బుకు అమ్ముడయి పోతాననుకున్నాడు మహాపురుషుడు."

"వాళ్ళ సంగతిక వదిలేద్దాం. అన్నయ్యా, మా ఊరు ఒకసారి రా. మా చిన్న మామగారి కూతురుంది. చాలా మంచి అమ్మాయి. బి.ఇడి. చేసి టీచరుగా పనిచేస్తోంది."

"సరే" అన్నాడు చెల్లెలి మాట తీసెయ్యలేక. అరుణ బాధపడటం చూడలేడు.

"సరే అంటే కాదు, రేపు నావెంట రావాలి."

"మరి బావను తీసుకు రావద్దూ, నా పని చేసేవాడు."

భర్త పేరు వింటూనే ఆమె ముఖం యెర్రగా కందిపోయింది.

"సెలవు ఇవ్వరా?"

"వస్తాను కదమ్మా వెళ్ళి ఒక కప్పు టీ తీసుకు రా." అరుణ టీ తెచ్చి యిద్దరికీ ఇచ్చింది.

"నీకేది?"

"నేనిప్పుడంతగా త్రాగటం లేదు."

"బావగారి సావాస దోషమా?" చెల్లెలి జడ పట్టి ఊపాడు.

"ఛ... అదేం కాదు."

"ఏయ్ నా ముఖం చూచి ఆ మాటను." చెల్లెలి గడ్డం పైకి ఎత్తాడు. ఈసారి అతని కళ్ళల్లో కొంటెతనం మాయం అయింది.

"నాకు చాలా సంతోషంగా ఉందమ్మా. ఒకరి ఆశయాలను, ఒకరు గౌరవించడంలోనే సుఖం ఉందమ్మా! ఒకరి కోసం, ఒకరు చిన్న చిన్న త్యాగాలు చేసుకోవాలి." అన్నాడు మృదువుగా, ఆమె చెయ్యి నొక్కుతూ.



"ఫో..." సిగ్గుతో తల్లి దగ్గరకు పారిపోయింది. అక్కడ తన అత్తగారింట్లో పద్ధతులు చెబుతూ కూర్చుంది. ఆడపిల్లల తీరే అంత. ఒకసారి పెళ్ళి అయితే అత్తగారి సోది అనుకుని నవ్వుకున్నాడు.

"అరూ! మీ చిన్నమామగారి కూతురు అందంగా ఉంటుందా?" తల్లి అడుగుతోంది.

"బాగానే ఉంటుందమ్మా."

"నీకు తెలుసుగా. చక్కగా జోడీ కుదిరితే చాలు."

"అన్నయ్యకు జోడి చక్కగా కుదరాలంటే, ఒకే ఒకమ్మాయి ఉందమ్మా! కాని వాడికి, ఆ అమ్మాయికి ప్రతి విషయంలో వ్యతిరేకమే. అదికాక చాలా గర్విష్టి."

"ఎవరమ్మా అంత చక్కని జోడి?"

అతను కూడా కుతూహలంగా చెవులు నిక్కబొడిచాడు.

"మన సునంద ఆడబడుచు."

"ఎవరూ! ఆ పిల్లేనా పంట్లాంలు తొడిగి, వెంట్రుకలు కత్తిరించు కుంటుంది" అడిగింది.

"అవునమ్మా! అలాంటి పైత్యాలు లేకపోతే నిజంగా యెన్న తగిన రూపం..."

మన్మోహన్ హృదయం అతి మధురంగా స్పందించసాగింది. 'అరుణ నిజంగా నా చెల్లెలు కదూ' అనుకున్నాడు.

"ఎంత చక్కని రూపమయినా, ఎన్ని వేలు కట్నం ఇచ్చినా ఆ పిల్లను యెవడు భరిస్తాడే. యెంత పొగరని..."

"అందుకే కదమ్మా తగదని అంటోంది."

ఒకసారి జీన్స్ వేసుకుని తన జులపాలను తిప్పే పొగరు మోతు రూపం, మరోసారి పొందికయిన దుస్తులతో, ఏదో పోగొట్టుకున్నట్టు చూచే మరో రూపం ప్రత్యక్ష్యం అయింది. మారిన ప్రశాంతిని చూడలేదు అరుణ అనుకున్నాడు. ఎందుకో మళ్ళీ గంభీరంగా తిరుగుతుంది అనుకున్నాడు. ప్రశాంతి సుందరరూపం కళ్ళముందు తిరగసాగింది. తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నాడు.

# 15

ప్రణతికి భర్త తత్వం ఏమిటో బొత్తిగా అర్థం కావటం లేదు ఒకోసారి అక్క అన్న మాటలు నిజమేనేమో. ఇంపాలాకారు చూసి మోసపోయింది. ఇల్లు కడుతున్నాం అన్న పేరుతో డబ్బును ప్రాణంకన్నా ఎక్కువగా చూస్తాడు. సరదాగా నల్గురినీ పిలుచుకుని గడిపిన రోజులు బహుతక్కువ.

"ప్రణూ?"

ఆలోచన వదలి వెళ్ళింది. అతను ఆఫీసునుండి వచ్చి బూట్లు విప్పుకుంటున్నాడు.

"కాఫీ తీసుకురానా?" రోజా అడగాలి. యెక్కడయినా స్నేహితుల దగ్గర త్రాగివస్తే, ఇంటి దగ్గర తీసుకోడు.

"అక్కర లేదు. తాజ్‌లో మీ సారధి మామయ్య త్రాగించాడు."

"సారధి వచ్చాడా?"

"వారం రోజులలో పెళ్ళి ఉంటే పెళ్ళికొడుకెలా రాడు?" అతను క్రిందిపెదవు బిగపట్టి నవ్వాడు.

"అమ్మమ్మ వాళ్ళంతా వచ్చారా?"

"మాకేం తెలియదు. అతను రాత్రికి వస్తాడు అడుగు."

"ఇక్కడికి వస్తానన్నాడా?"

"నేనే భోజనానికి రమ్మని పిలిచాను. కాబోయే తోటి అల్లుడు కదా" అన్నాడు. ప్రణతి వంట ప్రయత్నంలో పడింది. సారధి సాగర్‌లా కాదు. అతనికి రుచులు తెలుసు. తన శక్తినంతా వినియోగించి వంటచేయాలని నిర్ణయించుకుంది. ఎవరినీ భోజనానికి కాదుకదా కనీసం టీకి కూడా పిలువని సాగర్ అతన్ని పిలిచాడంటే విశేషమే అనుకుంది.

"ఇదిగో ప్రణూ! నాల్గురకాల వంటకాలంటూ హైరానా పడకు క్లుప్తంగా కానిచ్చెయి."

"అలాగే." అంది. సారధితో సాగర్ మాట్లాడే తీరు చూసి ఆ రాత్రి ఆశ్చర్యపోయింది.



"మీ మేనకోడలు వంటశ్రీ, అండి బాబు. ఈ మాత్రం వంటకే యెంత అలసిపోయిందో." సాగర్ మాట విని తెల్లపోయింది.

"మరి వంటమనిషిని పెట్టండి. ఏం ప్రణతీ, మీ ఆయన్ని అడగలేదూ." అన్నం కలుపుతూ అన్నాడు సారధి.

"మీ ప్రణతికి ఊరికే కూర్చుంటే లావు అవుతానని భయం."

భోజనాలు ముగిశాయి. మేం కాసేపు కబుర్లు చెప్పుకుంటాము. నువ్వు అలసిపోయావు నిద్రపో."

ప్రణతికి తెలుసు, ఇక తను వారిమాటలు వినకూడదని. వెళ్ళి పడుకుంటే యెంతకూ నిద్రరాదు. నెమ్మదిగా లేచి వచ్చింది. అతి మెల్లగా మాట్లాడుకుంటున్నారు.

"మీ విశాల హృదయాన్ని అభినందించక తప్పదు సారధీ!"

"ఏ విషయములో?"

"ఈ వివాహ విషయంలో!"

ఆ మాటవిని ప్రణతి రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

"నేను చూపే విశాలత ఏముంది. తనకిష్టం కాలేదు వద్దు అన్నది, మళ్ళీ ఇష్టపడింది. ప్రశాంతికి గారాబం వల్ల ఆలోచనాదృష్టి తక్కువ..." అతను అసంతృప్తిగా నవ్వాడు.

"అది కాదు నేను అనేది..."

"ఏది?"

"మీ అక్కగాని, వేణుగాని ఏం చెప్పలేదా?"

"ఊహుఁ..."

"అయితే నేనెందుకు బయటపడాలి? పోనివ్వండి మరేదయినా మాట్లాడదాం."

"లేదు. విషయమేమిటో పూర్తిగా చెప్పండి."

"తెలుసుకోక పోవటమే మంచిది."

"లేదు సాగర్, తెలుసుకోవటమే మంచిది."

"మీ ప్రశాంతి పాపం తెలిసో తెలియకో ఎవరినో ప్రేమించింది. అతను మోసం చేశాడు."

"నేను నమ్మను."

"నేనూ నమ్మలేదండి. కాని ఒక స్నేహితుడు రుజువులు చూపించాడు. నమ్మక తప్పలేదు. మీ వాళ్ళందరికీ తెలుసు. నా బాధల్లో ఇంత సన్నిహితులయిన మీకు చెప్పలేదే అని."

"సాగర్... ఇదంతా అబద్ధం అని చెప్పు" సారథి ముఖం పాలిపోయింది.

"అబద్ధమే అనుకొని ఆ విషయం మరిచిపోండి."

"సాగర్! నువ్వు నమ్మవా? ప్రశాంతిలో అమాయకతతో కూడిన అహంభావం తప్ప..."

"నేను ఒకరోజు మీకంటే పదిరెట్లు బాధపడ్డాను. పురుషుల నీడను అసహ్యించుకునే స్త్రీ ఇలా చేస్తుందా అని పరి పరి విధాలుగా ఆలోచించాను. కాని... కాని ఆమె స్వయంగా నాతో చెప్పి తన జీవితం కాపాడితే జీవితాంతం రుణపడి ఉంటానన్నది."

"నిజమా సాగర్..."

"అబద్ధం... ఇదంతా అబద్ధం..." ప్రణతి శక్తిలా వచ్చింది.

"ప్రణూ!"

"ప్రణు చచ్చిపోయింది. మామయ్యా! ఇదంతా అబద్ధం. ఆయన మాటలు నమ్మొద్దు." ఏడుస్తూ అర్థించింది.

"నా మతిపోతుంది ప్రణూ! మళ్ళీ కలుస్తాను." సారథి వెళ్ళిపోయాడు.

"ఛీ... ఛీ.. మీరు మనుషులా! శ్రీధర్ తలకు విషం ఎక్కించింది మీరేకదూ!"

"నిజం చెప్పాను."

"నూరు అబద్ధాలాడి ఓ పెళ్ళి చెయ్యమంటారు. నిజం చెప్పమని ఎవరన్నారు?"



"ప్రణూ! నూరు కాదు వెయ్యి అబద్ధాలు ఆడి నా పిల్లల పెళ్ళిళ్ళు చేస్తాను. మీ అక్క పెళ్ళితో నాకేం జరుగుతుంది?"

"పెళ్ళి చెడగొట్టే అధికారం మాత్రం మీకు యెక్కడిది?" అన్నది వెక్కుతూ.

"కాబోయే భర్త సారధికి మంచీ చెడూ తెలుస్తాయి."

"కాదు. ఈ పెళ్ళి ఆగిపోతుంది."

"పోనీ. ఇలాంటి విషయాలు విని చేసుకునే సహృదయుడే వస్తాడు."

"అలా యెవరూ ముందుకు రాకపోతే దాని గతి ఏమిటి."

"'అక్క మొగుడే దిక్కు' అన్న సామెతలా... చెల్లెలి మొగుడే దిక్కు. నువ్వేం భయపడకు, మీ అక్కమెడలో తాళికట్టి కన్నెచెర వదిలిస్తాను."

"ఏమిటి మీరంటుంది."

"అక్కమీద ఆ మాత్రం జాలి చూపలేవా?"

"సిగ్గులేదూ? మీరిలా జీవితాలతో ఆటలాడుకుంటారా? నిజం చెప్పండి... లేకపోతే నేను ఇక్కడే తల పగలగొట్టుకుంటాను."

"ఏం చెప్పాలి?"

"మీరు మా అక్కను గూర్చి కల్పించిన కథ అంతా ఒట్టిదే కదూ?"

"కాదు."

"కాదూ?" అతన్ని పరీక్షగా చూసింది. ఆ కళ్ళల్లో ఇదివరకెప్పుడూ చూడని నిరసన భావం కన్పించింది.

"మీరు నిజం చెప్పరు కదూ?" వెంటనే తల నేలకేసి బాదుకుంది. "మీరు నిజం చెప్పి రుజువులు చూపించకపోతే ఇక్కడే... ఇక్కడే ప్రాణం వదులుతాను."

"ప్రణూ..." అతను వచ్చి ఆమె భుజాలు గట్టిగా పట్టుకున్నాడు. "ఏమిటా వెర్రి?"

"వెర్రికాదు... మీరు నిజం చెప్పే వరకూ.." ఆవేశంతో మాటలు రావటం లేదు.

అతన్ని విదిలించేసింది. గోడకు తల ఎడా పెడా బాదుకుంది. "చెప్పండి, నా ప్రాణం పోకముందు ఒక్కసారి నిజం చెప్పండి."

ఆమెను బలవంతంగా పట్టుకుని గదిలోకి తీసుకు వెళ్ళి మంచంమీద కూలేశాడు. ఆమె ముఖం ఎర్రబడింది. ఆవేశంతో నరాలు ఉబ్బి పచ్చగా పైకి తేలాయి. అన్నంతపనీ చేస్తుందని నిశ్చయంగా తెలుసు.

"విను.... నేను చెప్పిన కథ అంతా అబద్ధం. మీ వాళ్ళంత మూర్ఖులు మరొకరు లేరు. నమ్మారు."

"ఏమన్నారు..." లేచింది. అతని గుండెల దగ్గర షర్టు గుప్పెట్లో బిగించింది. "యెందుకు చేశారు? మా అక్క మీకేం అపకారం చేసింది? చెప్పండి... చెప్పండి" ఆవేశం ఏడ్పులోకి మారింది.

"మీ అక్క...... నన్నూ నా ప్రేమనూ అవమానించింది. తృణీకరించింది. ప్రతీకారం చేశాను. పగ తీర్చుకున్నాను. ఎవడు వద్దన్నా నా దగ్గరకే వస్తుందని తెలుసు. 'యువ్వనం అడవి కాచిన వెన్నెల కాదు' నిన్ను వివాహం చేసుకుంది ఇష్టపడి కాదు. మీ అక్కకు దగ్గరగా ఉండాలని, ఆమె జీవితం నాశనం చెయ్యాలని. నిజం చెప్పాను. చాలా!"

"దాని మీద ప్రతీకారమా?" ప్రణతి మతిపోసాగింది. భర్త అక్కను సాధించే నెపంతో తనను పెళ్ళిచేసుకున్నాడా! యెంత దారుణం. అతని షర్టు వదిలింది. ఆవేశం చల్లారింది. ఆవేదన మిగిలింది. వెళ్ళి మంచంమీద పడి వెక్కి వెక్కి ఏడ్చింది. ఈ రోజు తన సంతోష వార్త చెప్పాలనుకుంది. తన ప్రేమ ఫలితమని మురిసిపోయిన... విషయము కామ ఫలితం అయింది. అన్నింటికన్నా అతను తనను ప్రేమించలేదన్నమాట హృదయంలో గునపం దించింది. అలాగే జీవచ్ఛవంలా పడి రోదించసాగింది. విద్యాసాగర్ ఆమె దగ్గరకు పోవటానికి సాహసించలేదు. అతను నెమ్మదిగా ఓ పక్కకు పడుకున్నాడు. బట్టలయినా మార్చుకోలేదు.

"నన్నెందుకు మోసం చేశారు.! మీరు విద్యావంతులు. విదేశాలు వెళ్ళి వచ్చారు. ఇదేనా మీరు నేర్చుకుంది." వెక్కిళ్ళ మధ్య అస్పష్టంగా అన్నది "ప్రాణ స్నేహితుల్లా ఉండే అక్కా చెల్లెండ్లం ఒకరి నీడ ఒకరం సహించలేని పరిస్థితికి వచ్చాం." అలా అర్ధరాత్రి వరకూ ఏడుస్తూనే వుంది. అతను మౌనంగా అటూ ఇటూ దొర్లసాగేడు.



# 16

రాత్రి నుండి ఒకటే ఆలోచన. యెవరిని అడగాలి. ఎలా అడగాలి. మధ్యాహ్నము షాపింగ్‌కు వెళ్ళాలని ప్రశాంతిని ఇంటి దగ్గరే ఉంచారు. నిజానిజాలు తెలిసేవరకు తనెక్కడికీ వెళ్ళడు సారధి. ఆ విషయం ఎలా చెప్పాలి! అందరూ ఫలహారానికి కూర్చున్నారు.

"ఒంట్లో బావుండలేదా సారధీ?" రఘుపతి ప్రశ్నించాడు.

"ఊఁ..."

"అదేమిటి నాకు చెప్పకూడదూ? డాక్టరుకు ఫోను చేస్తాను." వేణు లేచాడు.

"అంత ప్రమాదకరమైన రోగం ఏం కాదులే' పొడిగా అన్నాడు సారధి. ప్రశాంతి నోట్లో పెట్టుకోబోయె ఇడ్లీముక్క ఆపి, అతని వంక పరీక్షగా చూసింది. అతని కళ్ళల్లో అనుమానపు తెరలు చూడగానే ఆమెకు స్పష్టంగా సంగతేమిటో అర్థం అయింది.

"మామయ్యా?"

అనుకోని ఈ పిలుపుకు ఉలిక్కిపడ్డాడు. తలెత్తి ప్రశాంతి వంక చూడలేకపోయాడు.

"మీరు రాత్రి ప్రణు దగ్గర భోజనం చేశారు కదూ!"

"అవును."

"అన్నయ్యా! మామయ్య ముభావం అర్థం అయింది."

"నీ ముఖం నోరు మూసుకో" తల్లి కసిరింది. అదేం లెక్కచేయలేదు.

"ఏం మామయ్యా! సారధి నా ప్రేమకథ నీ చెవిన కూడా వేశాడా?" కోపం, నవ్వూ రెండూ వస్తున్నాయి.

"చేసేవారు సిగ్గులేక ప్రేమకలాపాలు చెయ్యగా లేంది, చెప్పేవారు చెబితే తప్పా?" అతను అసహ్యంగా చూశాడు.

"మాటలు తిన్నగా రావటం అందరికీ శ్రేయస్కరం" అతని వంక చూచింది. "నీ తప్పేం లేదు. ఆడవాళ్ళ వెంటపడి వెర్రివేషాలు వేసే మొగ

వారంటేనే అసహ్యంగా ఉండేది. ఇప్పుడలా కాదు. అసలు మొగజాతి మీదే అసహ్యంగా ఉంది. చిన్నప్పటి నుండి నన్ను, నా స్వభావం ఎరిగిన నాన్నగారు, అన్నయ్య సాగర్ మాటలు నమ్మారు. మీరెంత? సరే ఒకే ఒక ప్రశ్న. నాకు ప్రేమ కలాపాలు, మొగవారిని పూసుకు తిరగటం తెలియదు. ఒకే ఒక వ్యక్తిని దూరంనుండే ఆరాధించాను. మా ఇద్దరి స్వభావాలు పూర్తిగా విరుద్ధం. అంతస్తులు, అన్నీ వేరే. అందరి మొగవారిలా ఆడదానికోసం వెంటబడే స్వభావం కాదు అతనిది. నా కోసం ఆయన ఆశయాలు వదులుకోరు. ఆయనకోసం..."

"శాంతీ!" కాంతమ్మ ముందుకు వచ్చింది.

"అమ్మా! ఇది నా జీవిత సమస్య. నా భర్త చెప్పుడు మాటలకు చెవులు అరువిచ్చేటంతటి బలహీనుడు కాకూడదు. చెప్పుడుమాటలు వినటం కూడా త్రాగుడు, జూదం కంటే తక్కువేం కాదు. త్రాగుడు వల్ల తనే చెడిపోతాడు. ఈ చెప్పుడు మాటలు వినేవారు తన చుట్టూ ఉన్న వారి జీవితాలను నాశనం చేస్తారు."

"శాంతీ! ఆపు నీ ప్రేలాపన." వేణు అరిచాడు.

"ఆపను. ఈ రోజు అటో ఇటో తేల్చుకుంటాను." అన్నది దృఢంగా. "విను మామయ్యా! అంతకంటే నాకేం తెలియదు. నేను చెప్పేది నమ్ముతావా?"

"నమ్మేటంతవరకు."

"యెంతవరకో చెప్పు. వివాహానికి పూర్వమే ముఖాముఖిగా మాట్లాడుకోవాలి."

"ఇప్పటికి మాట్లాడింది చాలు." కాంతమ్మ కోపంగా అన్నది.

"అమ్మా! కొద్దిసేపు ఊరుకుంటావా." తీవ్రంగా అడిగింది.

"జవాబు చెప్పు మామయ్యా!"

"అతను అబద్ధం ఎందుకు చెబుతాడు?"

"అతను చెప్పింది నిజమా, అబద్ధమా అని నేను అడగటం లేదు. నీకు నా మీద నమ్మకం ఉందా, లేదా అని."

"శాంతీ! డొంకతిరుగుడు నాకిష్టం లేదు. నేను ఈ వివాహానికి ఇష్టపడటం లేదు."



"థాంక్స్! ఇప్పటికయినా మొగవాడిలా మాట్లాడావు. చాలా ధన్యవాదాలు." వెటకారంగా అన్నదో, సంతోషంగా అన్నదో అతనికి అర్థం కాలేదు.

"సారధీ, నువ్వాగు. ఏమిటే నీ తలబిరుసు" చెయ్యెత్తింది కాంతమ్మ. ఆ చెయ్యి అలాగే పట్టుకుంది ప్రశాంతి.

"నువ్వు తల్లివి. నేను నీ బిడ్డను. కొట్టే, తిట్టే అధికారం ఉన్నాయి. నా బాధల్లా ఒకటే. అనవసరంగా మీ అధికారం దుర్వినియోగం చేస్తున్నారని. నన్ను నమ్మని ఇంట్లో ఉండటము నాదే బుద్ధి తక్కువ." అన్నది నిదానంగా.

"చూచారా ఈ మాటలు! పోవే... పో. ఎక్కడికి వెడతావో వెళ్ళు" మెడమీద చెయ్యేసి నెట్టింది.

"కాంతం! ఏమిటా ఆవేశం. ప్రశాంతీ, నీవు హద్దు మీరుతున్నావ్." రఘుపతి గర్జించాడు.

"మీరెంత గారాబం చేసినా, నా ప్రవర్తన మీ పట్ల యెప్పుడూ సక్రమంగానే ఉంది. మీరే... మీరే నన్ను రెచ్చగొడుతున్నారు. నాపై నమ్మకం లేని ఇంట్లో నాకు స్థానం లేదని తెలుసు. గుడ్‌బై." రెండడుగులు ముందుకు వేసింది.

"కట్టి గదిలో పడేస్తాను, స్టుపిడ్" వేణు పట్టుకున్నాడు. అతన్ని విదిలించింది.

"నాకు మైనారిటీ తీరిపోయింది. మీరు నన్ను సాధిస్తున్నారని కేసు పెడతాను."

"శాంతీ!" సునంద కళ్ళమ్మట నీరూరింది. ఆమె చప్పున సునంద దగ్గరకు వెళ్ళింది.

"వదినా! ఈ ఇంట్లో నన్ను నమ్మింది, ప్రణు వివాహము అయిన దగ్గరనుండి నా బాగోగులు కనుక్కుంది నువ్వే. అది జీవితాంతం మరచి పోలేను. ఒక స్నేహితురాలిగా గుర్తు పెట్టుకో."

"శాంతీ! నా మాట విను, తొందరపడకు" ఆగి...

"వదినా! నాదే తొందర అంటున్నావా."

కాంతమ్మకు మతిపోతోంది. తను ప్రేమగా పెంచిన కూతురు యెన్ని మాటలంటోంది? వెళ్ళి ఎక్కడ ఉంటుంది. పొగరు కాకపోతే! "సునందా! వెళితే వెళ్ళనీ. నాకేం అభ్యంతరం లేదు. నాకు ఒక కూతురే అనుకుంటాను. నువ్వు బ్రతిమాలటము దేనికి?"

"అత్తయ్యా!"

"నువ్వు లోపలికి పో" భార్యను గద్దించాడు వేణు. "గుర్తుంచుకో శాంతీ, ఒకసారి బయటికి వెడితే మళ్ళీ ఈ ఇంట్లో నీకు స్థానం లేదు."

"మంచిది." అని వెళ్ళిపోయింది. అందరూ తెల్లబోయి చూస్తూ నిలబడ్డారు.

"ఏమండీ! అదేం అఘాయిత్యం చేస్తుందో!" ఏడుపు గొంతుతో భర్త భుజం కుదిపింది సునంద.

"పోనియ్యి. రోజంతా మాడితే దానికే బుద్ధి వస్తుంది."

వారలా నిలబడి ఉండగానే తన బ్యాగు తీసుకుని సారథి వెళ్ళిపోయాడు.

అందరి ముఖాలు అవమానంతో కుంచించుకుపోయాయి. రెండు సార్లు పెళ్ళిప్రయత్నాలు చేశారు, రెండూ విఫలమయిపోయాయి. రేపు అందరిలో ముఖం ఎత్తుకు ఎలా తిరుగుతారు?

"ఆడపిల్లలకు తెలివి రాకముందే పెళ్ళిచేయాలి కాంతం." రఘుపతి కళ్ళు ఒత్తుకున్నాడు.

"అదే సమయంలో ప్రణతి వచ్చింది. ఆమెను చూసి అందరూ ఖంగారు పడ్డారు. రేగిన జుట్టు, పది లంఖణాలు చేసినట్టున్న ముఖం, నలిగిన చీర, బాధగా ఉన్నట్టు తెలిపే కళ్ళు.

"ప్రణూ!" తల్లి ముందుకు వచ్చింది.

"అమ్మా! శాంతి ఏది?"

"నీ ఆరోగ్యం బావుండలేదా తల్లీ? ఆ పాపిష్టిది ఇప్పుడెందుకు." కూతుర్ని పొదివి పట్టుకుంది.



"లేదమ్మా! అలా అనకు. నేను... నేను మోసపోయాను. మిమ్మల్ని నమ్మించడమేగాక నేనూ నమ్మాను. ఆయన అబద్ధం చెప్పారమ్మా! అక్క పెళ్ళి చెడగొట్టాలని...." నీరసంగా తల వాల్చింది.

"ప్రణూ!" వేణు వచ్చి మరోవైపు పట్టుకున్నాడు.

"నాన్నగారూ! డాక్టరుకు ఫోను చెయ్యండి." ఆమెను యెత్తి మంచంలో పడుకోబెట్టాడు. నుదురంతా కమిలి పోయింది.

"ఏం జరిగిందమ్మా?" వేణు మృదువుగా అడిగాడు. ఆయాస పడుతూ జరిగింది చెప్పింది. అందరూ చుట్టూ చేరారు. అక్కడ చేరిన పనివారు వింతగా చూడటం మొదలుపెట్టారు. వేణు అందరినీ కసిరాడు. యెవరి పనులలోకి వారు వెళ్ళిపోయారు.

రఘుపతి తల పట్టుకుని కూర్చున్నాడు. కాంతమ్మ నమ్మలేనట్టు చూడసాగింది.

"అన్నయ్యా! నాకు బ్రతకాలని లేదు. రాత్రే చచ్చి పోయేదాన్ని. అక్కయ్య సంగతి మీకు చెప్పాలని... దిండులో అశాంతిగా తల రాస్తూ ఏడవసాగింది.

"ఛ... ఛ ఊరుకో. ఇప్పుడేం జరిగిందని..." వేణు ఓదార్చాడు.

"ఏం జరగలేదా? ఇంకా నయం తొందరగా మేలుకున్నాం. అక్కయ్య జీవితం నాశనమయ్యేది."

"నువ్వు డాక్టరు వచ్చేవరకు నోరుమూసుకో."

"ఒక్కసారి అక్కను పిలువు."

"అలాగే, అది యూనివర్శిటీకి వెళ్ళింది. అమ్మా, నువ్వు చిన్న దగ్గర వుండు. నేను శాంతిని తీసుకువస్తాను." అతను గబగబా బయటికి వెళ్ళిపోయాడు.

కాంతమ్మ కన్నీరు ఒత్తుకుంటుండగా డాక్టరు వచ్చాడు. అక్కడి వాతావరణం చూసి అతను మరోవిధంగా అర్థం చేసుకున్నాడు.

"ఈ రోజులలో యువతీ, యువకులలో సహనము పోయింది. మీ అల్లుడు విద్యావంతుడు. ఇలా కొట్టాడేమిటి?" అతను దూదితో నుదురు

చిట్లిన భాగాలు అద్దుతూ అడిగాడు. అందరూ తెల్లబోయారు. ఉన్న సంగతి మాత్రం ఎలా చెబుతారు? అందుకే విననట్టే ఊర్కున్నారు. అతని పరీక్షలు అతను ముగించాడు.

"ఆఁ! నెల తప్పినట్టు అనుమానంగా వుంది. సాయంత్రం మిసెస్ నాయర్ దగ్గరకు తీసుకు వెళ్ళండి." రఘుపతి, కాంతమ్మ అంత విచారంలోను సంతోషించారు. ప్రణతి ముఖం పక్కకు తిప్పుకుంది.

"ఏమ్మా! మీ ఆయనపై కోపమా! ఈ వార్తవింటే తన ప్రవర్తనకు క్షమాపణ కోరుకుంటాడో లేదో చూడు."

"ఇంజెక్షన్ ఇస్తాను, వేడిగా పాలు ఇవ్వండి. పెద్దగా భయపడాల్సిందేం లేదు."

"డాక్టర్! నాకు చచ్చిపోవాలనివుంది."

"నిజమా! అయితే ఈ మందు వేసుకుని పడుకో." అతను హాస్యంగా అన్నాడు. డాక్టర్ని పంపి వచ్చాడు రఘుపతి.

"సునందా..."

"ఆఁ... పాలు తెస్తున్నాను అత్తయ్యా"

"నాకేం వద్దమ్మా. నాకేం వద్దు" పిచ్చి దానిలా ఏడవసాగింది ప్రణతి.

## 17

క్లాసు బయటికి వచ్చాడు మన్మోహన్. తల్లి ఆస్పత్రిలో వుంది. వెళ్ళి పండ్లు ఇచ్చి రావాలి అనుకున్నాడు. ఇంతలో లైబ్రరీలో వుండే సూరి ఓ చీటీ తెచ్చి ఇచ్చాడు. అది చూచుకోగానే అతని ముఖంపై చిరు దరహాసం వెలిగింది. దాని వెనుకే మరో వాక్యం రాసిచ్చాడు.

బస్సు అందుకుని ఆస్పత్రి చేరేసరికి పన్నెండయింది. విజిటింగ్ టైమ్ కాదు. అక్కడున్న కావలి అతనికి నచ్చచెప్పి లోపలికి వెళ్ళాడు. పళ్ళు ఒలిచి తినిపించేసరికి రెండయింది. డాక్టర్ రిపోర్ట్ చూచాక అతని హృదయం కంపించిపోయింది. అతను అధైర్యపడే వ్యక్తి కాదు. అందుకే ముఖం ప్రసన్నంగా మార్చుకున్నాడు.



"ఏం రాశారురా?"

"ఏం లేదమ్మా! ఇంకా కొన్నాళ్ళు ఇక్కడే ఉండాలట."

"వారేం రాసినా నాకేం భయంలేదురా! నిన్ను ఒంటరిగా వదిలిపోతానన్న భయం తప్పితే..." అన్నది నవ్వుతూ.

"ఈ సాయంత్రం ఓ అమ్మాయిని చూపుతాను. నీకు నచ్చితే వివాహం చేసుకుంటాను."

"నిజం. తొందరగా వెళ్ళి తీసుకురా." అతను తల్లిని వదిలి మళ్ళీ యూనివర్శిటీ క్యాంపస్‌కు వచ్చాడు. లాండ్‌స్కేప్ గార్డెన్స్‌లో ప్రశాంతి ఎదురు చూస్తుందని తెలుసు. అప్పుడు వాతావరణం చాలా నిశబ్దంగా వుంది. ఓ చెట్టుక్రింద మోకాలిపై తలాన్చి కూర్చుందామె. ముఖం వాడిపోయింది.

"ప్రశాంతీ..."

అతని రెండు చేతులు పట్టుకుంది. ఆ చేతులను కళ్ళముందుంచుకుంది.

"మోహన్! నీకోసం అన్నీ వదులుకుని వచ్చేశాను." అన్నది. బేలతనం యెరుగని ఆమె కంఠం జీరబోయింది. కళ్ళు సజలమయ్యాయి.

"ఏమిటిది ప్రశాంతీ, ఏం జరిగింది?" ప్రక్కనే కూర్చుని ఆమె ముఖం తన కభిముఖంగా తిప్పుకున్నాడు. కమిలినట్టున్నది.

"ఎప్పుడొచ్చావ్ యిక్కడికి?"

"ఉదయం తొమ్మిదిన్నరనుండి మీకోసం యెదురు చూస్తున్నాను." జరిగిన విషయం క్లుప్తంగా చెప్పింది.

"మైగాడ్!" అతను అదిరిపడ్డాడు. "లే మొదట"

"ఎందుకు?"

"ఈ క్షణం నుండి నేను చెప్పినట్టు వినాలి." అతని చేయి ఆసరాగా తీసుకుని లేచింది. అతను కాంటీన్ వైపు దారి తీశాడు. అతను తెప్పించినవన్నీ వద్దనక తీసుకుంది.

"హల్లో ప్రశాంతీ! మీ అన్నగారు నీకోసం రెండు సార్లు వచ్చారు. నువ్వు యెక్కడున్నావ్? రాలేదని చెప్పాను." క్లాసుమేట్ చెప్పాడు.

"యిక్కడే ఉన్నాను. క్షేమంగా వున్నాను." అతను వెళ్ళిపోయాడు.

"ఎంత అమాయకురాలివి. అంతసేపు అలా కూర్చుంటారా?"

"మరేం చెయ్యను. నా హృదయం మొద్దుబారి పోయిందా క్షణంలో" అన్నది తేలికగా నిట్టూరుస్తూ.

"త్వరగా వెళ్ళి ముఖం కడుక్కుని రా. వెంటనే యూనివర్శిటీ హాస్టల్లో క్షేమంగా వున్నట్టు మీ ఇంటికి ఫోన్ చేయి."

"హాస్టలా!

"మరి ఇలాగా రావటం మా ఇంటికి," అతను నవ్వాడు. ఇద్దరూ బయటికి వచ్చారు.

"ప్రశాంతీ!"

"చెప్పండి."

"మరోసారి ఆలోచించు."

"ఆ పని మీ వంతు. నా వంతు ఆలోచన అయిపోయింది."

అతను నవ్వాడు. ఆనందంగా అతను చెప్పినట్టు ఇంటికి ఫోన్ చేసింది. ఆమె ఆశించినట్టే సునంద ఎత్తింది.

"వదినా! చెప్పాల్సినవేగాని వినాల్సినవి ఏం లేవు. నా గురించి వెతుకుతున్నారని తెలిసి వచ్చాను ఫోన్ చేయటానికి. మన జీవితాలు బజార్లో పడవద్దని హాస్టల్లో క్షేమంగా ఉన్నాను." ఆమె చెప్పేది వినకుండానే ఫోన్ పెట్టేసింది.

"తరువాత!"

"అమ్మకు నిన్ని సాయంత్రం తెచ్చి చూపుతానని మాటిచ్చాను. అక్కడికి వెళ్ళివచ్చాక హాస్టల్‌కి వెడదాం."

అతనికి తెలిసినవారి అమ్మాయి ఉమెన్స్ హాస్టల్లో ఉంది. ఆమెకు గెస్టుగా రెండు, మూడురోజులుంచే ఏర్పాటు చేశాడు.

"ప్రశాంతీ!"

"ఊఁ..." అన్నది.

"నేను... నిన్ను గెలుచుకుంటానని కలలోకూడా అనుకోలేదు."

"... ..."



"మాట్లాడవే?"

"దారమ్మట ఏం మాట్లాడాలి?" అన్నది సంతోషాన్ని బలవంతంగా అదిమి పడుతూ. ఆస్పత్రిలో అడుగుపెడుతుండగా ఒక్కసారి కారు చెడిపోయిన నాటి సంఘటన గుర్తుకు వచ్చింది. అతని తల్లి ఏమంటుందో! ఆమె భయపడింది. అది గ్రహించిన అతను భయం లేదన్నట్టు నవ్వాడు. ప్రశాంతి ఊహే నిజమయింది. ఆవిడ కళ్ళు పెద్దవిచేసి చూడసాగింది. కాబోయే కోడలు నమస్కరించగా యాంత్రికంగా ప్రతి నమస్కారం చేసింది. ఆస్పత్రిలో ఉన్న వారిని యెలా మాట్లాడించాలో తెలియదు. ఆమె చూపులు యెదుర్కోలేక తల వంచుకుంది. స్పెషల్ వార్డు కావటం మూలాన చిన్న స్టూల్సు ఉన్నాయి.

"కూర్చో ప్రశాంతీ!" అన్నాడు.

"ఈ అమ్మాయి సునంద ఆడబడుచు కాదూ..." కొడుకు ఆమెను ఎన్నుకోవటంలో తప్పు లేదనిపించింది. మత్తెక్కించే అందం, మైమరపించే సోయగం. పది నిమిషాలు నిశబ్దంగా గడిచాయి.

"అమ్మాయ్! ఈ ఆ గ్లాసుకడిగి మంచినీళ్ళు తెస్తావా."

గ్లాసు తీసుకుని బాత్‌రూమ్ వైపు వెళ్ళింది.

"బాగా ఆలోచించావా నాయనా!"

"ఆలోచించాకే ఈ నిర్ణయానికి వచ్చాను."

"అలా అయితే మంచిదే. జీవితాంతం ఆ అమ్మాయితో ఉండేది నువ్వు. పొరపడ్డాం అన్న భావన వచ్చిన నాడు ఆ జీవితం నరకమే అవుతుంది."

"అలాంటి క్షణం రాదమ్మా."

"సంతోషమేగా. నాదేముంది. నేను ఇంకా కొన్ని రోజులు బ్రతకవచ్చు."

"అమ్మా!"

"ఏం, యెందుకా ఆవేదన. పండుటాకు రాలిపోక తప్పదు. మూత్రపిండం తీసెయాలన్నట్టు వారి మాటలనుబట్టి తెలిసింది."

"తీసేస్తే తప్పక నయం అవుతుందమ్మా."

"చెప్పానుగా యెటయినా సంతోషమేనని" ప్రశాంతి మంచినీళ్ళు తేవటంతో ఇద్దరూ మౌనం వహించారు. ఆమె త్రాగింది.

"ఇలా నా దగ్గరగా రామ్మా"

ప్రశాంతి వెళ్ళి మంచం చివర కూర్చుంది.

"అన్నీ పోయాయి. ఈ ఒక్కటీ మిగిలింది. కాబోయే కోడలికని ఉంచాను. సమయము చేసే చాతుర్యము మనకు తెలియదు. ఏఏ క్షణంలో ఏమవుతుందో" తన మెడలో ఉన్న రెండు పేటల గొలుసు తీసి ప్రశాంతి మెడలో వేసింది. అది మరుపురాని సంఘటనగా ప్రశాంతి హృదయంలో నిలిచిపోయింది.

"కోరి బీదరికాన్ని వరిస్తున్నావ్. అదే ఉత్సాహంతో కష్టాలు యెదుర్కోవాలి" ఒక్క మాట రాలేదు. తలాడించింది.

"ఇక వెళ్ళండి. నేను విశ్రాంతి తీసుకోవాలి." ఆమె వద్దన్నా వినకుండా మన్మోహన్ పళ్ళు ఒలిచి పెట్టాడు. పెద్ద వారు ఏదయినా బహుమతి ఇస్తే పాదాభివందనం చేయాలని చిన్నగా ఇంగ్లీషులో చెప్పాడు.

"ఐ యామ్ సారీ!" అన్నది చిరునవ్వుతో లేచి మునివేళ్ళతో ఆమె పాదాలు ముట్టుకుంది.

"ఏరా! ఆ అమ్మాయిని ఆజ్ఞాపించగలవని తెలుసు. ఇప్పుడే చూపాలా?" నవ్వుతూ ప్రశాంతిని దగ్గరగా లాక్కుని నుదురు ముద్దు పెట్టుకుంది.

"మరి కొన్ని మర్యాదలు నేర్పవచ్చా.." అతను కొంటెగా చూచాడు. మరో పది నిమిషాలుండి వచ్చేశారు. వచ్చేముందు తల్లి వైపు చూచాడు. నిశ్చింతగా, తృప్తిగా కళ్ళు మూసుకుందామె. అతను రిక్షా పిలిచాడు.

"నాకు రిక్షాలో యెక్కాలంటే ప్రాణం గిల గిలలాడి పోతుంది."

"అది నిజమే. మనము వద్దు అంటే వాడి పొట్ట కొట్టిన వారం అవుతాము."

"అదీ నిజమే." ఇద్దరూ రిక్షా యెక్కారు. అతని స్పర్శ ఏదో లోకాలకు తీసుకుపోతోంది.

"మౌనము వహించావేం?"

"మీరు విమానం లేకుండానే మేఘాలపైకి విహారానికి తీసుకు వెడుతున్నారు"



"నిజమా?" ఇద్దరూ నవ్వుకున్నారు.

అతను ఆలోచనలో పడిపోయాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు!"

"రేపు నిన్ను చూచి అరుణ తెల్లబోతుంది."

"జడుసుకుంటుందేమో, మా అన్నగారి చెంపల గతేమిటా అని."

"చెంపలు నాజూకయినా చేతులు మొరటు అని తెలుసు. నువ్వంటే చాలా ఇష్టం తనకి."

"కోతలు."

"నిజం! నువ్వీరోజు మంచి సత్యం కనిపెట్టావు. నేను కోతలు కూడా కోస్తానని" ఇద్దరూ హాస్టల్ చేరారు.

"నువ్వీ రాత్రికి నిశ్చింతగా ఉండు. రేపు ఉదయం బట్టలు తీసుకుని వస్తాను. మొదట రిజిస్ట్రారాఫీసుకు, తరువాత అమ్మదగ్గరకు వెడదాం."

అప్పుడే మీ ఇంటికి అంటే కోపగించుకుంటుందని, ఆ మాట చెప్పలేదు. ఆమె చేయి మృదువుగా నొక్కి వదిలాడు. ఆమె కపోలాలు ఎర్రబడటం గమనించి నవ్వుకున్నాడు.

స్త్రీ, పురుషుల మధ్య మధురమైన ఆకర్షణ ఉన్ననాడే మనుగడ కందం, జీవితానందం. కామవాంఛ నిత్యనూతనత్వాన్ని కోరుతూ జీవితాన్ని అశాంతిమయం చేస్తుంది. దూరంగా గేటు దగ్గరకు వచ్చి మెడతిప్పి చూచాడు. ఇంకా అక్కడే నిలబడి ఉంది. పొమ్మన్నట్లు చెయ్యూపి అతను వెళ్ళిపోయాడు. హాస్టల్ కెళ్ళింది. మన్మోహన్ పరిచయం చేసిన అమ్మాయి పేరు వత్సల. ఆమె భోజనానికి తీసుకువెళ్ళింది. కడుపు నిండినట్టు అన్పించింది.

"మీరేం తినలేదు."

"యెందుకో ఆకలి లేదు."

ఇద్దరూ వచ్చి పక్కమీద కూర్చున్నారు. బుద్ధెరిగిన దగ్గరనుండి చీరతో పడుకోలేదు. నవ్వుకుంది. గేటు దగ్గర ఉండే అతను ఓ చీటీ తెచ్చాడు. వత్సలను, ప్రశాంతిని రమ్మని వార్డెన్ రాసింది. ఇద్దరూ వెళ్ళారు. రఘుపతి, కాంతమ్మ వేణు ఆదుర్దాగా చూస్తున్నారు.

"ఈ రాత్రికి ఇక్కడ ఉంటానని చెప్పి రాలేదా అమ్మాయ్!" వార్డెన్ అడిగింది.

"చెప్పనిది అడ్రెసెలా తెలుస్తుంది?" నవ్వింది.

"పెద్దతల్లీ..." కాంతమ్మ కంట నీరు పెట్టుకుంది.

"అన్నయ్యా..." కొంచెందూరంగా వెళ్ళింది. వేణు అనుసరించాడు.

"ఇక్కడ పెద్ద షో చెయ్యొద్దు. దయచేసి వెళ్ళిపొండి. రేపు నేనే మీ ఇంట్లో అడుగుపెట్టే అర్హత సంపాదించుకుని వస్తాను."

"శాంతీ! నీ విషయంలో పొరపాటు..." అతని మాటలు మధ్యలోనే త్రుంచింది.

"రేపు అన్నీ మాట్లాడుకుందాం. దయచేసి ఇప్పుడేం వద్దన్నయ్యా!" అన్నది వెనుతిరుగుతూ.

"ఈ డబ్బయినా ఉంచుకో."

"ఈ ఒక్క రాత్రి గడుస్తుంది." అసహాయంగా తిరిగి వచ్చాడు వేణు.

"పదమ్మా! చెల్లాయి రేపు వస్తుంది." అతనేం మాట్లాడక కార్లో కూర్చున్నాడు. వాళ్ళు కూతురివంక ఒకసారి చూచి వెళ్ళిపోయారు.

## 18

తెల్లవారి వస్తానన్న మన్మోహన్ పన్నెండు అయినా రాలేదు. ప్రశాంతికేం తోచలేదు. జీవితంలో మొదటిసారి స్నానాదులు లేకుండా, మాసిన బట్టలతో ఉండటం. చికాకుగా ఉంది. ఏ చిన్న చప్పుడయినా అతనే అయి ఉంటాడని, ఎదురు వెళ్ళాలని ముందుకు వచ్చేది. క్లాసులు ముగించుకుని వత్సల వచ్చింది.

"మన్మోహన్ ఇంకా రాలేదా?"

"ఉహుఁ!"

"మీరు బట్టలు మార్చుకోండి. స్నానం చెయ్యాలనిపిస్తే చెయ్యండి. తరువాత ఫోన్ చేద్దాం" అన్నది వత్సల. వత్సల ఇచ్చిన బట్టలు తీసుకుని



బాత్‌రూమ్‌వైపు వెళ్ళింది. ఆ రోజు ఉదయం నుండి మబ్బుపట్టి మహా ఉక్కగా ఉంది. చల్లటినీటితో స్నానం చేయగానే చికాకంతా ఎగిరిపోయింది. వచ్చి భోజనం చేసి యూనివర్శిటీకి ఫోన్ చేశారు.

"అతను రాలేదంటున్నారు యెలా?" ఫోన్ పెట్టి ఆలోచిస్తూ నిల్చుంది. వత్సల క్లాసుకు టైమ్ అయిందని వెళ్ళి పోయింది. తను వెళ్ళాలి. అతన్ని చూడాలి. వెంటనే తయారయి మన్మోహన్ ఇంటికి వెళ్ళింది. ఇంటిముందు జనాన్ని చూచి ఏదో కీడును శంకించింది. భయపడుతూనే లోపలికి వెళ్ళింది. అక్కడి దృశ్యము చూచి రాయిలా నిలబడిపోయింది. నిన్న తనతో ఆప్యాయంగా మాట్లాడిన మన్మోహన్ తల్లి నిశ్చలంగా, ప్రశాంతంగా తనకీ లోకంలో ఏం పని లేదన్నట్టు నిద్రబోతోంది. అది దీర్ఘ నిద్ర అని తెలుసు. తలవైపు దీపం వెలుగుతుంది. ఒక ప్రక్కన అరుణ ఏడ్చి, ఏడ్చి అలసిపోయినట్టు కూర్చుంది. దూరంగా చాలా మంది స్త్రీలు కూర్చుని ఉన్నారు. వారిలో ఉమ కూడా ఉంది. ఆమె అరుణ దగ్గర కూర్చుంది. మరోవైపు కొందరు మొగవారు కూర్చున్నారు. వారిలో మన్మోహన్ కన్పించలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. వెళ్ళి ఉమ దగ్గర కూర్చుంది. అరుణ మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్చింది. ఉమ ఓదారుస్తోంది. తను అలాంటి విషయాలలో మూర్ఖురాలు. ఏం చేయాలో తెలియదు. మన్మోహన్ యెక్కడికి వెళ్ళినట్టు?

"నీకు యూనివర్శిటీలో తెలిసిందా?" ఉమ అడిగింది.

"ఊఁ" అన్నది.

"సార్! బయటికి ఏడ్వటం లేదు. చెల్లి ఏడ్పు చూడలేక వెనుకవైపు కూర్చున్నాడు. పాపం..." ఆమె ఏమేమో చెబుతోంది.

"యెప్పుడు పోయారు?"

"ఉదయమే అరుణను తీసుకుని ఆస్పత్రికి వెడితే డాక్టరు వీరిని అక్కడే ఉండమన్నారట. పదిగంటల ప్రాంతములో పోయింది."

"అరుణ భర్త రాలేదా?'

"ఇప్పుడే బయటకు వెళ్ళారు. బంధువులందరికి తెలియచేయాలి కదా!"

ఒక్కసారి మన్మోహన్‌ను చూడాలి. నేనున్నాను అని చెప్పాలి. అందరూ ఏమనుకుంటారు? అనుకుంటే అనుకోనీ. తను అతనికి కాబోయే అర్ధాంగి. పెద్దవారికి ముందే తెలుస్తుంది కాబోలు జరగబోయేది. అందుకే గొలుసు ఇచ్చి ఆశీర్వదించింది.

"అమ్మాయ్! నువ్వింకా ముట్టుకోలేదు గదా. లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చిస్తావూ?"

ఓ వృద్ధురాలు అడిగింది. ప్రశాంతి అదే అదను అనుకుని లోపలికి వెళ్ళింది. వెనుకవైపు వరండాలో చిన్న పడక కుర్చీలో చేరబడి కళ్ళు మూసుకున్నాడు.

"మోహన్!"

అతను కళ్ళు విప్పాడు. నిన్న కల కల లాడుతున్న కళ్ళు విచారంతో భారంగా ఉన్నాయి.

"అయామ్ సారీ..." అన్నది. ఆత్మీయులను చూడగానే కన్నీరు వస్తుంది కాబోలు.

"ఉమ ఫోన్ చేసిందా?" అతని గొంతు కొత్తగా విన్పించింది. చెయ్యలేదని చెప్పడం ఇష్టం లేదు. అతని దగ్గరగా వెళ్ళి అతని చేతిని పట్టుకుంది.

"నేను అమ్మను తెచ్చి ఇవ్వలేకపోయినా, అనురాగంతో ఆమెను మరిపింపగలనేమో, ప్రయత్నిస్తాను. నాకు యెలా ఓదార్చాలో తెలియదు. అరుణ చాలా అప్‌సెట్ అయింది."

"వస్తాను పద" అన్నాడు భారంగా. ఆమె మంచినీళ్ళు తీసుకుని బయటికి వచ్చింది. ఒక్కరొక్కరే బంధువులు రాసాగేరు. సునంద, ఆమె అక్క వచ్చాక ప్రశాంతికి ప్రాణం లేచి వచ్చింది.

ప్రశాంతిని అక్కడ చూడగానే సునందకు విషయం ఏమిటో అర్థం అయింది. 'ఈ పిల్ల వివాహానికి ఎన్ని ఆటంకాలు!' అని నిట్టూర్పు వదిలింది. మన్మోహన్ హాల్లోకి వచ్చి చెల్లిని దగ్గరగా తీసుకున్నాడు.

"అరూ? ఇక చాలు ఊరుకో! ఆవిడ ఉన్నన్ని రోజులు ఏం సుఖపడింది!" యెన్నో విధాలుగా ఓదార్చింది సునంద. ఆమె, అక్క వచ్చి



అరుణను పట్టుకున్నారు. ఆఖరు సారిగా అతను తల్లిపాదాలను కళ్ళకు అద్దుకుని, రెండు కన్నీటిబొట్లు రాల్చాడు.

రాత్రి అయింది దహన సంస్కారాలు పూర్తయ్యేసరికి. ఉమ, ప్రశాంతి అందరికీ కాఫీలు, టీలు కలిపి ఇస్తున్నారు. సునంద ఆడబడుచుతో ఒంటరిగా మాట్లాడాలంటే కుదరనే లేదు. భోజనాలు అయ్యాక చాలా మంది వెళ్ళిపోయారు. ఉమ, సునంద అలసి ఒకచోట నిద్రబోయారు. వేణు రేపు వస్తానని వెళ్ళిపోయాడు. చెల్లెలు అన్నం సరిగ్గా తినలేదు. పాలు ఇవ్వాలని మెల్లగా వంట ఇంటివైపు వెళ్ళాడు మన్మోహన్. అలవాటు లేక నేలమీద దొర్లుతూ కన్పించింది ప్రశాంతి.

"ఏం కావాలి?" లేచి అడిగింది.

"అరుణ చాలా నీరసంగా కన్పిస్తోంది. పాలు వెచ్చబెట్టుకు పోదామని వచ్చాను."

"నేను తీసుకు వస్తాను పదండి."

"నువ్వు భోజనం చేశావా ప్రశాంతీ?"

"ఊఁ." అన్నది వంట ఇంటివైపు వెడుతూ.

"విధి యెంత చిత్రమయిందో చూడు!" పేలవంగా నవ్వాడు. అపురూపంగా మా ఇంటికి తెచ్చుకోవాలనుకున్న నా కల ఎలా కరిగిపోయిందో, వచ్చిన మొదటి రోజే నేలపై నిదురపోతున్నావ్."

"అలాంటివి ఏం మనసులో పెట్టుకోవద్దు."

అతను ఓ నిట్టూర్పు వదిలి వెనుతిరిగి వెళ్ళిపోయాడు. పాలు తీసుకుని వెళ్ళింది గదిలోకి. అది వారి తల్లి గదిలా ఉంది. ఓ మంచం ఖాళీగా ఉంది. రెండవ మంచంలో అరుణ పడుకునివుంది. మంచం దగ్గర కుర్చీలో ఆమె భర్త పడుకుని ఉన్నాడు. మంచం చివర మన్మోహన్ కూర్చున్నాడు.

"పాలు త్రాగండి." మృదువుగా అన్నది అరుణతో. ఆమె పాలగ్లాసు అందుకుంటూ ఒకసారి నఖశిఖ పర్యంతం వీక్షించింది. ఆమె దృష్టి ప్రశాంతి మెడదగ్గర ఆగిపోయింది. మరు నిముషంలో తనను తాను సంబాళించు కుంది. కళ్ళు దించి పాలు త్రాగింది. ప్రశాంతి వెనకాల అతను వచ్చాడు.

"ప్రశాంతీ! నువ్వు క్రింద పడుకోలేవు. ఇదిగో నా గది. అక్కడ పడుకో." అతని గదిలో అడుగు పెడుతుంటే ఆమె హృదయస్పందన చెప్పనలవి కాదు. గదిలోకి వెళ్ళాక గుర్తొచ్చింది. అక్కడ రెండు బ్లాంకెట్లున్నాయి. ఒకటి తీసుకు వెళ్ళి ఇస్తే అతను క్రిందయినా పడుకోగలడని. అప్పటికే వర్షం ప్రారంభం అయిది. ఈదురుగాలి ఒంటిని చీల్చి వేస్తోంది. నెమ్మదిగా కిటికీ రెక్కలు వేసి బ్లాంకెటు తీసుకుని లోపలి గదిలోకి వెళ్ళింది. వారిమాటలు ఆమెను అక్కడే ఆపేశాయి.

"అరుణా! ఉదయం నీ మనసు స్థిమితపడ్డాక మాట్లాడుదాం."

"అన్నయ్యా! నేను బావున్నాను. నాకేమయింది? ఆమె నీడ కూడా నీ మీద పడరాదన్నయ్యా! యెంత నష్టజాతకురాలో చూడు. ఈ ఇంటి కోడలు అనుకున్నామో లేదో, అమ్మపోయింది." అరుణ ఏడుపు. అరుణ భర్తమాటలు వినిపించలేదు. మన్మోహన్ మెల్లగా ఏదో చెబుతున్నాడు.

"అన్నయ్యా! నువ్వు నాకు మిగిలిన ఒకే ఒక బంధానివి. అది కూడా లేకుండా చేయకు..." ఇక వినలేకపోయింది. బ్లాంకెటు చేతిలోంచి జారిపోయింది. ఒక్క అంగలో గది లోకి వచ్చింది. నిజమేనా అరుణ అన్న మాటలు! మన్మోహన్ కేమయినా అయితే, అది తను సహించగలదా! 'భగవంతుడా ఏమిటీ పరీక్ష!' జీవితంలో మొదటిసారిగా ఏడ్చింది. రాత్రంతా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది. మర్నాడు అందరికంటే ముందుగా మన్మోహనే లేచాడు. అతను ప్రశాంతి గదిలోకి తొంగిచూశాడు.

"నువ్వు లేచావా."

పడుకున్నదెప్పుడు? అలాగే అతన్ని చూస్తూ కూర్చుంది. ఇంకో సారయతే నలగని పడక చూచి ఆమె పడుకోలేదని గ్రహించేవాడే. అతని మనసుకూడా అల్లకల్లోలంగా ఉంది.

"ఏమిటి మాట్లాడవు?"

"నాకేమిటో ఈ వాతావరణం చూస్తే భయంగా ఉంది. మీ కభ్యంతరం లేకపోతే హాస్టల్ కెళ్ళిపోతాను."



"అలాగే. ఈ రోజు బంధువులు ఇంకా వస్తారు. లేని పోని మాటలు అడుగుతారు."

"ఇప్పుడే రిక్షా తీసుకుని వెడతాను, అందరూ లేస్తే బావుండదు."

"నీ ఇష్టం" లోపలికి వచ్చి డ్రాయరుతీసి యాభై రూపాయలు ఆమె ముందు పెట్టాడు.

"ఎందుకు, వద్దు."

"నా దగ్గర కూడా అభిమానమేనా? తీసుకో." బలవంతంగా ఆమె చేతిలో పెట్టాడు. మరేం మాటాడక తీసుకుంది.

తనకు కొన్నాళ్ళు డబ్బు కావాలి. కొంగు భుజాలపై కప్పుకుని బయటకు వచ్చింది. ఆమెకు చెప్పలేని ఆవేదన ఉండి వివశురాలిని చేయసాగింది.

"జాగ్రత్త ప్రశాంతీ! ఈ పదిరోజులు నేను తిరగటం పడదు. నీకు రావాలనిపించినప్పుడు రా" అన్నాడు. తెల్లవారటానికి అట్టే వ్యవధి లేదు. పక్షులు కిలకిలారావం వినిపిస్తోంది. ఇద్దరే ఉన్నారు. గుమ్మం అవతల ఆమె లోపల అతను. రెండు అడుగులు వేసి అకస్మాత్తుగా ముందుకువచ్చి అతని గుండెలో తల దాచుకుని బావురుమంది.

"ప్రశాంతీ! ఏమయింది, చెప్పు."

"ఏం లేదు, ఏం లేదు." అన్నది తనను తాను సంబాళించుకుంటూ. అతను మృదువుగా ఆమెను దూరం జరుపుతూ అనుమానంగా చూచాడు.

"వస్తాను."

ప్రశాంతి అందరి ఆడవారిలా కాదు. మాటి మాటికీ ఏడవదు. ఆమె వెళ్ళే దిక్కే చూస్తూ ఉండిపోయాడు. మరురోజు బంధువులతో మరీ సందడిగా గడిచిపోయింది. యెనిమిది గంటల ప్రాంతంలో సునంద అడిగింది ప్రశాంతిని గూర్చి. హాస్టల్ కెళ్ళిందని చెప్పాడు. 'ఏమి అలకో, ఏం యువతో' అనుకుని నవ్వుకుంది. ఆ తరువాత ప్రశాంతి రాలేదు. అతనికి తీరిక లభించలేదు. పది రోజులు పది నిముషాల్లా గడిచిపోయాయి.

"పాపం ఫార్మాలిటీస్ ఏం తెలియని పిచ్చిపిల్ల." అని యెన్నోసార్లు అనుకున్నాడు. సునంద ప్రశాంతి మనోహరుడెవరో భర్త చెవిలో ఊదేసిందప్పుడే. అతను నిశ్చింతగా నిట్టూర్చాడు.

"ఉమా"

"ఏమిటి సార్?"

"ఈ రోజు యూనివర్శిటీకి వెడుతున్నావా?"

"అవును."

"ప్రశాంతి కనిపిస్తే ఒకసారి రమ్మన్నానని చెప్పు."

"అలాగే." ఉమ ముఖం వంక చూస్తే మన్మోహన్ ఆ మాట చెప్పేవాడే కాదు. ఆమె విస విసా వెళ్ళిపోయింది. అతనా రోజంతా యెదురు చూస్తూనే ఉన్నాడు. ఒక్క రొక్కరే బంధువులు వెళ్ళిపోయారు. అరుణ భర్తతో మిగిలిపోయింది. కర్మలు అయ్యాక ఉండరాదని అందరూ అన్నా మన్మోహన్‌ని వంటరిగా వదిలిపోవటం ఇష్టం లేక ఆగిపోయారు.

## 19

ఉమ చెప్పిన వార్త విని అతను ఆశ్చర్యపోయాడు. ఆమె యూనివర్శిటీకే రావటం లేదట. తను వెళ్ళి ఆమెతో మాటాడేకంటే ముందు అరుణ మనసులో నాటుకుపోయిన భావము తొలగించి వేయాలి.

"అరుణా!"

"పిలిచావా అన్నయ్యా!" చేతులు తుడుచుకుంటూ వచ్చింది. "సాయంత్రం వెళ్ళి మళ్ళీ వస్తాను. కర్మలకు వచ్చి ఉండటం మంచిది కాదట."

"అరూ!" అతను నీరసంగా నవ్వాడు. "నువ్వు కూడా వీటన్నిటినీ నమ్ముతున్నావా?"

"నమ్మకం కాదన్నయ్యా, మనకు నష్టం కలగనప్పుడు అంగీకరిస్తేనేం!"

"నిజమేనమ్మా! నష్టం కలగనంత వరకు ఇలాంటివి పాటించాలి. అంటే నమ్మకం కలగజేసుకోవాలి. వాటిలో నమ్మకం ఏర్పడిన తరువాత, ప్రతి విషయాన్ని నమ్మకంగా పాటించాలి. పరవాలేదు మరో వారం రోజులుండి వెళ్ళవుగాని."

"మరి వారితో చెప్పు."

అరుణ భర్త సహృదయుడూ, మంచీ, చెడూ అంగీకరించే తెలివితేటలు గలవాడు. అతనుకూడా అక్కడికి వచ్చాడు.

"పోయిన వారితో పోము మనూ! నీ వివాహం చేసి వెడదాం అని అనుకుంటున్నాము." అతను తన అభిప్రాయం చెప్పాడు.

"నిజమే అన్నయ్యా! నేను పైకి ఏడుస్తున్నాను. నీవు లోపల బాదపడుతున్నావు. ఇన్ని రోజులలో ఒక్క రాత్రయినా నిద్ర పోయావా."

మన్మోహన్‌కు బాధగా ఉంది. ఏనాడూ చెల్లెలిని నొప్పించి యెరగడు. అదే విధంగా ఆమె భర్తతో కూడా అపురూపమయిన స్నేహం ఉంది. ప్రశాంతి విషయంలో వారిని వ్యతిరేకిస్తే జీవితాంతం అశాంతే. అటు ఆమెను వదులుకుని మరో స్త్రీకి తన జీవితంలో భాగం పంచి ఇవ్వలేడు. ఈ ఆకర్షణ ఏదో అనర్థాలకు దారి తీస్తుందని తెలిస్తే ఆ ఛాయలలో ఉండేవాడు కాదు. విచిత్రం, ఆమె అంటే ఉండే అసహ్యం, కోపం అనురాగంలోకి యెలా మారాయో! తను ఏం చేయాలి...

"మాట్లాడవేం అన్నయ్యా!"

"ఏం, యెందుకు?" అన్నాడు.

"నువ్వు పరధ్యాసలో ఉన్నావు. సాయంత్రం మేం ఇద్దరం సునంద దగ్గరకు వెడతాం."

"యెందుకు?"

"ప్రశాంతి విషయంలో మాట్లాడుదామని."

"అరుణా!"

"క్షమించన్నయ్యా! ఆరోజు మూర్ఖంగా ప్రవర్తించి నిన్ను బాధపెట్టాను. డాక్టరుగారు చెప్పారుగా. రెండు రోజులు యెక్కువ బ్రతికిందంటే మందుల ప్రభావం అని. దుఃఖంలో అలా అన్నాను."

"మంచిదే అరుణా! జీవితాంతం నన్ను బాధపడకుండా కాపాడావు. ఇద్దరిలో యెవరిని నొప్పించినా నాకు బాధే ఉండేది."

"మరెప్పుడు వెళ్ళాలి?"

"వారింటికి వెళ్ళనవసరం లేదు. ప్రశాంతి హాస్టల్లో ఉంటోంది." క్లుప్తంగా విషయాలు చెప్పాడు.

"నిజమా! మరి హాస్టల్‌కు వెడదాం పదండి." అరుణ లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుంటోంది. ఆమె భర్త కూడా వెళ్ళాడు. మన్మోహన్ లేవబోతుంటే ఉమ వచ్చింది. చేతిలో చిన్న డబ్బా పట్టుకుని వచ్చింది. దాన్ని చక్కగా ప్యాక్ చేశారు.

"నమస్తే సర్! నిన్న ప్రశాంతి యూనివర్శిటీకి వచ్చి ఈ పార్శిల్ మీకు అందజేయమంది. తను దూరం వెళ్ళిపోతున్నానని చెప్పింది."

"యెక్కడికి అని అడగలేదా?"

"అలాంటి వివరాలు ఆమెకు చెప్పే అలవాటుందా?" అతనిముందు పెట్టి పెట్టేసి వెళ్ళిపోయింది లోపలికి. అతను ప్రక్కనే ఉన్న బల్లమీది కత్తెర అందుకుని పార్శిల్ కోశాడు. అందులో తన తల్లి ప్రశాంతికిచ్చిన గొలుసు చూస్తూనే ఉలిక్కిపడ్డాడు. నీలం కాగితం బయటపడింది. ఆతృతగా విప్పాడు.

"మోహన్!

ఈ ఉత్తరం రాయాల్సి వచ్చినందుకు ఎంత బాధగా ఉందో మీకు తెలియదు. జీవితంలో మొదటిసారిగా బాధ అంటే ఏమిటో అర్ధం అవుతోంది. జీవితంలో ప్రతిక్షణం మారే సంగతులు చూస్తే విచిత్రంగా అన్పిస్తాయి.

ఆరోజు మీకు బ్లాంకెటు ఇవ్వాలని వచ్చి అప్రయత్నంగా అరుణ అన్నమాటలు విన్నాను. అంతవరకు నా స్వార్ధమే ఆలోచించాను. మంచి చెడులు ఆలోచించలేదు. నిజంగా నాది నష్టజాతకమే. అందుకే మిమ్మల్ని వదిలి పోతున్నాను. దూరంగా మనిద్దరి మధ్య ఉన్న అపురూపమైన ఈ అనురాగం నాలో సజీవంగా ఎప్పటికీ ఉంటుంది. మీకేనాడూ నా హృదయం విప్పి చెప్పలేదు. ఆడదాని వెంట పడి నీవే దిక్కని దేవిరించే మొగవారంటే నాకు మొదటినుండి చాలా అసహ్యము. దానికి రంగులు పూసి యెన్నో కథలు ప్రచారంలోకి తెచ్చారు. విద్యాసాగర్ గంగిరెద్దు వాటం చూస్తే అసహ్యం వేసింది. అందుకే అవమానించాను. అది పొరపాటే. ఒక సత్యం తెలిసిపోయింది. బీదరాలయినా, ధనవంతురాలయినా, విద్యావతి అయినా స్త్రీ కొన్నికట్టుబాట్లలో ఉండాలి. స్త్రీగా యెవరికీ లేని అదృష్టం నాకుందని మురిసిపోయాను. ఈ నాలుగు, అయిదు నెలలలో గడించిన అనుభవము జీవితాంతం గడించనేమో! ప్రేమ ఉన్నచోటే ద్వేషం ఉంటుందేమో. అమ్మా, నాన్నా, అన్నయ్యా రెండూ సమంగా చూపారు. మీ రూపం, వ్యక్తిత్వము నన్ను ఆకర్షించాయి. అందుకే అన్నీ వదిలి వచ్చేశాను. నే నెప్పుడూ దూరం ఆలోచించలేదు. అత్యంత ప్రియమైన మీకు నా రాకవల్ల ఏ అనర్ధం కల్గినా సహించలేను. అందుకే ఈ పది రోజులలో ఒక్కసారి కూడా రాలేదు. నాకు తెలుసు మీ సమక్షం నుండి పారిపోవటం అంత తేలిక కాదని, రాకుండా ఉండటానికి యెంత ప్రయత్నం చేశానో... మీరు అర్ధం చేసుకుంటారు. మర్నాడు అన్నయ్యా, నాన్నా వచ్చి చాలా బ్రతిమాలారు. విద్యాసాగర్ అసలు రూపం కనిపెట్టాం అన్నారు. నాకెందుకో జీవితం అంటే చెప్పలేని విరక్తి పుడుతోంది. ప్రేమానురాగాలన్నీ నటనే అని అరవాలనిపిస్తోంది. అందుకే వారికి నచ్చ చెప్పాను. దురదృష్టం ఏమంటే ఈ చిన్న ఉద్యోగము సంపాదించాలన్నా, నేను నేనుగా కాదు రఘుపతిగారి కూతురుగా సంపాదించాల్సి వచ్చింది. వికారాబాద్ దగ్గర చిన్న ఊరట. వెడుతున్నాను. నాకెవరి మీదా కోపం లేదు. అక్కడ చిన్న పిల్లల సమక్షంలో అన్నీ మరిచిపోతే నా జీవితంలో కోరుకునేది ఏమీ లేదు.

మీ అమ్మగారిచ్చిన గొలుసు తిరిగి పంపుతున్నాను. అది ఉంచుకునే అర్హత నాకు లేదు. ఒక విషయము. మీరు నమ్మినా, మానినా మీరే నాకు అత్యంత ఆప్తులు. అందుకే నాన్నగారు ఇస్తానని అన్నా వద్దని డబ్బు మీ దగ్గర తీసుకున్నాను. వివాహం తప్ప మీరు ఏది చేయమన్నా నిరాకరించను. నా శుభాకాంక్షలు యెప్పుడూ ఉంటాయి. నాకు చాలా గర్వంగా ఉంది. మీ అన్నా చెల్లెళ్ళ అనురాగంపట్ల, అది కలకాలం నిలవాలని నా ఆకాంక్ష. ఆమెను, ఆమె భర్తను అడిగానని చెప్పండి..."

"అన్నయ్యా! ఇంకా కూర్చున్నావే? తయారవు" అరుణ వచ్చింది.

"అవసరం లేదమ్మా!" తను చదువుతున్న ఉత్తరం అందించాడు.

"యెవరు రాశారు?"

"ప్రశాంతి!"

ఆదుర్దాగా అందుకుని చదువుతుండగానే ఆమె ముఖంలో రంగులు మారాయి. ఆమె భర్త కూడా భుజం మీదుగా వంగి చదివాడు.

"యెంతపని జరిగింది. ఇప్పుడే ఆ పల్లెకు పోదాం అన్నయ్యా!"

"వద్దు అరుణా! ప్రశాంతి సంగతి నీకు తెలియదు. ఒక నిర్ణయానికి వచ్చిందంటే మార్చుకోదు. మనము ప్రయత్నించినా లాభం ఉండదు" అన్నాడు. అతని ముఖకవళికలను బట్టి అతను బలవంతంగా బాధ దిగమింగుతున్నాడని తెలిసిపోతుంది.

"నేను ప్రయత్నిస్తాను అన్నయ్యా!"

"తల్లినీ, తండ్రినీ వదులుకుంది. అనవసరంగా నువ్వు చిన్నబుచ్చుకోవడం దేనికి."

"క్షమించన్నయ్యా!" దోషిలా తలవంచుకుంది అరుణ.

"నీ పొరపాటేముంది!" అన్నాడు.

"మరెలా."

"కొన్నాళ్ళు పోయాక చూద్దాం" అన్నాడు. ఆ రోజంతా అతను ఎవరితోనూ ఎక్కువ మాట్లాడలేదు. ఉమ అక్కడే ఉండి అరుణకు ప్రశాంతి గూర్చి ఉన్నవీ లేనివీ చెబుతోంది.

* * *

మర్నాడు అతను యూనివర్శిటీకి వెళ్ళిపోయాక ఉమ తల్లితండ్రులు వచ్చారు. అరుణతో చాలాసేపు మాట్లాడారు.

"అన్నయ్యా!"

"ఏమ్మా! బావకు పని ఉందటగా ఈ సాయంత్రం వెళ్ళండి." అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"అది కాదన్నయ్యా..." తటపటాయించింది.

"చెప్పమ్మా! సందేహం యెందుకు?"

"మిమ్మల్ని వదిలిపోవాలంటే బాధగా ఉంది అన్నయ్యా! ఉమకు మీతంటే చాలా ఇష్టం."



"ఆమెకేం తెలియదు. అమాయకత్వం."

"ప్రశాంతి నిర్ణయం మారదని చెప్పారు కద్దా, ఇక ఆశ పెట్టుకోవటం ఏం బావుంటుంది.?"

"తరువాత ఆలోచిద్దాం."

"లింగమూర్తిగారు వస్తామన్నారు."

"నేను ఉమను ఎప్పుడూ తోబుట్టువులా చూశానని చెప్పు." అని లేచాడు. "నువ్వు నిశ్చింతగా ఉండు అరుణా! నాకేం బాధ లేదు. అలాంటి తరుణం వస్తే నీ దగ్గరకు పరుగెత్తుకు వస్తాను." అని ఆమె కన్నీరు ఒత్తాడు. అరుణ వెళ్ళి తన బట్టలు సర్దుకోసాగింది. అతను లోపలికి వెళ్ళాడు. వెనుకవైపు వరండాలో కూర్చుని ఆలోచిస్తోంది ఉమ. ఆమె ఏడ్చిందనటానికి కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"ఉమా!"

"ఊఁ."

"కళ్ళు తుడుచుకుని అలా బయటికి రా. నీతో మాట్లాడాలి."

"ఏం అక్కరలేదు."

"చెబితే వినాలి మరి." అతను వెళ్ళాక, తటపటాయించి అతని వెనకాలే వెళ్ళింది.

## 20

"నువ్విలా మొండికేస్తే నేను ఇంత విషం తిని చస్తాను." కాంతమ్మ అరిచింది.

"నాకు ఆకలి లేదంటే వినరేం" ప్రణతి అంతకంటే కోపంగా అరిచింది. ఆమె ప్రతి పూట తల్లిని అరగంట విసిగించిగాని తినటం లేదు.

"ఈ బాధ యెవరికీ వద్దురా తండ్రీ." ఆమె ఏడుస్తూ అక్కడే కూలబడింది. "పిల్లలను యెంత ప్రేమగా పెంచాను. ఒకర్తె అలా వెళ్ళిపోయింది - ఇదిలా ప్రాణాలు తీస్తుంది."

సునంద వచ్చింది. నెమ్మదిగా అత్తగారితో ఏమో చెప్పి అవతలకు తీసుకు వెళ్ళింది. అయిదు నిమిషాలకు తను వచ్చింది.

"ప్రణతీ!"

"వదినా! నన్ను విసిగించకు. నాకు ఆకలి లేదు."

"నిన్ను నేను భోజనం చెయ్యమని అనలేదు. ఇందాక అన్నగారు ఫోన్ చేశారు."

"ఏ అన్నగారు?"

"విద్యాసాగర్..."

"ఇంకా చావలేదని చెప్పకూడదూ?"

"ఇంకా ఎంత టైముందని చెప్పను..." నవ్వును బిగబట్టి అడిగింది. ప్రణతి చురచుర చూసింది.

"నీకు తమాషాగా ఉందా?"

"మరింకేం అనాలి. అతను రేపు సాయంత్రం ప్లేన్‌లో అమెరికా వెడుతున్నాడట. నీతో అయిదు నిముషాలు మాట్లాడాలిట."

"నాకు అయిదు సెకెండ్లు కూడా మాట్లాడాలని లేదు."

"జరిగిందానికి అతను బాధపడుతున్నాడు."

"అవును. అతని బాధ్యత తీరిపోయింది. అందరి మూలంగా అడవులు పట్టిందే శాంతి దాని మాటేమిటి, దాని జీవితం బాగుపడేవరకు భగవంతుడు వచ్చినా సరే ఆయన ముఖం చూడను." అన్నది ఖచ్చితంగా.

"ఓసారి వెళ్ళి ఇతరుల జీవితాలతో ఆటలాడటం నేర్చుకు వచ్చాడు. ఇప్పుడేం నేర్చుకు వస్తాడట."

"మరిక్కడికి రమ్మంటాను. ఆ మాటే అడుగు."

"నీ రికమెండేషన్ అక్కరలేదు."

"పోనీ ఆ విషయం పోనీ, కార్తీక మాసంలో మీ అక్క వివాహం అవుతుంది నాకేం ఇస్తావు?"

ప్రణతి వదినను పరీక్షగా చూసింది. ఆమె తమాషా చేయటం లేదని తెలిసింది.

"ఎవరితో?"



"అదంతా రహస్యం. నువ్వు అప్పటివరకు ఉపవాసాలుంటే మాత్రం ఒప్పుకోను."

"నిజమా వదినా! మరి దాని పెళ్ళి కాకపోతే నిన్ను ఈ ఇంట్లోంచి తరిమేస్తాను."

"నన్ను తరిమేయడం యెందుకు? తమరే అమెరికా వెడతారు. ఇక పదమ్మా భోజనానికి."

ఇద్దరూ దిగివచ్చారు. సునంద నవ్వుతూ, నవ్విస్తూ వడ్డించసాగింది. కాంతమ్మ తేలికగా నిట్టూర్చింది. రాత్రి పడుకోబోయే ముందు వేణు గదిలోకి వచ్చాడు.

"ప్రణూ!"

"ఏమన్నయ్యా?"

"రేపు నీకిష్టం ఉన్నా, లేకపోయినా ఏరోడ్రోమ్‌కు వెళ్ళాలి."

"అన్నయ్యా!"

"ధనవంతులు సగం తమకోసం, మిగతాసగం హోదా, పరువు ప్రతిష్ఠల కోసం బ్రతుకుతారమ్మా. మనము ఎవరం వెళ్ళకపోతే అతని పరువేకాక మన పరువు పోతుంది. ఇంతవరకు నువ్వు అనారోగ్యంగా ఉన్నావనే తెలుసు. అటు ప్రశాంతిని గూర్చి ఆరాలు, జవాబులు చెప్పలేకపోతున్నాం. నాన్నగారు బయటికి వెళ్ళటమే మానేశారు."

"తప్పదా అన్నయ్యా?" ఆమె కళ్ళనిండుగా నీరూరింది. ఆనాడు శపథం చేసి వచ్చింది. మళ్ళీ అతని ముఖం చూడనంది. విధి యెంత బలీయమో.

"అతను జరిగిందానికి బాధపడుతున్నాడు."

"అలాగా" అన్నది ముఖం తిప్పుకుంటూ. వేణు నిట్టూర్చి వెళ్ళిపోయాడు. మర్నాడు తయారయి బలవంతంగా ఏరోడ్రోమ్‌కు వెళ్ళింది. తల్లితండ్రులు, అన్నా, వదినా అందరూ వచ్చారు. విజిటర్స్ లాంజ్‌లో అందరూ అప్పటికే వచ్చి కూర్చున్నారు. అందరినీ చూచాక రాత్రి అన్న చెప్పింది

నిజమేననిపించింది ప్రణతికి. అందరూ తమనుగూర్చి ఆరాలు తీసే వారేనేమో అనుకుంది.

"ప్రణూ!"

"ఇలా రా." అక్కడికి వెళ్ళింది. అక్కడ పుస్తకాలు, చిన్న చిన్న ఫాన్సీ సామాన్లు అమ్మే షాపు ఉంది. అక్కడ విద్యాసాగర్ కూడా ఉన్నాడు. అతన్ని చూచి వెనుతిరగబోయింది.

"ప్రణూ" వేణు కఠినంగా పిలిచాడు. ఆగక తప్పలేదు.

"సాగర్‌కు ఫ్యాన్సీ వస్తువులు సెలెక్ట్ చేయాలట. ఉండు. నేను డ్రింక్స్ తెస్తాను" అతను వెళ్ళిపోయాడు. అద్దం కిటికీ గుండా దూరంగా కన్పించే పచ్చిక చూస్తూ ఉండి పోయింది. గత రాత్రి వర్షం పడ్డందున ప్రకృతి ప్రశాంతంగా నిగనిగలాడినట్టుంది.

"ప్రణూ..."

"వద్దు, దయచేసి నన్ను అలా పిలవకండి."

"నవ్వు వద్దన్నా, మానినా అలవాటు అయింది. మానటం మాటలా. జరిగిందానికి హృదయపూర్వకంగా క్షమార్పణ కోరుతున్నాను. అలాగే ఓ ఉత్తరం ప్రశాంతికి రాశాను. నన్ను రెచ్చగొట్టింది ప్రశాంతి."

"నేను యెవరినీ ఏమీ సంజాయిషీ అడగటం లేదు. విరిగిన మనసు అతకదని తెలుసుకోవాలి" అన్నది ముభావంగా.

"అప్పుడే ఉద్దేశంతో వివాహం చేసుకున్నా ఇప్పుడు హృదయ పూర్వకంగా నిన్ను స్వీకరిస్తాను ప్రణతీ..."

"స్వీకరించటం మీకు తేలికే కావచ్చు, అంగీకరించటం నాకు సులభం అంటారా! నా యిల్లు, నా భర్త, నా వస్తువులు అంటూ ఎంత స్వార్థంగా ఆలోచించానో! యెంతగా పోట్లాడి, అమ్మానాన్నలతో వస్తువులు కొనిపించానో. తీయగా, మధురంగా, ఉన్నతంగా ఊహించిన సంసారం యెలా అయిందో తప్పు నాదంటారా?"

"నాదని అంగీకరిస్తున్నానుగా" అతను గాఢంగా నిట్టూర్చాడు. "నీక్కు రావాలనిపించిననాడు రాయి. అలాగే చెడు, మంచి ఏదయినా, నా



ఒక్కడివల్ల కాదని గ్రహించు. మనకు... మనకు..." ఆగిపోయాడు. చెప్పమన్నట్టు చూసింది.

"నేను చెప్పినా నీకు హాస్యంగా కన్పించవచ్చు' నీకు డెలివరి కాగానే... తెలుపుతావు కదూ?"

"ఊఁ" అన్నది, ఎటో చూస్తూ. అతను ఓ కాగితము ఆమె పర్సులో పెట్టాడు.

"దీంట్లో అడ్రసు ఉంది. నీ కిష్టమయినప్పుడు ఉత్తరము రాయి. నాకు చిన్నప్పుడే ఓ అలవాటయింది. డబ్బును జాగ్రత్తగా వాడటము. డబ్బుంటేనే గౌరవము."

"అవన్నీ నాకు అనవసరం."

"నాకు తెలుసు. నా బలహీనతలు చెబుతున్నాను. ఏ విధంగానైనా డబ్బు కూడబెట్టాలనేదే నా ఉద్దేశం. కొన్ని సార్లు మీ వాళ్ళ ఇంటినుండి డబ్బు తెస్తూ, అప్పుడప్పుడు బాధపడటం చూశాను. అది జాగ్రత్తే అనుకో, పిసినారి తనమే అనుకో. నీ ఇష్టం."

"జరిగింది ఏదీ ఆలోచించాలని లేదు."

"గతం మరిచిపోయేవారు, పిచ్చివారో లేక మహాయోగులో. గతం భవిష్యత్తులో ఋజుమార్గంలో నడవడానికి సహాయపడవచ్చు." అతను తదేకంగా చూచాడు. "ఇంటి అద్దెల రూపంలో అయిదువందలు వస్తుంది. కావాలంటే వాడుకో."

ఆ మాటలకు ప్రణతికి నవ్వు వచ్చింది. ఏం మాట్లాడలేదు.

"సాగర్, టైమ్ అయినట్టుంది." వేణు వచ్చాడు.

"పద వేణూ, నన్ను క్షమించి, స్నేహితుడిగా, నువ్వు నన్ను నమ్మావు. అది నిలబెట్టుకోలేదు."

"ఇప్పుడవన్నీ యెందుకు! ఆశకు అంతు యెక్కడ. రెండు సంవత్సరాలుండిరా" స్నేహితుని భుజం చరిచాడు. సాగర్ ప్లేన్ యెక్కి చెయ్యూపినపుడు అప్రయత్నంగా ఆమె కళ్ళు చెమర్చాయి. ఆరు నెలల దాంపత్య జీవితం, ఎలా తుడిచిపెట్టుకుపోతోంది. అతను అక్క కోసం తనను

ప్రేమించినా, తను అతన్ని విపరీతంగా ప్రేమించింది. ప్లేన్ దూరం అయ్యాక అందరూ కదిలారు. వారితో యాంత్రికంగా తనూ వచ్చింది. ఆరు నెలలో యెన్ని మార్పులు! ఇదే జీవితం కాబోలు. ఇంటికి వచ్చాక, భోజనాలు అయ్యాయి. వేణు, రఘుపతి ప్రణతితో చాలాసేపు మాట్లాడారు.

"స్త్రీ జీవితం గాజుపెంకు లాంటిదమ్మా! జాగ్రత్తగా కాపాడుకోవాలి. సాగర్‌ను క్షమించి ఉత్తరాలు రాయి."

"సాధ్యమంటారా నాన్నా?"

"యెందుకు సాధ్యం కాదు తల్లీ ! క్షమ, సహనము తోనే స్త్రీ పుట్టింది. నీ మనసును బట్టి ఉంటుంది."

"నా మనసు విరిగిపోయింది..."

"ప్రణూ! విరిగినా, తరిగినా అతనితో ఉండక తప్పదు" వేణు చెప్పాడు.

"యెందుకు? అందరూ కలసి స్త్రీలను అబలలుగా చేసి ఆడించినంతకాలం మొగవారి ఆటలు సాగుతూనే ఉంటాయి."

"పోనీ అతనికి విడాకులు ఇచ్చేయి."

"విడాకులా!" ఉలిక్కిపడింది.

"చూచావా! మీ చదువుకున్న వారితో ఇదే చిక్కమ్మా. ఇటు అధునాతనంగా ఆలోచించలేరు, అటు పురాతనంగా ఉండనూ లేదు. అటూ ఇటూ గాని భావాలతో సతమతమవుతూ ఏదో సాధించాలని, ఏదీ చేయలేరు."

"ఇంత లోతుగా ఆలోచించే మీరు శాంతికంత పెద్ద శిక్ష వేశారేం?"

"దురదృష్టం" అతను నిట్టూర్చాడు. "తలపై శని ఉన్నప్పుడు మనిషి విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతాడమ్మా. మేం అలాగే ప్రవర్తించాము" రఘుపతి బాధగా చెప్పాడు.

"గదిలో గాలి లేకపోతే నిదురపోని పిల్ల. ఆ రెండు గదులలో యెలా ఉందో! ఏం తింటుందో" కాంతమ్మ ఏడ్చింది.

"అది అలాంటి వాటిని లెక్క చెయ్యదమ్మా! ప్రశాంతి వ్యక్తిత్వంలో నాకేదో వెలితిగా కన్పించేది. ఈ సారి వస్తే ఆ లోటు పూర్తి అవుతుంది. విచారించవద్దు" వేణు ఓదార్చాడు.



అలా నల్గురూ కూర్చున్నప్పుడు ఒకరిని ఒకరు ఓదార్చుకోవడానికి యెన్నో మాట్లాడుకుంటారు.

రోజు రోజుకూ రఘుపతి కృంగిపోతున్నాడు. తను ఏం చేయబోతే ఏం అయింది. అన్ని పనులూ వదిలేశాడు. ఉదయం సాయంత్రం గీత చదువుతూ కూర్చుంటాడు. ప్రణతి తండ్రి స్థితికి జాలిపడి సంతోషంగా తిరిగినట్టు నటిస్తోంది. ఈ వాతావరణం నుండి పారిపోదాం అనిపిస్తోంది వేణు దంపతులకు.

## 21

ప్రశాంతికి నిజంగా గతం ఆలోచించే తీరికే ఉండదు. పదినుండి నాలుగు గంటల వరకూ బడిపిల్లలతో గోలగా గడిచి పోతుంది. ఆ తరువాత ఊరి వారితో కాలక్షేపం. అక్కడెవరికీ ఆమె విషయాలు తెలియవు. పొట్ట పోషించుకోవడానికి వచ్చిన యువతి.

"టీచరమ్మా... ఈ బిల్లేమిటో చూడు?"

"పంతులమ్మా... మా అమ్మాయికి ఉత్తరం ముక్క రాసి పెడతావు."

"టీచరక్కా! నీలా చక్కగా ఆది సరిపోయే జాకెట్టు కత్తిరించవూ."

అనే పిల్లలు. తనకు తెలియని యెన్నో విషయాలు వారి నుండి నేర్చుకుంది. వచ్చినాక వారం రోజులు హెడ్ మాష్టరింట్లోనే భోజనం చేసింది. ఆయనకున్న ఒక్క కూతురు యెక్కడో దూరాన ఉందట. అందుకే వదల లేదు. అతను వికారాబాద్ వెళ్ళినప్పుడు ఆమెకు కావాల్సిన సామాన్లు కొని తెచ్చాడు. వత్తుల స్టౌ యెంతకూ వెలిగించడం రాదు. నేలమీద కూర్చుని కాళ్ళు పీక్కు పోతున్నాయి. అగ్గిపెట్టె అయిపోయింది. 'ఛీ మనిషికి అన్ని పనులూ వచ్చి తీరాలి." అనుకుంది.

"నువ్వు లే అక్కా..." పది సంవత్సరాలు పూర్తిగా లేని సీతాలు వచ్చి నిమిషంలో స్టౌ వెలిగించి, అన్నానికి ఎన్ని బియ్యం పొయ్యాలో, నీరెంత పెట్టాలో చూపింది.

"నీకు వంటచేయడం వచ్చా?"

"ఓ... అన్నం వారుస్తాను, జొన్నరొట్టెలు, సాంబారు, అన్నీ వచ్చు."

రెండు గదులు ఊడ్చే సరికి నడుము నొప్పి పుట్టింది. నేల సరిగ్గా తుడవలేదని తనింట్లో పనిమనిషిని మాన్పించిన ఘట్టాలు గుర్తుకు వచ్చాయి. పిల్లలతో సరదాగా పనులన్నీ నేర్చుకుంటోంది. ఒకోసారి నవ్వుకునేది. వారికి తను గురువా, వారే తనకు గురువులా? తను ఏం నేర్పుతుంది? అంతకంటే విలువయిన జీవిత పాఠాలు నేర్పుతున్నారు.

"నీళ్ళు ఇలా తోడాలక్కా" ఒకమ్మాయి చూపిస్తే, "బట్టలు యిలా పిండాలని" రెండో అమ్మాయి చూపించేది. అక్కడుండే రాజకీయాలు అక్కడ ఉన్నాయి. వారిలో నిష్కల్మషం, నిరాడంబరత, నిస్వార్థం ఎంతో నచ్చింది. అవతలి మనిషికి తోచిన సాయం చేస్తారు. ఈ మధ్యే పెంచుకున్న పొడవు జుట్టు మరీ ఇబ్బందిగా తయారయింది. హెడ్ మాస్టారి భార్య తల రుద్దుతాననేది. 'ఛీ యెలా?'

"పరికిణీ వేసుకు కూర్చో. ఆ జుట్టంతా పీకిపెడతాను"

అలా ఆప్యాయతకు కళ్ళు చమర్చేవి. హెడ్‌మాస్టారింటి వసారాలోనే ఉండేది కాబట్టి పెద్దగా భయపడవల్సిందేం కనిపించలేదు. బయటికి వెళ్ళేది. ఇంటింటా సమస్యలే. అయినా వారు తృప్తిగా ఉన్నారు ఎందుకు? శ్రమజీవులకు గోరంతలు కొండంతలుగా చేసుకునే అలవాటే లేదు అందుకే కాబోలు.

"యెందుకు సీతాలూ పొన్నమ్మ ఏడుస్తోంది?"

"రాత్రి ఆమె మొగడు తాగివచ్చి కొట్టాడక్కయ్యా. అందుకే ఆ శోకాలు."

'పాపం' అనుకుంది. మర్నాడు ఇద్దరూ నవ్వుకుంటూ పొలాలకు వెడుతున్నారు. ఆశ్చర్యంగా చూచి ఆ మాటే అడిగితే, అక్కడి పిల్లలు అదేం వింత అన్నట్టు నవ్వుకున్నారు.

"మొగుడు, పెళ్ళాలు అన్నాక కొట్టుకోరా ఏం? అదే మనసులో పెట్టుకుంటారా జీవితాంతం" అక్కడే తోటపని చేసే లచ్చుమ్మ అంది. లచ్చుమ్మ కూడా ఓ గురువే.

"అది కాదు లచ్చుమ్మా! మర్నాడు మరిచిపోయే కాడికి అంతలా శోకాల్లు తీసిందేం."



"బాధ ఎలా పోతుందమ్మా. గట్లా ఏడ్వకపోతే మనసులో కుమిలిపోతే ఆరోగ్యంగా ఉంటారా?"

"నలుగురూ వింటే మర్యాదగా ఉంటుందా?"

"కొట్లాటలు, గొడవలు లేని సంసారం యెక్కడుంది తల్లీ." అని పని వదిలి ఆమెను రెండు నిమిషాలు చూచింది.

"వెన్నపూసలాంటి మనసు. మా మనుమడితో కొట్లాడవులే" అన్నది.

"మీ మనుమడా. అతనెవరు?" కంగారుగా అడిగింది. చెట్లకు నీళ్ళు పొయ్యటానికి సాయంగా వచ్చిన అమ్మాయిలు పక్కున నవ్వారు.

"అదికాదు అక్కా! మా కాబోయే బావగారు."

"అతనెవరు?" అందరూ మరోసారి నవ్వారు. ఈసారి సీత విడమరిచి చెబుతుంటే వారితో కలిసి, తనూ నవ్వింది.

"ఎక్కడ చచ్చావే! బడి బండలు అంటే ఇంట్లో చాకిరి నీ తాత నౌకరు ఎవడు చేస్తాడే!" ఓ మధ్యవయసు స్త్రీ వచ్చింది కేకలు వేస్తూ. ఆమె కూతురు ముత్యాలు బడిలో ఉంది.

"మీ అమ్మకు కోపం వచ్చింది వెళ్ళు ముత్యాలూ" బలవంతంగా పంపి ఇంట్లోకి వచ్చింది. హెడ్‌మాష్టర్ భార్య చెప్పే కబుర్లు విన్నది. ఆమె కెప్పుడూ కూతుర్ని గూర్చిన చింతే.

నవ్వుకుంది. అమ్మకూడా ఇలాగే ఆలోచిస్తుందా. పెద్ద వారితో ఇదే చిక్కు. యేదొచ్చినా ఆగలేరు.

"నాలుగు మెతుకులు ఇక్కడే తినెయ్యి. వంట ఏం చేస్తావు!"

"అలాగే తింటాను పెద్దమ్మా! నువ్వు నా జీతం తీసుకో."

"ఏం పిల్లవే" నవ్వుకుంది. ఇంట్లోకి వచ్చింది, ఒంటరిగా ఏం వండుకోవాలనిపించలేదు. పాలు త్రాగి పుస్తకం పట్టుకోగానే ముత్యాలు కన్పించింది. ఓ తట్టలో సీతాఫలం పండ్లు, రెండవచేత్తో రుద్రాక్ష పూలమాల పట్టుకుని నిల్చుంది.

"ఏం ముత్యాలూ! అమ్మ కోప్పడి పిలుచుకుపోతే మళ్ళీ వచ్చావా?"

"అక్కా! నీకు పూలు ఇవ్వాలని. ఈ గుడ్లు, పండ్లు చూడు తియ్యగా ఉంటాయి."

"నీ ప్రేమలా." నవ్వింది.

"ఫో" ఆ పిల్ల సిగ్గుపడింది.

"ముత్తెం! నేనంటే యెందుకింత అభిమానం."

"నువ్వు అందంగా ఉంటావు, మంచిదానివి..."

పక్కున నవ్వింది ప్రశాంతి. "నీ ఒక్కదాని నోట విన్నాను ఆ మాట."

"యెందుకు? కావాలంటే నేనూ అంటాను." ఉలికి పడింది. యెవరిదాకంఠము! తనకత్యంత ప్రియమైనది.

"మీరా..."

అతను ప్రశాంతినే చూస్తున్నాడు. చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్టు యెంతో అందంగా కన్పిస్తోంది. అక్కడ ముత్యాలు లేకపోతే రెండు చేతులతో యెత్తి గిర గిరా తిప్పేవాడు.

"ఎప్పుడు వచ్చారు?"

"నిముషం క్రితం." ప్రసన్నంగా చూచాడు.

"మీరు... మీరు..." మాట రావటం లేదు. అతన్ని చూచి నిగ్రహించుకోవటం యెంత కష్టమో తెలుసు.

"నేనే. యెలా ఉంది అజ్ఞాతవాసం."

"మీరు కనిపెట్టేశాక, ఇంకా యెక్కడ ఏడ్చింది." నవ్వుతూ జవాబు ఇచ్చింది.

"కూర్చోమంటావా, వద్దా?"

"ఎవరో వచ్చారట యెవరే అమ్మాయి?" హెడ్ మాస్టారు భార్య వచ్చింది. ఏం చెప్పాలో తెలియలేదు. ఆ క్షణంలో యెవరూ రావటం ఇష్టం లేదు. ముత్యాలు ఇద్దరిని మార్చి మార్చి చూస్తోంది. ఎవరందం ఎక్కువో వచ్చినతను ఎవరో గ్రహించింది ముత్యాలు. పల్లెటూరి అమ్మాయిలు అమాయకులేం కాదు. వెంటనే ఈ వార్త అందించటానికి పరుగెత్తుకు వెళ్ళిపోయింది.



"అలా చూస్తావేం ప్రశాంతీ?" తిరిగి ఆవిడ ప్రశ్నించింది.

"అది కాదు పెద్దమ్మా! మా వదిన అన్నగారీయన..." తడబాటుతో చెప్పింది. ఆవిడ ముత్యాలులాగే మార్చి మార్చి చూసింది. వెంటనే ఆవిడ పెదాలపై చిరునవ్వు వెలసింది.

"మంచినీళ్ళు ఇచ్చి మాట్లాడుతూ ఉండు. నేను వంట చేస్తాను. మీ మాష్టారుగారు రాలేదు. రాగానే అందరూ భోజనం చేద్దురుగాని."

వచ్చినంత వేగంగా ఆవిడ వెళ్ళిపోయింది. ప్రశాంతికి ఇంకా స్పృహ వచ్చినట్టు లేదు.

"ప్రశాంతీ!"

ఆమె హృదయం కొట్టుకోసాగింది. ఆ పిలుపులో అంత మధురత ఉందేం? అందరూ పిలుస్తారు కాని ఇతని పిలుపు అయస్కాంతంలా లాగుతోంది... మరుక్షణంలో అతని చేతులలో ఉండేదే. "దయచేసి నా అన్నను వదిలివేయి ప్రశాంతీ! నీ నష్టజాతకంతో మా అదృష్టాన్ని పరీక్షించకు." అని అరుణ కోటి గొంతుకలతో అరచినట్టు విన్పించింది. అక్కడే ఆగిపోయింది. ఆమె ప్రతి కదలిక గమనించే, మన్మోహన్ ముందుకు పరుగెత్తి ఆమెను పట్టుకున్నాడు.

"నా దగ్గరకు రావటానికి అంత సంకోచం యెందుకు?"

"మీకు తెలియదా?" ఆ క్షణం అలాగే, అతని చేతులలో ప్రాణం పోతే బావుండును అనిపించింది.

"అమ్మపోయిందన్న ఆవేశంలో అరుణ అన్నమాటలకు అంత విలువ ఇచ్చి వచ్చేస్తావా?"

"మీకు తెలియదు. నాది దురదృష్ట జాతకం."

"అలాగా..." అతను నవ్వుతూ ముందుకు వంగాడు. ఇద్దరూ ప్రపంచాన్నే మరచిపోయారు.

"ఏం పిల్లా, ఒక్కనాడన్నా సంబంధం నిశ్చయమయిందని చెప్పిందా..."

"నీ సొదేగాని యెదుటివారిని యెప్పుడు మాట్లాడనిస్తావే..." హెడ్‌మాష్టారు దంపతుల స్వరం దగ్గరయింది. అతను స్పృహలోకి వచ్చినట్టు

ఆమెను వదిలి తనలో రేగిన సంచలనం కనిపించకూడదని, మంచంమీద కూర్చుని, ముఖానికి పేపరు అడ్డుపెట్టుకున్నాడు.

"యెవరో వచ్చారటమ్మా?" ఆయన వచ్చాడు. ప్రశాంతి ఇరకాటంలో పడింది. ఒకే ఒక మంచం, అదీ హెడ్‌మాష్టారిచ్చిందే. ఆయన్ను యెలా కూర్చోపెట్టాలి.

"రండి మాష్టారూ... మోహన్, మా హెడ్‌మాష్టారు." పరిచయం చేసింది. అప్పుడే అతని రాక గమనించినట్టు అతను పేపరు పక్కన పెట్టి నమస్కరించాడు. అదే మంచంపై ఇద్దరూ కూర్చుని కబుర్లు మొదలుపెట్టారు.

"ఎక్కడ పని చేస్తున్నావు బాబూ."

"యూనివర్శిటీలో రీడర్‌గా చేస్తున్నాను."

"చాలా సంతోషం. మరి అమ్మాయిని ఈ మారుమూలకు పంపారేం?"

"అమ్మాయికి చదువు సంధ్యలున్నాయి. అనుభవం తక్కువ. దేశంలో ఇలాంటి పల్లెలుంటాయని ఊహించి ఉండదు. అనుభవం సంపాదించాలని పంపాము."

అతను హాస్యానికి అన్నా ఆ మాట తన పట్ల అక్షరాలా నిజం అనుకుని నవ్వుకుంది ప్రశాంతి.

"నిజమే నాయనా! ఇద్దరూ పెద్దవారు అయ్యారు. ఆలస్యము కూడదు." అని చెప్పాడు.

"కార్తీకంలోనే నండి పెళ్ళి. నాకు ముహూర్తాలు, బలాలు అని నమ్మకం లేకపోయినా పెద్దవారికి ఉంటాయి కదా!" ఇక ఆ సంభాషణ వినలేను అన్నట్టు ప్రశాంతి లోపలికి వెళ్ళిపోయింది. ఆమె సాయంతో మరో అరగంటలో వంట అయింది. అందరూ భోజనాలు చేశారు.

"మా అల్లుడూ, అమ్మాయీ దూరదేశంలో ఉంటారు బాబూ! ఈ రోజు మీరిలా ఉండి భోజనం చేస్తుంటే నా కెంత ఆనందంగా ఉందో." పెద్దావిడ తృప్తిగా అంది.



"ఇకనుండి మేం చిన్నకూతురు, చిన్న అల్లుడుగా ప్రతి పండక్కి వస్తాంలెండి."

"అంతకంటేనా?"

ప్రశాంతికి మన్మోహన్ మాటలు అంతులేని ఆవేదన అశాంతిని కలుగజేస్తున్నాయి. ఒక వంక హెడ్‌మాష్టారు దంపతుల అభిమానానికి ఆశ్చర్యపోతోంది. ధనం ఉన్నచోట దయాదాక్షిణ్యాలు, ప్రేమాదరణ ఎందుకు కొరవడతాయి?

"భోజనం పూర్తికానివ్వు, తరువాత ఆలోచిద్దువు" తలెత్తింది. మాష్టారుగారు లేచారు. అతను లేస్తున్నాడు. అతని ముఖంలో తృప్తి చూశాక మనసు కలుక్కుమంది. యే పరిస్థితులలోను తను అతన్ని వివాహం ఆడనని తెలిస్తే అతని స్థితి యెలా ఉంటుంది?

"అదేమిటమ్మాయి మజ్జిగ పోసుకోలేదు. రోజూ ఇదే తంతు. నాకేం తెలుసు, ఆమె మనసు మరోచోట ఉంటుందని."

"పో. పెద్దమ్మా నీకూ హాస్యంగా ఉంది."

"త్వరగా లేచి మీ వాటాలో కూర్చో. మొగవారిద్దరికి పక్క వేస్తాను."

ఇద్దరూ గదిలోకి వచ్చారు. ముత్యాలు తెచ్చిన సీతాఫలాలు అతని ముందు పెట్టింది.

"భక్తురాలు నీకు తెచ్చింది."

"ఈ భక్తురాలు మీకు సమర్పించుకుంటోంది" అన్నది నవ్వుతూ.

"సీతాఫలాలేనా?" అన్నాడు.

"సమస్తము ఏనాడో సమర్పించింది."

"అందుకే ఇలా పారిపోయి వచ్చావు కాబోలు."

"నీ క్షేమము కోరి మోహన్!" అతని చేతిని తన రెండు చేతులతో పట్టుకుంది గట్టిగా, పదిలంగా.

"అరుణ పొరపాటుగా అంది. తన పొరపాటు తెలుసుకుంది."

"లేదు. మీ కోసం అలా అంది. ఆమె అన్నా, అనక పోయినా నాకే ఓ మూఢనమ్మకం ఉంది. వివాహయోగం లేదు. ఇదివరకు తప్పిపోలేదా.

బలవంతంగా జరిగినా ఏం అనర్ధం జరగుతుందో" అన్నది దిగులుగా.

"ప్రశాంతీ! నా కోసం నువ్వు అలాంటి శంకలు వదిలిపెట్టు" ఆమె చేతిలో ఉన్న తన చేతినీ, ఆమెనూ దగ్గరకు లాక్కుంటూ అన్నాడు.

"లేదు. వివాహం చేసుకోవడం తప్ప మీరేం చేయమన్నా చేస్తాను" అన్నది. ఆమె మొండితనం, పట్టుదల అతను ఎరగనిది కాదు.

"నిజం, ఏం చేయమన్నా చేస్తావు కదూ?"

"అడిగి చూడు."

"అడిగినాక కాదంటే..." అతని వాలకం చూస్తే గుండె జల్లుమంది. అడగకూడనిది అడిగితే తను మాట ఇచ్చేసిందాయె. ఆమె భయం గ్రహించినట్టే ఆమెను వదిలేశాడు.

"అసమంజసమైన కోర్కె కోరతానని భయం వద్దు. నాకు చాలా గర్వంగా ఉంది. నీలాంటి స్నేహితురాలున్నందుకు" అది నిజమో వ్యంగ్యమో తెలియలేదు.

"పోనీ, ఈ ఒంటరితనం భరించలేకుండా ఉన్నాను. ఏదయినా పరిష్కారమార్గం చెప్పు."

"వివాహం చేసుకోండి!"

"యెవరిని?"

"నేను చెప్పిన వారిని చేసుకుంటారా?"

"చెప్పి చూడు."

"ఉమను చేసుకోండి."

"అలాగే" అతను మరేం మాట్లాడలేదు. ఆలోచిస్తూ పైకప్పుకేసి చూడసాగేడు.

"అబ్బాయి ఆకు వక్క..." మాష్టారుగారి భార్య వచ్చింది. అతను లేచి నిలబడ్డాడు.

"నాకు అలవాటులేదండీ" అని ఆమె వెనకాలే వెళ్ళి తనకోసం వేసిన పక్కపై పడుకున్నాడు. దీపం చిన్నది చేసి వృద్ధులు నిద్రబోయారు.



అరగంట తరువాత మన్మోహన్ కూడా నిద్రబోయాడు. ప్రశాంతికి నిద్ర పట్టలేదు, ఆలోచిస్తూ గంటలు గడిచిపోయేది కూడా గమనించలేదు.

"పాపం చిన్నపిల్ల బాబూ! ఏడు దాటితే గాని లేవదు."

"నేను మొదటి బస్సుకు వెళ్ళిపోవాలండీ" మన్మోహన్ కంఠము వినిపించింది. అతను వస్తాడు. రాత్రి తలుపు వేసుకోనందుకు కోపగిస్తాడు. లేచి తలుపు వేయాలనుకుంది. లేవలేక పోయింది. అతను రానే వచ్చాడు. నిర్వికారంగా, చనువుగా మంచం చివరన కూర్చున్నాడు. ఆమెను పరీక్షగా చూశాడు.

"రాత్రంతా నిద్రపోలేదు కదూ?"

"లేదు. ఇప్పుడే లేచాను."

"ఇంత చిన్న విషయంలో అబద్ధం యెందుకు? నువ్వు కోరినట్టే జరుగుతుందిగా, విచారం దేనికి?"

"విచారమా, లేదే. మీరు వెడతామన్నారు. టీ తెస్తాను." అతను తన ముఖం చూడరాదని లేచింది. కళ్ళూ, ముఖం కడుక్కుని వచ్చింది. టీ ఇవ్వగానే అతను వెళ్ళడానికి లేచాడు.

"నా మీద కోపం లేదుగా?" అడిగింది.

"ఊహుఁ" నవ్వుతూ వెళ్ళిపోయాడు. నామ మాత్రానికి అడగడానికి వచ్చాడు గాని నిజంగా అతనికి తనపై ప్రేమే ఉంటే ఆ భావం వ్యక్తం చెయ్యడూ, బాధపడడూ. మొగవారంతా అంతే. రాబోయే అశ్రువులు అదిమి పట్టింది.

## 22

ప్రశాంతికి చికాకుగా ఉంది. దీపావళికి తండ్రో, అన్నో వచ్చి బ్రతిమాలుతారనుకుంది. పోయిన సంవత్సరానికీ, ఈ సంవత్సరానికీ యెంత తేడా. వారు రాకపోవటం ఒక విధంగా అసంతృప్తిగా ఉంది. హెడ్‌మాష్టరు గారింట్లో పరధ్యాసగా గడుపుతోంది.

"అమ్మాయ్... అతని ఉత్తరం వచ్చిందా?"

"యెవరి ఉత్తరం పెద్దమ్మా?"

"అదే మరిచిపోయానమ్మా... మోహన్‌ది"

గతుక్కుమంది.

"రాలేదు."

"మంచివాడే. కార్తీకం ప్రవేశించింది మరెప్పుడు ముహూర్తం పెడతాడు?"

"ముహూర్తమా!" తెల్లబోయింది ప్రశాంతి. అప్పుడు గాని గుర్తుకు రాలేదు. ఆ రోజు మన్మోహన్ అన్నమాటలు, ఈ ముసలివారికి అవసరమైన విషయాలలో మతిమరుపు ఎక్కువ. అనవసరం అయిన విషయాలలో ఆసక్తి ఎక్కువ. తప్పించుకునే దారి ఏది? ఈ వృద్ధురాలికి ఏం జవాబు చెబుతుంది? మన్మోహన్‌పై అంతులేని కోపం వచ్చింది.

"ఈ కాలపు పిల్లలే ఇంత. ఏదీ జ్ఞాపకం ఉండదు" ముసి ముసిగా నవ్వుకుంది. ఆ రోజు మధ్యాహ్నము ఆఫీసులో హెడ్ మాష్టరుకు సహాయం చేస్తోంది. పేబిల్స్, రిపోర్టులు అన్నీ చేస్తోంది.

"ఏమ్మా ఇంకో టీచర్‌ని పంపమని రాయనా?"

"మీరు అవసరం అనుకుంటే రాయండి."

"మరి వివాహం తరువాత అబ్బాయి నిన్ను ఇక్కడే ఉంచుతాడా? నువ్వు వదలగానే, ఈ ఊరు రావటానికి ఎవరు సిద్ధంగా ఉంటారు?"

'భగవంతుడా !' అనుకుని ఆయన్నే చూడసాగింది. అతను కళ్ళజోడు సవరించుకున్నాడు.

"ఈ ఊరు నేను పుట్టి పెరిగిన ఊరమ్మా! ఏ గొప్ప కార్యం చేయలేకపోయినా ప్రాణం ఉన్నంతవరకు ఈ ఊరికి నా చేతనయింది చేయాలని. ఈ అమాయకులు పెద్ద పదవులు అలంకరించకపోయినా, ఏదో వడ్డీ వ్యాపారస్తులచే మోసపోకుండా ఉండాలని..."

"మీరు ఇప్పుడే ఏం ఆలోచించకండి. తరువాత చూద్దాం" అన్నది నిజం చెప్పలేక.



"నువ్వు చూద్దాం అంటే నాకు నిశ్చింత. నీ సహాయం ఈ జన్మలో మరువలేనమ్మా."

"అలా అనకండి మాష్టారూ! మీరు తండ్రిలా కాపాడకపోతే ఈ ఊర్లో నేను ఒంటరిగా ఉండగలిగేదాన్నా?"

"మనము ముఖం చూసుకున్న గడియ మంచిది" ఆయన నవ్వారు. ఇప్పుడెలా?

సాయంత్రం అన్యమనస్కంగా ఇంటికి వస్తోంది. సీతాలు తండ్రి కన్పించాడు. ఎన్నడూ లేంది చిరునవ్వు నవ్వాడు.

"నమస్కారం పంతులమ్మా!"

"నమస్తే."

"ఈ నెలలో మీ పెళ్ళి కాబోలు. అతన్ని ఈ ఊరికే బదిలీ చేయించుకోమను. మీరు వచ్చిన దగ్గరనుండి మా పిల్లలు బడికి యేలకు పోతున్నారు" అన్నాడు.

"అలాగే" అంది, ఏడ్వలేక. భగవంతుడా ఇదేం పరీక్ష. ఒకరిని ఒకరు ద్వేషించుకునే మా మధ్య ఈ ప్రేమాంకురం ఎలా అయింది? పోనీ వెంటనే టెలిగ్రామిచ్చి తను వివాహానికి సుముఖంగా ఉన్నానని తెలిపితే? ఆమె ముందు ఎన్నో దృశ్యాలు కదిలిపోయాయి.

* * *

వివాహం వైభవంగా అయిపోయింది. యెంతో ఆనందంతో దగ్గరగా వచ్చాడు మోహన్.

"చూడు ప్రశాంతీ! విజయం నాదే... అబ్బా ఏమిటీ తలనొప్పి?"

"ఏది నన్ను చూడనివ్వండి" ఆదుర్దాగా నుదురు నొక్కింది. అతని అరుపులకు అందరూ వచ్చారు. ఎవరో డాక్టరు దగ్గరకు పరుగెత్తారు. అప్పటికే అతని అరుపులు తగ్గాయి. డాక్టరు చూసి 'సారీ' అన్నాడు. అరుణ ఆడపులిలా వచ్చింది ముందుకు.

"రాక్షసీ! మా అమ్మను పొట్టన పెట్టుకున్నావ్! నీది 'నష్ట జాతకం' అని చెప్పలేదూ? మా అన్న పోయాడు...' అంటోంది.

"కాదు... అబద్ధం... కాదు... కాదూ" విపరీతంగా ఆయాసపడుతూ అరిచింది.

"అమ్మాయ్ ప్రశాంతీ!" ఆదుర్దాగా హెడ్ మాస్టారి భార్య భుజాలుపట్టి కుదుపుతోంది. తెలివి తెచ్చుకుని చూచింది. తను ఇంటి వసారాలో ఉంది.

"ఏమిటి పెద్దమ్మా?"

"నువ్వే చెప్పాలి. అయ్యో, ఎంత చెమట పట్టిందో ఇంత చలివేళలో" ఆవిడ దగ్గరకు తీసుకొని పమిటతో చెమట అద్దింది.

"వరండాలో కూర్చున్నాను. రావటమే తూలుతూ వచ్చావ్. ఇంటిముందుకు వస్తూనే 'కాదు... అబద్ధం' అంటూ అరిచావు."

"యెందుకో భయం పెద్దమ్మా" అంది అమాయకంగా.

"ఏ దారినుండి వచ్చావు?"

"ఆలయం వీధి నుండి?"

"మళ్ళీ ఆ దారిన రాకు. నీ పెద్దనాన్నకు చెబుతాను. ఇద్దరూ కలిసి వెడుదురు. ఆలయం వీధిలో కంసాలి అమ్మాయి అధ్వాన్నంగా చచ్చింది. దయ్యం అయింది అంటారు."

"ఫో పెద్దమ్మా" తన పిచ్చి ఆలోచనకు నవ్వుకుంది. "ఇలాంటివి నమ్ముతావా?"

"నమ్మొద్దు అనుకున్నాను. కాని నిన్ను చూచాక నిజమే అనిపిస్తుంది. పట్టపగలే అంతలా భయపడిపోతారా?"

'నిజం చెప్పినా కష్టమే. చెప్పక పోయినా కష్టమే.' అనుకుని ఆమెకు దూరంగా జరిగి ఇంట్లోకి వెళ్ళింది. టీ కాచుకుని త్రాగుతుండగా ఓ మనిషిని వెంట బెట్టుకు వచ్చిందా వృద్ధురాలు.

"రా తల్లీ. అసలే ఎఱ్ఱ పచ్చని పిల్లవు" అన్నది. ప్రశాంతి అర్థంగానట్టు చూచింది వారి వంక.

"మంకన్న ఇతను. యెలాంటి గాలిసోకినా నిముషంలో నయం చేస్తాడు" అంది.

"నాకు గాలీలేదు, ధూళీ లేదు పెద్దమ్మా!" అంది విసుగ్గా.



"ఈ కాలం పిల్లల సంగతి నాకు తెలియదూ?" బలవంతంగా బయటకు లాక్కు వచ్చింది. మంకన్న కూర్చోమన్న చోట నట్టింట్లో కూర్చుంది. అతను ఏవేవో పొగ వేశాడు. మంత్రాలు చదివాడు. దయ్యం ఏమిటోగాని పొగకు ఉక్కిరి బిక్కిరి కాసాగింది. అరగంట తరువాత అతను లేచాడు.

"అయిందా?" కోపంగా అడిగింది.

"కోపం యెందుకు అమ్మాయిగారూ! ఒక్క తుమ్ము వచ్చిందా చూడండి" వాడు గర్వంగా నవ్వాడు.

"అవునే అమ్మాయి." అది పెద్దావిడ.

"నా కట్నం ఇప్పిస్తే వెళ్ళిపోతానమ్మా" అతను తన సంచి కట్టడం మొదలుపెట్టాడు. మంత్రాలకేమోగాని అతని రూపు ఒంటి వాసనకు మాత్రం దయ్యం ఉన్నా పారిపోతుంది. ఒక కిలో బియ్యం, రూపాయి తెచ్చి పెట్టిందామె. ప్రశాంతికి కోపం వచ్చింది."

"ఇంత మాత్రానికి అంత ఖర్చా!"

"నువ్వు ఊర్కో అమ్మాయ్. నీ ప్రాణం కంటే ఈ ఖర్చు ఎక్కువేం కాదు." ఆవిడ కసిరింది. మంకన్న లేచాడు మళ్ళీ కూర్చున్నాడు. నశ్యం పట్టిస్తూ హెడ్మాస్టారు వచ్చారు. భార్య ద్వారా జరిగింది తెలుసుకుని చాలా విచారించాడు.

"అమ్మా! అమ్మాయిగారి చీరా జాకెట్టు నాకే వస్తాయి." మంకన్న నెమ్మదిగా అన్నాడు.

"అదేం?" ఆవిడ నోరు వెళ్ళబెట్టింది.

"మీకు తెలియనిదేం ఉంది తల్లీ, గాలి తిరగబెడితే నన్ను అనొద్దు" మంకన్న ఉచ్చు బిగించాడు.

"నీ ఆశ గూలా." ఆవిడ విసుక్కుంది. "ఇంకో చీర కట్టుకుని అది తీసుకురా తల్లీ."

"ఇది క్రొత్త చీర పెద్దమ్మా!"

"ఏం చేద్దాం. ఆ అంట్ల వెధవ ఆ ముక్క చెప్పితే పాత చీర కట్టి ఇద్దును. త్వరగా రా" అన్నది.

'తప్పదు' అనుకుని బట్టలు మార్చుకు వచ్చింది. కొత్త చీర, జాకెట్టు తీసుకుని తృప్తిగా, బొజ్జ నిమురుకుంటూ వెళ్ళిపోయాడు అతను.

"రేపటినుండి నా కోసం ఆగమ్మా." హెడ్‌మాష్టారి మాటలకు తల ఊపి వచ్చింది. తన ఊహ యెంత ప్రమాదం తెచ్చింది. రెండు రోజులలో మరో పదిమంది అడిగారు. 'ఈ ఊరు విడిచి పోవటం తప్ప గత్యంతరం లేదు' అనుకుంది.

"అక్కా!"

"ఏం ముత్యాలూ!" చదువుతున్న పుస్తకం పెట్టెపై పడేసి లేచి కూర్చుంది.

"నేను నీ పెళ్ళికి వస్తానక్కా!"

"ముత్యాలూ!"

"అక్కడేం గొడవ చెయ్యము. మేం అందరం పది పైసలు చొప్పున జమ చేస్తున్నాం. నీకు ఏమైనా కొందామని..." ప్రశాంతికి మతి పోసాగింది. ఇక లాభం లేదు. వికారాబాద్ వెళ్ళి తనను అక్కడనుండి మార్చమని అడగాలి. ముత్యాలును పంపి హెడ్‌మాష్టారు దగ్గరకు వెళ్ళింది.

"రామ్మా... ఏమేయ్... అమ్మాయి వచ్చింది."

"పెద్దమ్మతో కాదు మాష్టారూ, మీతో మాట్లాడాలని వచ్చాను." అన్నది.

"చెప్పమ్మా."

"రేపు నేను వికారాబాద్ వెళ్ళాలండీ, సెలవు కావాలి." అన్నది.

"జీతం గురించేనా? నేను ఇస్తూనే ఉన్నాను కదమ్మా. జీతం రాగానే తీసుకుంటాను. ఒక్కొక్కరికి ఆరునెల్లు పడ్తుందమ్మా."

ఇతనికి ఉన్న విషయం చెప్పితే అనవసర చిక్కులు. యెలా? ఏం చేయాలి? ఒక్కటే ఆలోచన.

"సరే. ప్రయత్నించమ్మా. తప్పేం లేదు." అన్నారు. అమ్మయ్య అనుకుంది. తను అక్కడనుండి పారిపోవాలి. అదే ఉత్తమమయిన మార్గము.

మర్నాడు వికారాబాద్ ప్రయాణం అవుతుండగా కవరు తెచ్చింది



లచ్చమ్మ. అది అందిస్తూ ముసి, ముసిగా నవ్వింది. అపరిచితమైన దస్తూరి. విప్పి ఆశ్చర్యపోయింది. మన్మోహన్ ఉత్తరం - వివాహానికి ఆహ్వానించే శుభలేఖ. తను అతని దస్తూరి ఎప్పుడు చూచిందని ! ఆత్రంగా విప్పింది. అరుణ పెళ్ళి పత్రికలాగే చాలా సింపుల్‌గా ఉంది. వధువు స్థలం పేరు ఇవ్వలేదు. "పద్దెనిమిదో తారీఖున జరుగు నా వివాహము. తేనీటి విందుకు రమ్మని ప్రార్థన." అంతే క్రింద ఒక ప్రక్క టైము, రెండోపక్క అతని పేరు ఉన్నాయి. ఒణుకుతున్న చేతులతో ఉత్తరం విప్పింది ప్రశాంతి.

"ప్రశాంతీ!

నీ సలహా ప్రకారం ఒంటరితనం పోగొట్టుకోవాలని వివాహం చేసుకుంటున్నాను. వివాహం తప్ప నేను ఏది కోరినా కాదనని ప్రమాణం చేశావు గుర్తుందా! అందుకే నా వివాహానికి ముఖ్య అతిథివి నీవే. నీవు తప్పక ఆ ఉదయం బండిలో రావాలి. నేను స్వయంగా వచ్చి వివాహం జరిగే చోటుకు తీసుకువెడతాను. నా ఈ కోర్కె చెల్లిస్తావు కదూ!

నీ

మనూ."

"నా మనూ కాదు..." అని హృదయం గోల పెట్టింది. అతి కష్టం మీద ఇల్లు చేరింది. అదృష్టం ఏమంటే బయట యెవరూ లేరు. గదిలోకి వెళ్ళి కరువు తీరా ఏడ్చింది. తను మన్మోహన్‌ను పోగొట్టుకుంది. నాలుగు రోజులలో, తొంభై ఆరు గంటలలో అతను పరాయిసొత్తు అవుతాడు. అతని వివాహం చూడగలదా! వెళ్ళక తప్పదు. అతనికి మాట ఇచ్చింది. సాయంత్రం అయిందే తెలియలేదు.

"ప్రశాంతి వికారాబాద్ నుండి రాలేదా?"

"ఇంకా రాలేదండీ! చీకటి పడింది. ఆఖరి బస్సు వచ్చిందా."

"నాకు తెలియదు. కుర్రాడిని పంపాను. యెవరయినా తెలిసినవారున్నట్టు చెప్పిందా?"

"లేదు. మీరు మరీ పని యావ మనుషులండీ. లచ్చమ్మను తోడు పంపరూ" హెడ్ మాష్టరు దంపతుల మాట విని విధిలేక బయటకు వచ్చింది.

"నువ్వు వచ్చావా?" అన్నారు ఇద్దరూ.

"నేను వెళ్ళలేదు. నా ఆరోగ్యం బావుండ లేదు. ఆదివారం హైద్రాబాద్ వెడుతున్నాను" అన్నది.

"ముఖం అలా వాచిందేం?"

"ఏం లేదు" తప్పించుకుంది. వారు మరోరకంగా అనుకున్నారు.

"అతను ఉత్తరం రాయలేదు. ఆ దిగులు ఏమో..." అందావిడ అతను 'కావచ్చు' అని తలూపాడు. రాత్రింబవళ్ళు ఒకటే ఆలోచన. చివరకు మన్మోహన్ తృప్తికోసం వెళ్ళటానికే నిశ్చయించుకుంది.

## 23

నాంపల్లి స్టేషన్‌లో బండి ఆగింది. ప్రశాంతి గుండెలు కొట్టుకోసాగేయి. జనం కిట, కిటలాడుతున్నారు. అందరిలోను ప్రత్యేకమైన రూపం, మన్మోహన్‌ది. ఆమెకు చెయ్యూపాడు. అతని ముందు తన బేలతనం ప్రదర్శితం కారాదని నిగ్రహించుకుని బండి దిగింది. అతను చిరునవ్వుతో స్వాగతం పలికాడు. ఆ రోజు మరీ ప్రత్యేకంగా కన్పించాడు. తెల్లని ధోవతి, లాల్చీలో, మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తోంది. కళ్ళలో కాంతి చెంపలపై పడి, ఆకుపచ్చని జడలీనినట్టు భ్రమ కలుగజేస్తుంది.

"సామాన్లున్నాయా?"

"ఉహుఁ" అన్నది.

"పద..." అతని వెనకాలే బయటికి వచ్చింది. కొత్త కారుంది. దానికి సన్నగా పూలదండలున్నాయి.

"యెవరిది కారు?"

"అరుణ భర్తది."

"మరో గంటలో ముహూర్తం ఉంది. ఏర్పాట్లు చూడకుండా నా కోసం వస్తే అందరూ ఏమనుకుంటారు? ముఖ్యముగా ఉమ" అన్నది కార్లో కూర్చుంటూ. అతను వెళ్ళి స్టీరింగ్ తీసుకున్నాడు.

"అంతా అత్తగారింటి వారే తయారు చేస్తున్నారు. నా పని



పెళ్ళికూతురికి మూడుముళ్ళు వెయ్యటమే" నవ్వుతూ అన్నాడు. తనే కాదని అంది. అంతమాత్రాన బాధ ఉండదా? అతను అలా నవ్వుతాడేం? అతనికేం అన్పించటం లేదా? కారు వెళ్ళి ఖైరతాబాద్ హనుమాన్ మందిరం ముందు ఆగింది. అక్కడ చాలా ప్రశాంతంగా ఉంది.

"ఈ పరిసరాలకు నీ రాక తెలుసు..." చిలిపిగా నవ్వాడు. అందుకే ప్రశాంతత అన్నట్టు చూచాడు.

"ప్రయాణం కులాసాగా జరిగిందా?" తిరిగి చూచింది. అరుణ, ఉమ నిల్చుని ఉన్నారు. వారికి కొద్ది దూరంలో ఏవో పనులు పురమాయిస్తూ అరుణ భర్త ఉన్నాడు. మన్మోహన్ ముఖ్య స్నేహితులూ, సునంద అక్క, బావ ఉన్నారు లోపల. ఉమకేసి చూచింది. ఆమె నవ్వింది. 'మన్మోహన్‌ను గెలిచానని కాబోలు నవ్వు అనుకుంది. ఉమ, అరుణ ఒకే రకంగా తయారయ్యారు. ఆరెంజ్ బార్డరున్న కంచి పట్టు చీరలు కట్టుకున్నారు. పగడాల నెక్లెసులతో చూడ కళ్ళు చాలవు అన్పించేలా ఉన్నారు. 'కాబోయే వదినా మరదళ్ళు అయిరి' అనుకుంది.

" రా..." మన్మోహన్ పిలిచాక వారిని అనుసరించింది.

"ఏమ్మోయ్ మరదలా! నువ్వేనా అని అనుమానంగా ఉంది" గలగల నవ్వుతూ సునంద అక్క వచ్చింది.

"యెందుకో ఆ అనుమానం?"

"ఆడపులిలా గర్జించే అమ్మాయివేనా అని..."

"వదినగారూ! నా సంగతేమోగాని నీవు చాలా సంతోషంగా ఉన్నావు. మీ సోదరుడు ఆడబిడ్డ కట్నం దండిగా ఇప్పిస్తున్నాడేమిటి?" లేని ఉత్సాహం తెచ్చుకుని అడిగింది.

"అసలు మూడుముళ్ళు పడేవరకు వాడికే టికానా లేదు, నాకేం ఇప్పిస్తాడు. పద పెళ్ళికి. ఇలా సాదాగా ఉంటావా."

"ఉంటే భోజనం పెట్టవా?"

"ఊహుఁ" నవ్వుతూ లాక్కుపోయింది. మంటపం దగ్గర ఏదో అంటున్నాడు మన్మోహన్. ఉమ విరగబడి నవ్వుతోంది. వాళ్ళిద్దరూ చాలా

సన్నిహితంగా నిల్చున్నారు. 'ఇంకా కొన్ని గంటలు ఆగలేరు కాబోలు. బడాయి కాకపోతే నాకు చూపించాలనా!' కసి, రోషం, ద్వేషంతో మనసు ఊగిపోసాగింది. హఠాత్తుగా ఇద్దరూ ప్రశాంతిని చూచారు. అదే చెరగని నవ్వుతో మన్మోహన్ చూస్తున్నాడు. ఉమ తనను తాను సంబాళించుకున్నది.

"రా ప్రశాంతీ! బట్టలు మార్చుకుందువుగాని."

"ఎవరన్నా అడిగితే పనిమనిషని చెప్పు. నేను ఇలాగే ఉంటాను." రోషంగా అంది. ఉమ వెళ్ళిపోయింది. మన్మోహన్ దగ్గరగా వెళ్ళాడు.

"ప్రశాంతీ!"

"ఏమిటి?"

"నీలో మొదట చూచిన కోపచ్ఛాయలు ఇన్నాళ్ళకు మళ్ళీ కన్పిస్తున్నాయి. వెళ్ళి బట్టలు మార్చుకో. నా ఇష్ట ప్రకారంగా అందరికి ఒకేలాంటి బట్టలుతెచ్చాను" మృదువుగా చెప్పాడు.

"తప్పదా?"

"నాకోసం ఏమయినా చేస్తానన్నావ్!"

"అన్నాను" కసిగా అని గబ గబా వెళ్ళింది లోపలికి. అప్పటికే చీర, జాకెట్టు సిద్ధంగా పట్టుకుని ఉంది ఉమ. అవి తీసుకుని ఆలయంలో వారు తీసుకున్న సత్రపు గదిలో మార్చుకు వచ్చింది. ఉమ తలలో పూలు పెట్టింది. బాజావాళ్ళు వచ్చారు. 'ఛోడ్ బాబుల్ కా ఘర్' అనే పాత పాట వాయిస్తున్నారు. బ్రాహ్మడు కూర్చున్నాడు. అందరూ మంటపం దగ్గర చేరారు.

"మొదట ఈ పూలదండలు మార్చుకోండి" బ్రాహ్మడి కేకలు వినిపిస్తున్నాయి. పరధ్యాసగా చూస్తున్న ప్రశాంతి మెడకు చల్లగా మృదువుగా గిలిగింతలు పెట్టినట్టు అయింది. తేరుకుని చూచేసరికి మెడలో దండ.

"ఇదేం పరిహాసం!" అంటూ దండ తీసింది అది విసిరి వేయ బోయింది. సరిగ్గా సమయానికి తలవంచాడు మన్మోహన్. దండ సరిగ్గా మెడలో పడింది. వెంటనే ఉమ భుజాలు పట్టి పీటలమీద కూర్చోబెట్టింది. బ్రాహ్మడు మంత్రాలు చదువుకుపోతున్నాడు. ఆమె కళ్ళు వెళ్ళబెట్టి చూడడం తప్ప ఏం అనలేకపోతోంది. ఒక వైపునుండి సునంద బావ ఒకటే ఫోటోలు



లాగుతున్నాడు. మంగళ సూత్రాలు పట్టుకొని మన్మోహన్ లేచాడు. ఆనందోత్సాహంతో ఉన్న ముఖం మరింత అందంగా కనిపిస్తోంది. ఆమె నోరు విప్పే లోగానే, ఉమ జడ ఎత్తడం అతను మంగళ సూత్రాలు ముడివేయటం జరిగిపోయింది.

"కాస్త చిరునవ్వు రానీ పెదాలపైకి." అరుణ నవ్వుతూ అంది. చుట్టూ కలయ చూచింది. ఏం జరగనట్టు అందరూ మామూలుగా ఉన్నారు.

"ఏమిటిది?"

"పెళ్ళి." ఉమ కొంటెగా జవాబు ఇచ్చింది; నవ్వుతూనే ఇద్దరికీ బ్రహ్మముడి వేసింది.

"లేచి మూడు చుట్టూ హోమగుండం చుట్టూ తిరగండి." బ్రాహ్మడి ఆదేశం ప్రకారం లేచారు. తనే లేచిందో అతను లేపాడో అర్థం కాలేదు. అతను చిటికెనవ్రేలు అందుకుని హోమగుండం చుట్టూ తిరిగారు. మన్మోహన్ ఆదేశం ప్రకారం తలంబ్రాల తంతూ, నాగవల్లి అన్నీ తగ్గించి వేశారు.

"మీరు... మీరు... ఏం చేశారు?" అస్పష్టంగా అంది.

"తరువాత చాలా సమయం వుంది. అమ్మకు నమస్కరించుదాం పద." అతన్ని ఏమనలేకపోయింది. ఇద్దరూ ప్రక్కకు అరుణ వెంట నడిచారు. వారు తీసుకున్న గదిలో బల్లపై అతని తల్లి ఫోటో వుంది. దాని ముందు అగరొత్తులు వెలిగించి ఉన్నాయి. చిన్న మాణిక్యంలో జ్యోతి వెలుగుతోంది. ఇద్దరూ పటం ముందు మోకరిల్లి లేచారు. అతను లాల్చీ జేబులోకి చేయిపోనిచ్చి బంగారు గొలుసు తీశాడు. ఆనాడు అతని తల్లి ఇచ్చింది. అది ప్రశాంతి మెడలో వేశాడు.

"పద..." ఆమె చేతిని పట్టుకున్నాడు.

"ఎక్కడికి?"

"ఇంకా పెద్దలు లేరూ?"

అంతా కలలా వుంది. కలే, నిజం ఇలా వుండదు అనుకుంది. "మేం వస్తాం మా కార్లో మీరు వెళ్ళండి." సునంద బావ సామాన్లు లోపల పెట్టిస్తున్నాడు.

ఒకవైపు ఆనందం, మరోవైపు విస్మయం, ఇంకోవైపు అతని సాహసానికి కోపం వస్తున్నాయి. అతని వెనకాలే కారు యెక్కింది. ముందు అరుణ, ఆమె భర్త కూర్చున్నారు. ఏదయినా అడగాలన్నా ఇబ్బందిగానే వుంది. ఉమ వచ్చి ఆమె ప్రక్కన కూర్చుంది.

"ఇప్పుడయినా నవ్వమ్మా వదినా!" అరుణ హాస్యం ఆడింది. ఒకసారి తలెత్తి చూచి మళ్ళీ దించుకుంది.

అరుణ వెనక్కు తిరిగింది. చాలా మృదువుగా, మెల్లగా క్షమార్పణ కోరింది.

"నన్ను క్షమించు వదినా! నీ రూపం, ఒకే రకమైన గుణం చూచాను. మరోవైపున్న ప్రేమమూర్తిని చూడలేదు. నాకు నిజంగా యెంత గర్వంగా వుందో. అన్నయ్య ఖచ్చితంగా అతని కోరిక మన్నించి వస్తావని అన్నా నిన్ను చూచేవరకు నమ్మకం కలుగలేదు." అన్నది. అప్పటికి ప్రశాంతికి నోటమాట రాలేదు. జరిగింది నిజం అని నమ్మకం కలగటం లేదు.

"మాట్లాడమ్మా చెల్లాయ్! ఈ అన్నా చెల్లెలున్నారు చూశావు బలవంతంగానైనా తన పంతం చెల్లించుకుంటారు. మరి యెలా నెగ్గుకు వస్తావో." అరుణ భర్త గల గల నవ్వుతున్నాడు.

"మీరు నెగ్గుకు రావటంలే. అలాగే." అరుణ జవాబు ఇచ్చింది. ప్రక్కన మన్మోహన్ స్పర్శ గిలిగింతలు పెట్టినట్టే ఉంది. ధైర్యంగా తలతిప్పి అతని వంక చూచింది. అతను రోడ్డువంక చూస్తున్నాడు. 'అతను గంభీరంగా ఉన్నప్పుడు మరీ ఉన్మత్తులను చేస్తాడు' అనుకుంది. ఉమ తన వంకే చూడటంతో ముఖం తిప్పుకుంది మెల్లగా. సంతోషం హృదయమంతా ప్రాకి ముఖంమీద నిలిచిపోయింది.

"ఉమా!"

"ఊఁ."

"మీరంతా మొదటే ప్లాను వేశారు కదూ?" చిన్నగా అడిగింది.

"అంతా కాదమ్మోయ్ మీ ఆయనే. పెళ్ళి కూతురు లేకుండా ఏర్పాట్లేవిటని అందరము గోల పెట్టినా వినలేదు."



"థాంక్ గాడ్! నాకయితే ఆఖరి క్షణం వరకు ఒకటే భయం." అరుణ గుండెలు పట్టుకున్నట్టు చేసింది.

ఇన్ని రోజులలో అతని రూపం ఊహించి, ఊహించి కబుర్లు చెప్పిన ప్రశాంతికి అతను ప్రక్కనున్నా మాట్లాడాలనిపించటం లేదు. ఆమె హృదయములో ఒకే ఒక భయం పచ్చి పుండులా సలుపుతోంది. ఈవివాహం అతని పాలిట శాపం కాదు కదా... పోనీ అలాంటి దేదయినా అతనితో పాటు తను... ఊహించలేకపోయింది. తన ఊహలలో కారు ఆగటం గమనించలేదు. ఉలిక్కిపడి చూచింది. కారు ప్రశాంతి నిలయము ముందు ఆగింది. యెవరెవరో చుట్టూ చేరారు. ప్రశాంతి కొత్త పెళ్ళికూతురులా అలంకరించుకోక పోయినా భవనము మాత్రం అత్యంత శోభాయమానంగా వెలిగిపోతోంది అలంకరణతో. ఉమ, అరుణ దిగిపోయింది కూడా తను చూడలేదు.

"ఏమిటిది మోహన్?" అతని చేయి పట్టుకుని అడిగింది.

"నువ్వు ఈ ఇంట్లో అడుగు పెట్టే అర్హత సంపాదించి వస్తానని అనలేదూ." ... అతను దూరంగా చూచాడు. కాంతమ్మ ఇంటి వారు, బంధువులు వెంటరాగా హారతి తెస్తోంది.

"ప్రశాంతీ!" ఒక చేయి ఆమె భుజాల చుట్టూ వేసి, రెండోచేయి అలాగే ఆమె చేతిలో వుంచాడు.

"నువ్విక్కడ ఉండటం లేదు. ఆఖరు ఘట్టంలో వారికి మనస్తాపం కలిగించవద్దు. నాకోసం ... ఉత్సాహంగా వుండు. అనుమానాలు, శంకలు అన్నీ వదిలేయి. వదిలేస్తావు కదూ?" అతని కళ్ళల్లోని, ప్రేమారాధనకు కరిగిపోయింది. చుట్టూ జనం లేకపోతే అలాగే అతని చేతులలో వాలిపోయేది. భుజాల చుట్టూవున్న అతని చేతిని తప్పించుకుంటూ చిన్నగా నవ్వింది. ఆ నవ్వులో అతనికి యెన్నో ప్రమాణాలు వినిపించాయి.

## 24

శాస్త్రోక్తంగా కన్యాదానం చేశాడు రఘుపతి. వేణు, సునందలు షామియానాలో అతిథులకు పానీయాలు చూస్తున్నారు. కట్నాలు, కానుకలు

ఏమీ వద్దని నిరాకరించాడు మన్మోహన్. స్నేహితులు బహుమతులు ఇస్తున్నారు. వేణు కూడా పింక్ కలర్ పేపర్ చుట్టిన ప్యాకెట్టు తెచ్చి చదివించాడు. కాంతమ్మ కోరిక తీరింది. తను ప్రశాంతిని ఇక చూడనేమో అని ఒకటే భయపడింది.

అందరూ భోజనాలవైపు వెళ్ళారు. వధూవరులు ఇంట్లోకి వెళ్ళారు. కాంతమ్మ దిష్టి తీసి కూతుర్ని హృదయానికి హత్తుకుంది.

"నాకెంత పెద్దశిక్ష వేశావే. మన్మోహన్ వాగ్దానం చెయ్యకపోతే చచ్చిపోయేదాన్ని" ఆదరంగా ముద్దుపెట్టుకుంది.

"వాగ్దానమా?"

"అవును శాంతీ! అమ్మ నిన్ను గూర్చిన దిగులుతో మంచం పట్టింది. మా బావగారు... బావగారనవచ్చునా?" కొంటెగా చూచింది ప్రణతి. "అమ్మకు నిన్ను తీసుకువచ్చి చూపుతానని ప్రమాణం చేశారు."

"మరదలు గారూ! మీ అక్కయ్య మూడ్స్ యెలా ఉంటాయో అని ఒకటే ఆదుర్దా. ఉదయం నుండి దాహంగా ఉంది." అతనా సంభాషణ తప్పించాలనే అంటున్నాడని తెలిసి ప్రణతి వెళ్ళి ఇద్దరికీ ఆరెంజ్ జ్యూస్ తెచ్చి ఇచ్చింది.

"ప్రణూ! నువ్వు అక్కను పైకి తీసుకువెళ్ళు" అని కాంతమ్మ చెప్పింది.

"సార్! మిమ్మల్ని బయటకు రమ్మంటున్నారు" అని ఓ విద్యార్థి మన్మోహన్‌ని పిలిచాడు.

అక్కచెల్లెళ్ళు కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు. ప్రణతి చెప్పే విషయాలు విస్మయంగా వింటోంది.

"నాకీ రోజు చాలా సంతోషంగా ఉందే" అక్క జడలో పూలు పెడుతూ అన్నది. ప్రణతి కళ్ళల్లో నీలినీడలు కనిపించాయి. దగ్గరకు లాక్కుంది.

"ప్రణూ..."

"ఇదిగో శాంతీ! ఈ చీర మన్మోహన్ నీ కోసం ఇష్టపడి కొన్నారు." బీరువా నిండా కొత్తచీరలే.



"ఇవన్నీ యెవరు కొన్నారు..." అంది.

"మేమే. ఈ రెండు మాత్రం మీ ఆయన సెలక్షన్" అన్నది. అందులో తేలికగా, లేత గులాబిరంగులో ఉన్న చీర ప్రశాంతికి చాలా నచ్చింది.

"చీర మార్చుకో" అని గదిలో పడిన పూలు తీసి ఏరసాగింది. చుట్టూ కలయచూసింది. తన గది కాదన్న భ్రమ కలుగుతోంది. ప్రణతి పని అని తెలిసిపోయింది.

"శాంతీ! అతని మాటలు నమ్మి నిన్ను అవమానించానే. అవేం మనసులో పెట్టుకోకు."

"ప్రణూ?"

"చెప్పవే!"

"నాదో కోర్కె... తీరుస్తావా."

"అడగవే. ప్రాణాలు కావాలన్నా ఇస్తాను."

"ప్రాణాలు నాకెందుకే!" పోయిన ఉత్సాహం, ఆనందము తిరిగి వచ్చాయి.

"మరేం కావాలి?" ప్రశాంతి చెల్లెలు వంక తిరిగింది. ఇద్దరి ప్రతిబింబాలు యెదుటి అద్దంలో కనిపిస్తున్నాయి. ప్రశాంతి చెల్లెలుగా ఉంది. ప్రణతి అక్కలా కన్పిస్తోంది. మనిషిని విచారం ఇంతగా కృంగదీస్తుందా? చెల్లెలు భుజాలపై చేతులు వేసింది. పరీక్షగా చూసింది.

"ఏది కావాలన్నావ్?"

"అడిగినాక నిరాకరిస్తే!"

"ఒట్టు అంటున్నానుగా?"

"ప్రణూ! తప్పు చేయటం మానవనైజం, అది తెలుసుకోవటం మానవత్వమున్న మనుషుల లక్షణం. రేపు నువ్వు విద్యాసాగర్‌కు ఉత్తరం రాయి."

"శాంతీ!"

"కాదే! నీ అక్కగా అడుగుతున్నాను. జరిగినదాంట్లో నా పొరపాటు ఉంది."

"శాంతీ!" ప్రణతి సజలనయనాలతో అక్క భుజం మీద వాలిపోయింది.

అప్పుడే లోపలికి వచ్చిన మన్మోహన్ వారినలా చూచి ఏదో గంభీరమైన చర్చే జరిగిందని ఊహించాడు. ప్రశాంతి కళ్ళల్లో నీరూరింది. భర్తను చూచి ప్రణతిని దూరం జరిపింది.

"ఏమిటి? ఏం జరిగింది ప్రణతీ?"

"బావా! నువ్వు అదృష్టవంతుడివి. మా అక్కని కాదుగాని ప్రశాంతిలాంటి స్త్రీ దొరకటం ఎంతో అదృష్టం."

"నిజం ప్రణతీ! ఈ సంతోష సమయంలో ఒకే ఒక వెల్తి అందరిని బాధిస్తోంది. గతం మరిచిపోలేనంత భయంకరమైనదేం కాదు. మొగవారి బలహీనతలు స్త్రీలు విశాల హృదయముతో అనాదిగా క్షమిస్తూనే ఉన్నారు."

"వద్దు, బావా! అంతంత పెద్దమాటలు వద్దు. నా కోసం కాకపోయినా, రేపు ఈ లోకంలోకి వచ్చే శిశువు కోసమైనా, అతనితో రాజీ పడక తప్పదు. మన సంఘం ఇంకా భర్తను విడిచిన స్త్రీలను విశాల హృదయంతో అర్థం చేసుకునేంత పరిణతి చెందలేదు." ఆమె కళ్ళమ్మట నీరు కారింది.

చనువుగా ముందుకు వంగి కన్నీరు వత్తాడు మన్మోహన్.

"వస్తానే" అనుకుంటూ, త్వరగా గదిలోంచి వెళ్ళిపోయింది ప్రణతి. ప్రశాంతి చెల్లెలు వెళ్ళిన దిక్కే చూస్తూ నిలబడింది. భుజంపై భర్త బలమైన చేయి పడగానే యిటు తిరిగింది.

"ప్రశాంతీ" అతని పిలుపు ఎప్పటికన్నా మధురంగా ఉంది.

"ఊఁ" అన్నది. అతనామెను దగ్గరగా తీసుకుంటూ తలుపులు వేశాడు.

"మీ అన్నయ్య బహుమతి ఏమిటో తెలుసా?"

తెలుసు అన్నట్టు నవ్వింది. ఆ నవ్వులో మునుపటి కొంటెతనం, చురుకుతనం కన్పించాయి.

"చెప్పు చూద్దాం."

"ఏ పాతికవేలకో చెక్కు అయి ఉంటుంది."



"కాదు. యాభైవేలకు" అన్నాడు. అతని నుండి దూరం జరిగి సీరియస్‌గా జానతో అతని పొడుగు కొలువసాగింది. ఆమె భావం గ్రహించినట్టే అతను నవ్వాడు.

"ఏం లాభం. అడుగుకు పదివేలు కూడా గిట్టుబాటు కాలేదు" ఇద్దరి నవ్వులతో గది నిండిపోయింది.

"తిప్పి ఇస్తే బావుండదు. ఏం చేయాలి."

"మీ పేరున డిపాజిట్ చేయండి."

"ప్రశాంతీ!"

"తప్పేం ఉంది? ఇవ్వలేమని ఏడ్చేవారిని పీడిస్తే తప్పుగాని సంతోషంగా ఇస్తున్నారు."

"అయినా నా ఆశయాలకే విరుద్ధం." అన్నాడు. ఆమె ఏం అనకుండా ఆలోచిస్తోంది, మంచంపై కూర్చుంది. అతను వెళ్ళి ప్రక్కనే కూర్చుని ఆమెను లాగాడు. అతని వడిలో పడింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" ముందుకు వంగాడు.

"మొగవారిని గూర్చి."

"ఏమిటో!"

"స్త్రీ తాను వరించిన పురుషుని కోసం, తన ఆశయాలను, అభిరుచులను చంపుకుంటుంది. పురుషుడు..." ఆ పైన ఆమెను మాట్లాడనివ్వలేదు. ఇద్దరూ మైమరచి పోయారు. చాలాసేపు అలాగే ఉండిపోయారు. అతను లేచి కూర్చున్నాడు.

"అందరి సంగతేమోగాని... నీవు మాత్రం..."

"నీవు మాత్రం...." అతన్ని అనుకరించి వెక్కిరించింది. "మీకోసం ఉంటాననుకున్నారు కాబోలు. హెడ్‌మాష్టరుకు నేను మాటిచ్చాను. రేపు వెడతాను." అన్నది.

"రేపు నీకంటే ముందే మా బంధువులబ్బాయి వెళ్ళి నీ ఉద్యోగంలో జాయిన్ అవుతున్నాడు."

"ఏమిటి?" లేవబోయింది.

"ఈ ఏర్పాట్లు అన్నీ చేశారా? నేను రాకుంటే తెలిసేది."

"అందమైన సమయంలో వాదన లెందుకు. నాకు నిశ్చయంగా తెలుసు, నాకోసం వస్తావని." మరింత దగ్గరగా జరుపుకున్నాడు.

"అది నా బలహీనత..."

"కాదు, నా అదృష్టం."

"ఏదయినా రేపు ఒకసారి వెళ్ళి ఆ దంపతులను చూచి ఆశీస్సులు పొంది రావాలి. వారే లేకపోతే పల్లెలో..."

"అమ్మాయిగారికి ఇంకా తెలియదు కాబోలు, వారు నా చిన్నప్పటి గురువులు. నీవు ఊరు చేరేలోపలే నీ గూర్చి వార్తలు అందాయి." అతను కొంటెగా చూచాడు.

ఆమె కళ్ళు గర్వంగా మెరిశాయి. తన రెండు చేతులు అతని మెడచుట్టూ వేసి నిశ్చింతగా కళ్ళు మూసుకుంది.

"అతను ఆలోచనలో పడి పోయాడు. ఒక రోజు స్నేహితులు చేసిన చాలెంజి గుర్తుకు వచ్చింది. 'మరోజన్మ యెత్తినా ప్రశాంతికి దగ్గర చేరలేవని' ప్రశాంతి ఇలా తన వడి, సమస్తం అర్పించి నిశ్చింతగా ఉందని తెలిస్తే ఏమనుకుంటారో! చక్కటి చిరునవ్వు వెలసింది అతని పెదవులపై. అతని కళ్ళు విజయగర్వంతో మెరిశాయి.

